
# లోకానికి నేనే వెలుగు





## కృత్రిమ మేధస్సు వినియోగములో శ్రీసభ సూచనలు

**(on Artificial Intelligence)**

సంపుటి : 48 | అక్టోబర్ - డిసెంబర్ 2025 | సంచిక : 4

భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం, హైదరాబాదు.

## ప్రచురణ

భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయ ప్రచురణలు
రామాంతపురం, హైదరాబాదు.

**సంపాదక వర్గం :**

ఫాదర్ దొడ్డ రాజా
ఫాదర్ మెడంకి ఆనంద్ అంద్రూ
ఫాదర్ కనపర్తి ప్రకాశ్
ఫాదర్ వల్లే విజయ జోజి బాబు

**గురు విద్యార్థుల బృందం :**

బ్రదర్ పచ్చిగొర్ల ఒబేజ్
బ్రదర్ పగుర్ల భానుప్రసాద్
బ్రదర్ పెంటారెడ్డి బాల సంజయ్
బ్రదర్ బడిపాటి జాకబ్
బ్రదర్ అరికోట్ల భరత్ కుమార్
బ్రదర్ బాలసాని ప్రభు దాస్
బ్రదర్ దొప్పలపూడి రవీంద్ర
బ్రదర్ గొన్నాబత్తుల హేమంత్
బ్రదర్ కాకుమాను జాన్‌రాజు
బ్రదర్ కొట్టె అరవింద్
బ్రదర్ తుడుం సంపత్
బ్రదర్ తురకా మహేష్
బ్రదర్ చిన్నం హూపర్ వర్ధన్
బ్రదర్ గుత్తుల ప్రేమ్ కుమార్
బ్రదర్ ఓలిగింటి జోసఫ్ డాల్ఫిన్
బ్రదర్ ఎక్కిరాల శౌరి రాజు

## చందా వివరములు

సంవత్సరానికి మీ చందాను రూ॥ 100/- యం.ఓ., డి.డి.ల ద్వారా
**St. John's Regional Seminary Society, Hyderabad**
పేరున పంపించి మమ్మల్ని ప్రోత్సహించమనవి. అన్ని సంప్రదింపులకు
మరియు మీ విరాళము పంపవలసిన అడ్రస్:

**St. John's Regional Seminary**
Ramanthapur, Hyderabad - 500 013.
Ph: 91-040-29561761, 29561762
e-mail: stjohnshyd2@gmail.com

# లోకానికి నేనే వెలుగు

సంపుటి : 48 అక్టోబర్–డిసెంబర్ 2025 సంచిక : 4

## కృత్రిమ మేధస్సు వినియోగములో శ్రీసభ సూచనలు

**(on Artificial Intelligence)**

**ఫాదర్ దొడ్డ రాజా**

సంచిక సంపాదకులు

**ఫాదర్ కనపర్తి ప్రకాశ్**

ప్రధాన సంపాదకులు

భక్త యోహాను ప్రచురణలు, భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం

రామాంతపురం, హైదరాబాదు–500 013.

ఫోన్ : 91-040-29561761, 29561762

E-mail : stjohnshyd2@gmail.com
Website : stjohnseminary.org

# విషయసూచిక


సంపాదకీయం

- *ఫాదర్ దొడ్డ రాజా.........................................* **05**

**1. కృత్రిమ మేధస్సు**

- *మహో ఘన. ఉడుమల బాల, విశాఖ అగ్రపీఠ కాపరి..........* **08**

**2. కృత్రిమ మేధస్సు: సామాజిక మరియు ఆధ్యాత్మిక ఎదుగుదలకు సహాయమా లేదా ఆటంకమా?**

- *ఆంగ్లమూలం: ఫాదర్ యం. జేవియర్ రెక్స్, SJ*
- *అనువాదం: బ్రదర్ గొన్నాబత్తుల హేమంత్...................* **14**

**3. మానవ బుద్ధి మరియు కృత్రిమ మేధస్సు : శ్రీసభ సమగ్ర ధార్మిక - నైతిక దృష్టికోణం**

- *డీకన్ కొమ్మెర పవన్ .........................................* **32**

**4. వేదాంత శాస్త్రము మరియు దైవశాస్త్ర సాంప్రదాయంలో తర్కశక్తి యొక్క పాత్ర**

- *బ్రదర్ గుత్తుల ప్రేమ్‌కుమార్ .................................* **39**

**5. సాంకేతిక పరిజ్ఞాన (కృత్రిమమేధస్సు) వినియోగంలో నైతిక విలువల పాత్ర**

- *బ్రదర్ దొప్పలపూడి రవీంద్ర .................................* **48**

**6. కృత్రిమ మేధస్సు మరియు సమాజం**

– *డీకన్ కారసాల విజయబాబు* ................................ **58**

**7. కృత్రిమ మేధస్సు, ఆర్థిక వ్యవస్థ మరియు పని**

– *బ్రదర్ మైలాబత్తుల ఆధిత్య* .................................. **63**

**8. కృత్రిమ మేధస్సు, వినియోగం పట్ల వ్యక్తిగత బాధ్యత**

– *బ్రదర్ బలసాని ప్రభుదాస్* ................................... **68**

**9. కృత్రిమ మేధస్సు విగ్రహారాధనతో సమానమా?**

– *బ్రదర్ బాసాని ధీరజ్* ......................................... **76**




# సంపాదకీయం



దేవుడు మానవజాతిని సృజించెను. తన పోలికలో మానవుని చేసెను (ఆదికాండము 1:27). మనలో ఆయన ఆత్మ ఉంది. "దేవుడు మానవుని ముక్కు రంధ్రంలో ప్రాణవాయువును ఊదేను" (ఆదికాండము 2:7). సర్వలోకాలకు అధిపతి అయిన దేవుడు మనల్ని తన రూపులో చేయటం మాత్రమే కాదు తన జ్ఞానాన్ని కూడా మనిషికి ఇచ్చారు. బైబిల్ గ్రంథం చెప్పిన రీతిగా "దేవుని పట్ల భయభక్తులు చూపుటయే విజ్ఞానానికి మొదటి మెట్టు" (సామెతలు 1:7). అదేవిధంగా నిజమైన జ్ఞానము కేవలము దేవుని వద్ద నుండి మాత్రమే వస్తుందని సొలోమోను రాజు జీవితం ద్వారా మనకు తెలుస్తుంది. సొలోమోనుకు దేవుని జ్ఞానం ఒక రాజుగా ఎలా నడుచుకోవాలో సాయపడింది. జ్ఞానం అనేది పవిత్రాత్మ దేవుని యొక్క వరము. జ్ఞానస్నాన, భద్రమైన అభ్యంగన స్వీకరణ ద్వారా ప్రతి ఒక్కరూ జ్ఞానము, బుద్ధిని పొందుతారు. దేవుని జ్ఞానము మనిషి హృదయమును, మేధస్సును వెలిగిస్తుంది. అటువంటి జ్ఞానంతో అనేకమంది నేటి సమాజంలో వినియోగంలో ఉన్న ఎన్నో వస్తువులను ఆధునికతను యంత్రాలను సృష్టించారు. నేటి ప్రపంచం కృత్రిమ మేధస్సుపై బహుగా ఆధారపడి ఉంది. రోజురోజుకీ ప్రపంచం అభివృద్ధి బాటలో పయనిస్తుంది. సమాజంలో మనిషి జీవితం సాఫీగా ఉండటానికి నేటి ఆధునిక సాంకేతిక ప్రధాన పాత్రను పోషిస్తుంది. విద్య వైద్య, వ్యవసాయం, పరిశ్రమల నిర్మాణం ఇలా ప్రతి రంగంలో కృత్రిమ మేధస్సు, ఆధునికత చాలా ఆవిష్కరణలు చేసి యంత్రాలను అందిస్తుంది. అటువంటి యంత్రాల సాయంతో మనిషికి పని భారం తగ్గింది. అంతేకాదు మనిషి కష్టంగా భావించే పనిని కూడా యంత్రాలు సులువుగా చేస్తున్నాయి. ఉదాహరణకు మురికి కాలువల

శుభ్రతలో మనిషి ఆ వాసనకు శుభ్రం చేయలేడు. కానీ యంత్రము ఆ పనిని సులువుగా చేస్తుంది. కృత్రిమ మేధస్సు మనిషి యొక్క జీవన స్థాయిని, స్థితిగతులను మార్చాయి. మనిషి ఆరోగ్యము, వాణిజ్యము, ఆర్థిక వ్యవస్థ ఇలా అన్ని రంగాలలో అభివృద్ధికి నోచుకున్నాడు. ఇంట్లో కూర్చునే తన చరవాణి ద్వారా ప్రపంచంలో ఏమి జరుగుతుందో తెలుసుకునే స్థాయికి మనిషి ఎదిగాడు. ఈ ఎదుగుదల కృత్రిమ మేధస్సు ఆధునికత ద్వారా వచ్చింది. ఎంతో ఉన్నతంగా అభివృద్ధి చెందిన ఆధునికత యొక్క వినియోగంలో ఖచ్చితంగా నైతిక విలువలు ఉండాలి. నైతికత మనిషి యొక్క స్వార్థ బుద్ధికి మందుగా పనిచేస్తుంది. ఒకవేళ కృత్రిమ మేధస్సు వినియోగంలో నైతికత లోపిస్తే దాని వినియోగం విచ్చలవిడితనంగా మారి సమాజానికి, వ్యక్తిగతంగా మనుషులకు ప్రమాదకరంగా మారుతుంది. కృత్రిమ మేధస్సు ద్వారా నిజమైన వృద్ధి సమాజంలో రావాలంటే నైతిక సూత్రాల పాటింపు జవాబుదారితనం దానిని వినియోగించే వారిలో ఉండాలి. పుట్టగొడుగుల్లా వస్తున్న కంపెనీలు యంత్రాల ఉత్పత్తి మానవ పురోగతికి సాయపడుతున్న మరోవైపు మానవ ఉద్యోగాలపై గొడ్డలి పెట్టు అవుతుంది. సృష్టించినవాడు అనగా మనిషి యంత్రాల శక్తులలో బందీయై ఉన్న సందర్భాలు నేటి సమాజంలో మనం చూస్తూ ఉన్నాం. అతినూతన పరికరాల జ్ఞానం, వాని వినియోగం పట్ల కొన్ని నియమ నిబంధనలు ఉండాలి. శ్రీసభ మానవ వృద్ధికి ఎప్పుడు కృషి చేస్తుంది. ఆధ్యాత్మిక ఎదుగుదలలో మాత్రమే కాదు మానవ విలువలు పెంచే అన్ని కోణాలలో శ్రీసభ శ్రమిస్తుంది. అందులో భాగంగా నేటి ప్రపంచంలో పెరుగుతున్న కృత్రిమ మేధస్సును దృష్టిలో ఉంచుకొని శ్రీసభ జనవరి 28, 2025న విశ్వాస సిద్ధాంత మరియు సంస్కృతి విద్య విభాగాలు *Antiqua et nova* అనే (పురాతణ మరియు నూతన వాటికన్) పత్రము ద్వారా కృత్రిమ మెధస్సు మరియు మానవ మెధస్సు మధ్య సంబంధం పై సూచనలు విడుదుల చేసింది. ఈ పత్రము ముఖ్యముగా ఆధునికతను గురించి తెలియజేస్తూ కృత్రిమ మేధస్సును ఏ విధంగా మంచికి వినియోగించాలో మనిషి ఔన్నత్యాన్ని పెంచే విధంగా కృత్రిమ మేధస్సు ఉండాలని సూచనలను ఇస్తుంది. ప్రస్తుత కాలం కృత్రిమ మేధస్సు ప్రపంచాన్ని శాసిస్తుంది. ఈ సందర్భంగా కృత్రిమ మేధస్సు ద్వారా అనైతిక విలువలు పెరగకుండా కావలసిన అవగాహనను కల్పించడానికి భక్త యోహాను

గురువిద్యాలయంలో వేదాంతపరమైన చర్చలు మనం కృత్రిమ మేధస్సుని మంచికి ఎలా నేర్చుకోవాలో తెలిపే ఒక కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి మహా ఘన. ఉడుముల బాల గారు విశాఖ అగ్రపీఠ కాపరి అధ్యక్షత వహించగా, ఫాదర్ యం. జేవియర్ రెక్స్ గారు తాను పరిశీలించిన వేదాంతపరమైన చర్చలను కృత్రిమ మేధస్సు గురించి అనేక మందికి అక్టోబర్ 29,30, 2025 తెలుగు కతోలిక పీఠాధిపతుల సమాఖ్య కతోలిక సిద్ధాంత, దైవశాస్త్ర విభాగము నిర్వహించిన సదస్సులో బోధించారు. అందులో కీలక అంశాలను తీసుకొని వాటితో పాటు వాటికన్ అందించిన *Antiqua et nova* సూచనలను ఇంగ్లీష్ నుండి తెలుగులోనికి మా గురువిద్యార్థులు డీకనులు కొమ్మెర పవన్, కారసాల విజయబాబు, మైలాబత్తుల ఆదిత్య, బ్రదర్ దొప్పలపూడి రవీంద్ర, గొన్నాబత్తుల హేమంత్, బలసాని ప్రభుదాస్, బాసాని ధీరజ్, గుత్తుల ప్రేమ్‌కుమార్ వీరందరు ఒక బృందంగా ఏర్పడి *Antiqua et nova* అనే వాటికన్ విడుదల చేసిన పత్రాన్ని తర్జుమా చేయటమే కాదు, కృత్రిమ మేధస్సు ప్రస్తుత కాలాన్ని ఎలా శాసిస్తుందో ఆ అంశాలన్నిటిని అనుసంధానిస్తు చక్కని వ్యాసాలను రాసిన వీరందరికి కృతజ్ఞతలు మరియు దేవుని ఆశీస్సులను అందిస్తున్నాను. కృత్రిమ మేధస్సుని బాధ్యతాయుతంగా ఏ విధంగా వాడాలో ఆ విషయాలను మా గురువిద్యార్థులు తమ పరిశీలనలో శోధించి పొందుపరిచిన ఈ సమాచారాన్ని మీ అందరూ చదివి దానిని అర్థం చేసుకొని కృత్రిమ మేధస్సు పట్ల మీ అవగాహనను పెంచుకునే ఈ ప్రయత్నంలో మీరు పొందిన జ్ఞానాన్ని పదిమందికి పంచవలసినదిగా కోరుకుంటూ కృత్రిమ మేధస్సుని దేవుని వాక్కు వెదజల్లడానికి కూడా వినియోగిస్తూ మనకు ఆశీర్వాదకరంగా దేవునికి మహిమగా ఉండే విధంగా చూచుకుందాం. నేటి యువ పునీతుడు కార్లో అకుతీస్‌గారు కృత్రిమ మేధస్సు వినియోగించి దివ్యసత్ప్రసాద అద్భుతాలను ప్రపంచానికి తేలియచేశారు. కృత్రిమ మేధస్సును మంచికి ఎలా వాడాలో కార్లోగారి జీవితం మనకు ఆదర్శంగా వుంటుంది. ఈ మన ప్రయత్నంలో పవిత్రాత్మ దేవుని సహాయము మనకెళ్ళప్పుడు ఉండాలని ప్రార్థిస్తూ

ప్రభూ సేవలో.....

**ఫాదర్ దొడ్డ రాజా**

సంచిక సంపాదకులు

# 1. కృత్రిమ మేధస్సు (Artificial Intelligence)

- మహా ఘన. ఉడుమల బాల
విశాఖ అగ్రపీఠ కాపరి



## ఆశీర్వాదమా లేక శాపమా? అనుకూలాలు - ప్రతికూలాలు !

ఇప్పుడు టెక్నాలజిలో ఎక్కువగా వినిపిస్తున్న పదం ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ (కృత్రిమ మేధస్సు). ఈ ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ని మనం చాల చోట్ల ఉపయోగిస్తున్నాము. చాట్‌జీపీటీ,హౌమిడ్‌జర్నీ,హౌగూగుల్ బార్డ్ లాంటి టూల్స్ గురించి అందరూ మాట్లాడుతున్నారు. కానీ అసలు ఈ కృత్రిమ మేధస్సు AI అంటే ఏమిటి? AI ఇది మనకి ఎలా ఉపయోగపడుతుంది?

## కృత్రిమ మేధస్సు (AI) అంటే ఏమిటి?

కృత్రిమ మేధస్సు (AI) అంటే మనం తెలుగులో కృత్రిమ మేధస్సు -అని అనవచ్చు. ఇది మనుషుల లాగా ఆలోచించే, నేర్చుకునే, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం కలిగిన కంప్యూటర్ సాఫ్ట్వేర్ లేదా సిస్టమ్. ఉదాహరణకి, మీరు చాట్‌జీపీటీ (ChatGPT)తో మాట్లాడినపుడు మీరు ఏమి అడిగినా, అది మనుషిలా సమాధానం ఇస్తుంది కదా? అదే కృత్రిమ మేధస్సు శక్తి.

## ఎందుకు దీనిని - 'కృత్రిమ మేధస్సు' అంటారు?

"కృత్రిమ" అంటే మనం సృష్టించినది, AI సహజంగా ఏర్పడినది కాదు. "మేధస్సు" అంటే ఆలోచించగలిగే శక్తి. మనం కంప్యూటర్‌కి నేర్పించిన ఆలోచన శక్తిని కృత్రిమ మేధస్సు అంటారు.

**ఉదాహరణలు:** YouTubeలో చూస్తున్న వీడియోలకి సంబంధించి రికమెండేషన్స్ ఇవ్వడంలో, Google Mapsలో ట్రాఫిక్ ప్రెడిక్షన్, Amazonలో మీరు ఇష్టపడే వస్తువులు suggest చేయడంలో కృత్రిమ మేధస్సును మన

దైనందిక జీవితంలో చాల చోట్ల ఉపయోగిస్తున్నాము. ఉదాహరణకు మనం చరవాణిలో ఏదయినా టైప్ చేసేటప్పుడు ఆ పదాన్ని ముందుగానే సూచన చేస్తుంది. యూట్యూబ్‌లో ఏదయినా అంశం గురించిగాని వస్తువు గురించిగాని మనం తరుచుగా వెతకటం చేసేటప్పుడు దానికి సంబంధించిన వీడియోస్ నే సూచన చేస్తుంది. అంతేగాకుండా వాటికీ సంబంధించిన ప్రకటనలు మాత్రమే వచ్చేటట్లు చేస్తుంది. ఇదంతా కృత్రిమ మేధస్సు వల్లనే సాధ్యమవుతుంది. అంటే గూగుల్‌లో ఇన్నర్‌గా కృత్రిమ మేధస్సు ప్రోగ్రామ్స్ ఉపయోగించడం వల్లే ఇదంతా జరుగుతుంది.

మన మెదడు లాగానే కృత్రిమ మేధస్సు కూడా పనిచేస్తుంది. మన మెదడులో ఒక్కొక్క న్యూరాన్ కొన్ని వందల న్యూరాన్‌లతో కనెక్ట్ అయివుంటుంది. అలాగే కృత్రిమ మేధస్సు కూడా న్యూరల్ నెట్వర్క్ పద్ధతిలోనే ప్రపంచంలో అన్ని నెటవర్క్స్‌తో కనెక్ట్‌అయి ఉంటుంది. మనం చుట్టు పక్కల విషయాలను గమనిస్తూ ఎలా నేర్చుకుంటామో కృత్రిమ మేధస్సు కూడా అంతే. దానికి అందించిన సమాచారాన్ని బట్టి కొత్త విషయాలను నేర్చుకుంటుంది, అంతేకాదు దానికదే ప్రోగ్రామింగ్‌ని మార్చుకుంటుంది. ఇలా మనిషి సహాయం లేకుండానే కృత్రిమ మేధస్సు తన మేధస్సుని పెంచుకుంటుంది.

ఒకవేళ పూర్తి స్థాయిలో కృత్రిమ మేధస్సు వస్తే ఈ భూమి మీద అత్యంత శక్తివంతమైనది అదే అవుతుంది. మనుషులకు భౌతికంగా కొన్ని పరిమితులు ఉన్నాయి. వాటిని దాటి వెళ్ళలేరు. కానీ కృత్రిమ మేధస్సుకి అలాంటి పరిధి ఏమీ లేవు. కాబట్టి నిరంతరం నేర్చుకుంటూ ఉండే కృత్రిమ మేధస్సుతో మనుషులు పోటీ పడలేరు అని స్టీఫెన్ హాకింగ్ అనే శాస్త్రవేత్త తెలిపారు. కృత్రిమ మేధస్సు దానికదే తన ఇంటలిజెన్స్‌ని పెంచుకుంటూ ఒకానొక సమయంలో సింగులారిటీ అనే స్థాయికి చేరుకుంటుంది, ఆ సమయంలో ఒక చీమను అదుపు చేయడం ఎంత కష్టమో మనిషి కృత్రిమ మేధస్సుని అదుపు చేయడం అంతే కష్టం అవుతుంది. ఎందుకంటే మన కంటే తెలివైన దాన్ని మనం అదుపు చేయడం చాలా కష్టం. మన అదుపు చేయగలిగినంత వరకు ఈ కృత్రిమ మేధస్సుని ఎంత అభివృద్ధి చేసినా అది మనకు మంచే చేస్తుంది. కానీ కంట్రోల్ తప్పితే రెర్మినేటర్, సినిమాలోనే ఫిక్షన్ నిజమవుతుందని

కొంతమంది చెబుతున్నారు. ఇదంతా పక్కన పెడితే ప్రస్తుతానికి కృత్రిమ మేధస్సు వలన అంతా మంచే జరుగుతూవుంది. ఒకవేళ ఇది అడ్వాన్స్ అయితే ఇది మంచికి ఉపయోగపడుతుందా లేదా ఎదురుతిరుగుతుందా అని ఎవ్వరు చెప్పలేరు.

## కృత్రిమ మేధస్సు (AI) ఎలా పని చేస్తుంది?

కృత్రిమ మేధస్సు - అనేది డేటా మీద ఆధారపడి పని చేస్తుంది. ఒక చిన్న బేబీ ఎలా వరుసగా విషయాలను చూస్తూ నేర్చుకుంటుందో, అలాగే కృత్రిమ మేధస్సు కూడా డేటా ద్వారా నేర్చుకుంటుంది. దీన్ని Machine Learning అంటారు.

## కృత్రిమ మేధస్సు - దాని రకాలు (Types of Artificial Intelligence)

కృత్రిమ మేధస్సు అంటే కేవలం ఒకే విధంగా పనిచేసే సిస్టమ్ కాదు. దీన్ని మనం పనితీరు (Functionality) లేదా సామర్థ్యం (Capability) ఆధారంగా వర్గీకరించవచ్చు. మనకు ముఖ్యంగా 3 రకాల కృత్రిమ మేధస్సులు ఉన్నాయి:

### 1. Narrow కృత్రిమ మేధస్సు: - పరిమిత మేధస్సు

ఇది ఇప్పటి వరకు మనం ఎక్కువగా చూస్తున్న - కృత్రిమ మేధస్సు - ఇది ఒకే పనిని బాగా చేయగలదు కానీ కేవలం దాని పరిధిలోనే ఉంటుంది. ఉదాహరణలు: Google Translate – భాషా మార్పిడి చేస్తుంది; Siri, Alexa – MT ఆదేశాలను ఫాలో అవుతుంది; Netflix Suggestions – మీరు ఇష్టపడే సినిమాలను ప్రతిపాదిస్తుంది. ఇది మనుషుల మేధస్సుకి సమానం కాదు. కానీ నిర్దిష్ట పనిలో ఇది చాలా ఖచ్చితంగా ఉంటుంది.

### 2. General కృత్రిమ మేధస్సు (Strong కృత్రిమ మేధస్సు) సాధారణ మేధస్సు

ఇది ఇప్పటివరకు పూర్తిగా అభివృద్ధి కాలేదు. కానీ దీనిలో ఉన్న సామర్థ్యం ఏమిటంటే ఇది మనిషిలా అన్ని పనుల్లోనూ నేర్చుకుని, నిర్ణయాలు తీసుకోవచ్చు.

**ఇది ఒకటే సిస్టమ్:** పాటలు విన్నా గుర్తుపెట్టుకుంటుంది, పుస్తకాలు చదివి అర్థం చేసుకుంటుంది, మరియు చర్చ కూడా చేయగలదు. ఇది పూర్తిగా అభివృద్ధి అయితే, Robot Teachers, "కృత్రిమ మేధస్సు Doctors వంటి భావనలు నిజమవుతాయి.

### 3. Suggest కృత్రిమ మేధస్సు : అత్యున్నత మేధస్సు

ఇది భవిష్యత్తులో వచ్చే అవకాశం ఉన్న అత్యంత శక్తివంతమైన కృత్రిమ మేధస్సు. ఇది మనిషి మేధస్సును మించిన స్థాయిలో పని చేస్తుంది. ఉదాహరణకి: ఎమోషనల్ ఇంటెలిజెన్స్, స్వతంత్ర నిర్ణయాలు ఆలోచన, అభిప్రాయం కలిగి ఉండే స్థాయి.

ఇది ఇంకా సిద్ధాంత స్థాయిలోనే ఉంది - కానీ Elon Musk లాంటి వారు దీని భవిష్యత్తుపై ఆలోచిస్తున్నారు.

మొత్తంగా చెప్పాలంటే కృత్రిమ మేధస్సు - అనేది ఒక పెద్ద ప్రపంచం. మనం ఇప్పటి వరకు Narrow కృత్రిమ మేధస్సును మాత్రమే చూసాము. మరి భవిష్యత్తులో వచ్చే - కృత్రిమ మేధస్సులు మన జీవన శైలిని పూర్తిగా మార్చేసే అవకాశం ఉంది.

### మన రోజువారీ జీవితాల్లో కృత్రిమ మేధస్సు వాడకాలు

చాలామంది "కృత్రిమ మేధస్సు అంటే కేవలం రోబోట్లు, సైంటిఫిక్ ప్రయోగాలు మాత్రమే" అనుకుంటారు. కానీ నిజంగా చూస్తే, మనం ప్రతిరోజూ మనకి తెలియకుండానే ఏదో ఒక రూపంలో కృత్రిమ మేధస్సుని ఉపయోగిస్తున్నాం.

### కృత్రిమ మేధస్సు భవిష్యత్తు అవకాశాలు, ప్రమాదాలూ Future of కృత్రిమ మేధస్సు : Jobs, Risks & Opportunities

కృత్రిమ మేధస్సు - వేగంగా అభివృద్ధి చెందుతుంది. దీనివల్ల ఒక వైపు అద్భుతమైన అవకాశాలు, మరోవైపు భయం కలిగించే ప్రమాదాలు కూడా మన ముందు ఉన్నాయి. మనం కృత్రిమ మేధస్సు భవిష్యత్తు గురించి స్పష్టంగా తెలుసుకుందాం - మన జీవితం, ఉద్యోగాలు, సమాజం మీద ఇది ఎలా ప్రభావం చూపుతుంది?

### కృత్రిమ మేధస్సువల్ల వచ్చే అవకాశాలు

1. కొత్త ఉద్యోగాలు — Enormous Help and New Jobs కృత్రిమ మేధస్సు వల్ల కొన్ని సాంప్రదాయ ఉద్యోగాలు పోతున్నా అదే సమయంలో కొత్త రకాల ఉద్యోగాలు ఏర్పడుతున్నాయి:

2. ఉత్పాదకత (Productivity) పెరుగుతుంది: మనకు కావాల్సిన విషయాన్ని అడగగానే మనకు అందిస్తుంది. ఉదాహరణకు Magisterium కృత్రిమ మేధస్సు (Churches Teachings accessible), Vulgate GP.
3. వ్యక్తిగత అనుభవం – మీ అవసరాలకు తగ్గట్టుగా Apps, Services పనులు చేస్తాయి. అందులోనూ తక్కువ తప్పులు, అలసట ఉండదు, మరియు తక్కువ ఖర్చు.

**కృత్రిమ మేధస్సు వల్ల ఉన్న ప్రమాదాలు**

1. **ఉద్యోగ నష్టాలు:** మానవ సామర్థ్యాల క్షీణత సంభవిస్తుంది. కృత్రిమ మేధస్సు వల్ల డేటా ఎంట్రీ, కస్టమర్ సపోర్ట్, ట్రావెల్ బుకింగ్, బ్యాంకింగ్ వంటి పునరావృత ఉద్యోగాలు తగ్గిపోతాయి.
2. **డేటా ప్రైవసీ, మానవ నియంత్రణ కోల్పోవడం:** కృత్రిమ మేధస్సు పరోక్షంగా ఒక రకమైన చేటు. కృత్రిమ పాప సంకీర్తనం, గురువులు, కృత్రిమ పరిచర్య అను భావాలు జన్మించవచ్చు; AI Babies, AI Ethics, AI God? ఇలాంటి ఆలోచనల ద్వారా కృత్రిమ మేధస్సు అగ్రస్తానంలో ఉంటుంది.
3. **భావోద్వేగ నియంత్రణ (Emotional Manipulation):** కృత్రిమ మేధస్సు, మానవుని నియంత్రణ చేసేదిగా కాక కేవలం మానవునికి ఉపయోగపడే పరికరంగా పరిగణించాలి. లేకపోతే మానవ భావోద్వేగాలను కృత్రిమ మేధస్సు నియంత్రణ చేసేదిలా మారుతుంది.

## బైబిల్ మరియు దైవశాస్త్రం

**బైబిలులో కృత్రిమ మేధస్సు (Artificial Intelligence) గురించి ప్రత్యక్ష సూచన లేదు.**

దైవశాస్త్రం అనేది కేవలం బైబిల్ అధ్యయనం కాదు; ఇది "విశ్వాస జ్ఞానాన్వేషణ చేయడం" (faith seeking understanding) అనే ఆధ్యాత్మిక శాస్త్రం. దైవశాస్త్రం యొక్క మూలాధారాలు ఏమనగా – దేవుని వాక్కు (Word of God), శ్రీసభ బోధనా పీఠం (Magisterium), మరియు పవిత్ర సంప్రదాయం (Sacred Tradition).

ఈ మూలాధారాల వెలుగులో, మనం నేటి కాలంలోని సాంకేతిక అభివృద్ధి, ముఖ్యంగా కృత్రిమ మేధస్సు (కృత్రిమ మేధస్సు) గురించి అధ్యయనం చేస్తూ, దాని ఆధ్యాత్మిక, పాస్టరల్ మరియు సామాజిక రంగాల్లో ఉన్న ప్రయోజనాలు, ప్రతికూలతలు గురించి పరిశీలిస్తాం. ఫ్రాన్సిస్ పాపుగారు, కృత్రిమ మేధస్సులో అద్భుతమైన సామర్థ్యం ఉంది, కానీ దాని వలన ప్రమాదాలు కూడా ఉన్నాయని హెచ్చరించారు. కృత్రిమ మేధస్సు మనిషికి సమానం కాదు, ఎందుకంటే మనిషి దేవుని రూపంలో సృష్టించబడ్డాడు.

కృత్రిమ మేధస్సు నైతికత, ఆత్మ (dogma/soul) వంటి విషయాల్లో మనిషిని మించిపోయినట్టు కనిపిస్తున్నప్పటికీ, కంప్యూటర్లకు ఆత్మ లేదు, స్వేచ్ఛా సంకల్పం (free will) లేదు, నైతిక అవగాహన లేదు, మరియు దేవునితో లేదా మనుషులతో సంబంధం కూడా లేదు.

## మన జీవితాల్లో కృత్రిమ మేధస్సు ప్రవేశం

ఇప్పుడేమో యువతలో మాత్రమే కాదు, పెద్దల్లో కూడా కృత్రిమ మేధస్సుపై విపరీతమైన ఆకర్షణ ఉంది.

ఇది మన జీవితాల్లో తుఫానులా ప్రవేశించి, ఇప్పుడు చక్రవాతంలా వేగంగా విస్తరిస్తుంది. ఇది మన జీవితానికి సహాయకం అవుతున్నప్పటికీ, ఒక విప్లవాన్ని సృష్టిస్తుంది. ఉదయం నుండి రాత్రి వరకు ఇది మన వెంట ఉంటుంది, కొన్నిసార్లు మనకంటే ముందే ఆలోచిస్తుంది. గూగుల్‌ను అడిగితే, అది సమాధానం మాత్రమే కాదు, ఇంకా సూచనలు కూడా ఇస్తుంది. డ్రైవర్ లేని కార్లు, బస్సులు ఇప్పుడు రోడ్లపై నడుస్తున్నాయి. రోబోలు ఉద్యోగులను విధేయతతో, పొరపాట్లేకుండా, తెలివిగా భర్తీ చేస్తున్నాయి. అయినా కూడా – ఇది ఇంకా ఒక పొరపాట్లు లేకుండ ఉండే సాధనం (Instrument) మాత్రమే, యజమాని (Master) కాదు! కారాదు!!

❋ ❋ ❋ ❋

# 2. కృత్రిమ మేధస్సు: సామాజిక మరియు ఆధ్యాత్మిక ఎదుగుదలకు సహాయమా లేదా ఆటంకమా?



ఆంగ్ల మూలం:
ఫాదర్ యం. జేవియర్ రెక్స్, SJ



అనువాదం:
బ్రదర్ గొన్నాబత్తుల హేమంత్

ప్రస్తుతం ప్రతిచోటా కంప్యూటర్లు. వాటి గురించే సంభాషణ, సాంకేతిక శాస్త్రీయ పరిశోధనల అభివృద్ధి కృత్రిమ మేధస్సును ప్రవేశపెట్టింది. ఇది మానవ జీవితంలోని అన్ని వయస్కుల వారిపైన, అన్నీ రంగాలపైన అపారమైన ప్రభావాన్ని చూపుతుంది. మనం కృత్రిమ మేధస్సు (AI) యుగంలో జీవిస్తున్నాము. ఈ యుగంలో సాంకేతిక పురోగతి మరియు సాధన ప్రాధమిక స్థానంలో ఉన్నాయి. యంత్రాలు మానవులను భర్తీ చేయడం ప్రారంభించాయి. సామర్థ్యాన్ని పెంచడం, నాణ్యతను పెంచడం, ఖచ్చితత్వాన్ని పెంచడం, ఉత్పత్తులు మరియు పనితీరు యొక్క స్థిరత్వాన్ని నిలబెట్టడంలోనూ, నిర్వహించడంలోనూ కృత్రిమ మేధస్సు (AI) విస్తృతంగా ఉపయోగించబడుతుంది. గణితం మరియు కృత్రిమ మేధస్సు (AI) చాట్‌బోట్ (అనగా వాయిస్ కమాండ్‌లు, టెక్స్ట్ చాట్‌లు లేదా రెండింటి ద్వారా మానవ సంభాషణను అనుకరించే కంప్యూటర్ ప్రోగ్రామ్)లు ఒక సంబంధాన్ని ఏర్పరుచుకున్నాయి మరియు ఈ సంబంధం ద్వారా నవీన ఆవిష్కరణలు చేపడుతున్నాయి. అదే విధముగా మానవ-కంప్యూటర్ పరస్పర చర్యల ద్వారా మానవునికి కంప్యూటరు అవసరాన్ని పెంచుతుంది. కృత్రిమ మేధస్సు (AI) యొక్క నీడలు కూడా

చాలా ఉన్నాయి. కృత్రిమ మేధస్సు (AI), అది ప్రోగ్రామ్ చేయబడిన దానిని బట్టి స్పందిస్తుంది. ప్రోగ్రామ్ చేయబడిన వెర్షన్లో లోపమున్నట్లయితే, కృత్రిమ మేధస్సు (AI) ఉత్పత్తి చేసే ఫలితాలు సరికానివి మరియు తప్పు కావచ్చు. దీనికి భావోద్వేగాలు మరియు ప్రేరణలు ఉండవు. దీనికి సృజనాత్మక శక్తి మరియు ఆలోచన లేకపోవడం వల్ల దీనికి క్లిష్టమైన పరిస్థితి యొక్క అవగాహన ఉండదు. దీనికి సామాజిక మేధస్సు మరియు సామాజిక సామర్థ్యాల గురించి తెలియదు. కృత్రిమ మేధస్సు (AI)కు నైతికత మరియు నీతి గురించి తెలియదు మరియు దీనికి న్యాయం, క్షమాపణ మరియు కరుణ లాంటి గుణాల పైన జ్ఞానం లేదు. ఇప్పటికే 70% ఉద్యోగాలు కృత్రిమ మేధస్సు (AI)తో భర్తీ చేయబడ్డాయి. రానున్న రోజులలో కంప్యూటర్ మనల్ని అధిగమిస్తుంది అనడంలో అతిశయోక్తి లేదు. కావున దీని పట్ల మనము విమర్శనాత్మక మరియు ప్రభావవంతమైన ప్రతిస్పందన కనబరచాలి. ఎందుకనగా రానున్న తరాలు కంప్యూటర్ పాలిత ప్రపంచానికి లొంగిపోయే ధోరణి కనిపిస్తుంది. దేవుని సృష్టిలో మానవుడు ఇప్పటికీ, ఎప్పటికీ అత్యుత్తమమైన మరియు అత్యంత సమర్థవంతమైనవాడు అని మనం గ్రహించాలి. ఆధునిక మైక్రో-ప్రాసెసర్ చిప్‌లో $10^9$ ట్రాన్సిస్టర్‌లు (ఎలక్ట్రానిక్ సిగ్నల్స్‌ను నియంత్రించడానికి ఉపయోగించే ఒక సెమీకండక్టర్ పరికరం) ఉంటాయి, అయితే మానవ మెదడులో $10^{14}$ సినాప్సెస్ (ఇది ఒక న్యూరాన్ నుంచి మరో న్యూరాన్‌కు లేదా కండర కణానికి సమాచారాన్ని పంపించే ఒక నిర్మాణం) ఉంటాయి. ఇవి రసాయన మరియు విద్యుత్ శక్తిపై పనిచేసే న్యూరాన్‌ల మధ్య కమ్యూనికేషన్ జంక్షన్లు. మరియు కంప్యూటర్, మెదడు కంటే 100 రెట్లు నెమ్మదిగా ఉంటుంది. కృత్రిమ మేధస్సు లేదా మానవులు అభివృద్ధి పరచిన యంత్రాలు మానవుల జీవితాలను సౌకర్యవంతంగా చేయాలి అంతే కానీ, మనం మన మేధా శక్తి తో సాధించిన నవీన ఆవిష్కరణలకు, విజయాలకే బానిసలుగా మారకూడదు.

## సెగ్మెంట్ I : కృత్రిమ మేధస్సు (AI) యొక్క ప్రాథమిక అంశాలు

### 1.1. కృత్రిమ మేధస్సు (AI) అంటే ఏమిటి?

కృత్రిమ మేధస్సు (AI) అనేది యంత్రాలలో మానవ మేధస్సు యొక్క అనుకరణ. కృత్రిమ మేధస్సు (AI) అనేది భాషను అర్థం చేసుకోవడం, చిత్రాలను

గుర్తించడం, సమస్యలను పరిష్కరించడం మరియు ఇవ్వబడిన సమాచార నుండి నేర్చుకోవడం వంటి మానవ మేధస్సు ద్వారా చేయగలిగే పనులను నిర్వహించగల యంత్రాలు మరియు వాటి వ్యవస్థలను నిర్వచించే శాస్త్రం.

కృత్రిమ మేధస్సు (AI) అనేది కేవలం ఒక అల్గోరిథం (అనగా ఒక సమస్యను పరిష్కరించడానికి అనుసరించాల్సిన సూచనల సమితి లేదా దశలవారీ చేసే ప్రక్రియ అని అర్థం), కోడ్ (కోడ్ అంటే ఒక సమాచారాన్ని (అక్షరం, పదం లేదా సంజ్ఞ వంటివి) మరొక రూపంలోకి మార్చే పద్ధతి లేదా నియమాల సమితి. దీనిని కంప్యూటర్‌కు సూచనలు ఇవ్వడానికి (ప్రోగ్రామింగ్ కోడ్), రహస్య సందేశాలు పంపడానికి లేదా చట్టాలు, నియమావళి వంటి వాటిని క్రమబద్ధీకరించడానికి ఉపయోగిస్తారు) లేదా టెక్నిక్ (సాంకేతిక పద్ధతి లేదా ప్రక్రియ), ఇది యంత్రాలు, మానవ జ్ఞానంను అనుకరించడానికి, అభివృద్ధి చేయడానికి మరియు ప్రదర్శించడానికి వీలు కల్పిస్తుంది.

కృత్రిమ మేధస్సు (AI) అనేది కంప్యూటర్ సైన్స్ యొక్క విస్తృత శాఖ, ఇది మానవ మేధస్సు ఆధారంగా నిర్దిష్ట పనులను చేసే సాంకేతిక పరమైన యంత్రాలతో ప్రత్యేక సంబంధం కలిగి ఉంటుంది.

## 1.2. ఆగ్మెంటెడ్ ఇంటెలిజెన్స్ మరియు అసిమిలేటెడ్ ఇంటెలిజెన్స్ (అనుబంధిత మరియు సమీకరించబడిన మేధస్సు)

ఇప్పుడు, IBM (International Business Machines Corp) కృత్రిమ మేధస్సు "AI" ను నిర్వచించడం ప్రారంభించినందున, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను “ఆగ్మెంటెడ్ ఇంటెలిజెన్సు అని అర్థం చేసుకుంటున్నారు. ఎందుకంటే కృత్రిమ మేధస్సు "AI" వాస్తవానికి మానవ మేధస్సును భర్తీ చేయదు కానీ మెరుగుపరుస్తుంది. మరికొందరు కృత్రిమ మేధస్సు AIను అసిమిలేటెడ్ ఇంటెలిజెన్స్ అని పిలుస్తారు, ఎందుకంటే ఇది ప్రపంచంలోని వివిధ సామాచారాలను (మానవ మరియు ఇతర) సేకరించి, వాటిని సమీకరించి దాని నుండి కొంత మేధస్సును పొందుతుంది.

## 1.3. కృత్రిమ మేధస్సు (AI) చరిత్ర

కృత్రిమ మేధస్సు (AI) యొక్క మరింత వాస్తవిక చరిత్ర 1950ల నాటిది.

దీని తార్కిక ప్రారంభ స్థానం 1950లో Alan Turing రాసిన Computing Machinery and Intelligence (కంప్యూటింగ్ మెషినరీ అండ్ ఇంటెలిజెన్స్) ప్రచురణతో ప్రారంభమైంది. 1956లోఅమెరికాలోని న్యూ హాంప్‌షైర్‌లోని డార్ట్‌మౌత్ కళాశాలలో జరిగిన ఒక సమావేశంలో MITకి చెందిన John Mc Carthy కృత్రిమ మేధస్సు' అనే పదాన్ని రూపొందించారు. అతని ప్రకారం కంప్యూటర్లు మానవులలా ప్రవర్తించేలా చేయడంలో నిమగ్నమైన కంప్యూటర్ సైన్స్ శాఖే ఈ కృత్రిమ మేధస్సు.

Kaplan and Haenlein (సోషల్ మీడియాలో వారి కృషికి గాను ప్రసిద్ధి చెందిన ప్రభావవంతమైన విద్యావేత్తలు) నుండి మెరుగైన నిర్వచనం వచ్చింది, ఇది కంప్యూటర్ సైన్స్‌కు సంబంధించినది, బాహ్య సమాచారంను సరిగ్గా అర్థం చేసుకునే సామర్థ్యం, అటువంటి డాన్స్ నుండి నేర్చుకోవడం మరియు ఆ అభ్యాసాలను ఉపయోగించి నిర్దిష్ట లక్ష్యాలు మరియు పనులను సౌకర్యవంతమైన అనుసరణ ద్వారా సాధించడం"మరియు నేడు కృత్రిమ మేధస్సు (AI), మెషిన్ లెర్నింగ్ (ML), నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ (NLP), ఇమేజ్ రికగ్నిషన్, మెషిన్ విజన్, రోబోటిక్స్ వంటి అనేక శాఖలను కలిగి ఉంది. వాస్తవానికి, మనం ఇంకా దానిని అన్వేషిస్తూ, ఆవిష్కరించే మార్గంలోనే ఉన్నాము.

## 1.4. కృత్రిమ మేధస్సు (AI) రకాలు

### 1.4.1. Narrow AI (పరిమిత మేధస్సు)

### నిర్వచనం

Weak AI అని కూడా పిలువబడే Narrow AI, ముఖ గుర్తింపు, మాట గుర్తింపు లేదా చదరంగం వంటి ఆటలను ఆడటం వంటి నిర్దిష్ట పనులపై దృష్టిని పెడుతుంది.

ఉదాహరణలు: Narrow Al యొక్క సాధారణ ఉదాహరణలు, వాయిస్ అసిస్టెంట్లు (సిరి, అలెక్సా, గూగుల్ అసిస్టెంట్). సిఫార్సు వ్యవస్థలు (నెట్‌ఫ్లిక్స్, అమెజాన్), ఇమెయిల్ ఫిల్టరింగ్ (Gmail).

### 1.4.2. General AI

**నిర్వచనం**

ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్ (AGI), లేదా జనరల్ కృత్రిమ మేధస్సు (AI), అనేది కృత్రిమ మేధస్సు (AI) అభివృద్ధి యొక్క సైద్ధాంతిక దశ, ఇక్కడ యంత్రాలు మానవుడిలాంటి మేధస్సును కలిగి ఉంటాయి, నిర్దిష్ట పనులకే పరిమితం చేయబడిన NarrowAI మాదిరిగా కాకుండా, వివిధ పనులు మరియు సాంకేతిక పరిధిలో జ్ఞానాన్ని అర్థం చేసుకోవడం, నేర్చుకోవడం మరియు అన్వయించగల సామర్థ్యం కలిగి ఉంటుంది.

ఉదాహరణలు: తార్కికం, సమస్య పరిష్కారం, అవగాహన, అభ్యాసం, భాషా అవగాహన,

### 1.4.3. Super Artificial Intelligence

**నిర్వచనం**

సూపర్ కృత్రిమ మేధస్సు (AI), లేదా ఆర్టిఫిషియల్ సూపర్ ఇంటెలిజెన్స్ (ASI), అనేది సృజనాత్మకత, సమస్య పరిష్కారం మరియు భావోద్వేగ అవగాహనతో సహా అన్ని రంగాలలో మానవ మేధస్సును అధిగమించే ఒక ఊహాత్మక కృత్రిమ మేధస్సు (AI) వ్యవస్థ, ఇదే సాంకేతిక ఏకత్వానికి మూల కారణం.

ఉదాహరణలు: మానవ జోక్యం లేకుండా స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోగల మరియు వ్యవహరించగల వ్యవస్థలు

## 1.5. కృత్రిమ మేధస్సు (AI) అనేది కేవలం ఒక టెక్నాలజీ కాదు: ఇది అవకాశాలతో నిండిన సాధన పరికరాల మూలం లేదా ఆధారం

కృత్రిమ మేధస్సు (AI) అనేది ఒక సబ్జెక్ట్ కాదు. ఇది మెషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్, నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ మరియు జనరేటివ్ కృత్రిమ మేధస్సు (AI)లను కలుపుకుని, ఒక సమగ్ర భావనలో వివిధ అంశాలను చేర్చడానికి మరియు సంగ్రహించుటకు ఇది ఒక లైఫ్ లైన్.

Machine Learning: భారీ సామాచార బేస్‌లలో (కంప్యూటర్ ద్వారా ఒకే యూనిట్‌గా పరిగణించబడే ప్రత్యేక సమాచార సమూహం) నమూనాలను నేర్పరితనముతో వెలికితీసే వ్యవస్థ.

Deep learning: చిత్ర గుర్తింపు మరియు స్వర గుర్తింపు వంటి అధునాతన పద్ధతులు కోసం మానవ మెదడును అనుకరించడం.

Natural language processing: కంప్యూటర్లు మానవునిలా అర్థం చేసుకోవడానికి మరియు సంభాషించడానికి వీలు కల్పించే పద్ధతి.

Generative AI అనేది సరళమైన ప్రాంప్ట్‌లతో మరియు సృజనాత్మక శక్తితో, అద్భుతమైన టెక్ట్స్, ఇమేజ్‌లు మరియు కోడ్‌ను స్వయంచాలకంగా ఉత్పత్తి చేస్తుంది. ఇక్కడ, ప్రాంప్ట్ అనేది జనరేటివ్ కృత్రిమ మేధస్సు (AI) బాట్, దాని కార్యాచరణ ఆధారంగా ఫలితాన్ని రూపొందించడానికి ఉపయోగించే సంక్షిప్త టెక్ట్స్ ఇన్‌పుట్.

## 1.6. కృత్రిమ మేధస్సు (AI) యొక్క అనువర్తనాలు (applications)

కృత్రిమ మేధస్సు (AI) అనేది సర్వవ్యాప్త సాంకేతికత కావున దాని ప్రభావం చాలా ఎక్కువగా కనిపిస్తుంది. ప్రపంచంలో ఎక్కడైనా, ఎవరితోనైనా సంభాషించుటకు కృత్రిమ మేధస్సు (AI) సౌకర్యవంతంగా మరియు సమర్థవంతంగా పని చేస్తుంది. కృత్రిమ మేధస్సు (AI) జీవితంలోని అన్ని వయస్కుల వారికి ఆచరణాత్మకమైన మరియు అందుబాటులో ఉండే అవసరంగా మారింది.

# సెగ్మెంట్ 2

## 2.1. ప్రస్తుత దృశ్యం

నేటి సాంకేతికత ప్రపంచంలో, దాదాపు 70% ఉద్యోగాలు ఇప్పటికే యాంత్రీకరణమయ్యాయి. దీని గురించి అవగాహన అందరికీ ఉండాలి ముఖ్యముగా ప్రతి ఒకరు దానికి సిద్ధంగా ఉండాలి. మరియు మనం మరొక విషయాన్ని తెలుసుకోవాలి, అనేక రంగాలలో రాణిస్తున్న చాలా మంది నిపుణులు, (వైద్య, ఇంజనీరింగ్, టెక్నోక్రాట్లు, అడ్మినిస్ట్రేటివ్ ఎగ్జిక్యూటివ్‌లు మొదలైనవారు) జీవితంలో కనీసం ఒక్కసారైనా తమ వృత్తిని మార్చుకుంటారు. దానికి కారణం, నిరంతరం మారుతున్న ఈ పోటీ ప్రపంచానికి అనుగుణంగా ఉండలేకపోవడం లేదా ఒక వ్యక్తి తాను చేసే ఉద్యోగంలో సంతృప్తిని పొందలేకపోవడం కావచ్చు. తరచుగా ఆలోచించడం మానివేసి, ముందుకు

సాగాలి. మనకు విమర్శనాత్మక ఆలోచన మరియు ప్రభావవంతమైన ప్రతిస్పందన చాలా అవసరం.

ఈ ప్రపంచ ప్రగతి మార్గంలో, మనకు అనేక విషయాల గురించి జ్ఞానం మాత్రమే కాదు, వివేకం కూడా అవసరం. సాధారణంగా జ్ఞానం మరియు వివేకం ఒకటే అని అనుకుంటారు. నిజానికి అవి ఒకే నాణేనికి రెండు వైపులా ఉంటాయి. జ్ఞానం అనేది మనకు తెలిసిన వాస్తవాల గురించి తెలియపరిస్తే, వివేకం అనేది జ్ఞానం మరియు అనుభవాల యొక్క కలయిక. జ్ఞానం మేధోపరమైనది కావచ్చు, కానీ వివేకం అనేది హేతుబద్ధమైన మరియు భావోద్వేగాల కలయిక. ఇది ఒక వ్యక్తికి వేరేవేరు విషయాలపై మంచి తీర్పు ఇవ్వడానికి సహాయపడుతుంది.

## 2.2. రెండు రకాల మేధస్సు

**2.2.1. ప్రాథమిక మేధస్సు:** మన అధ్యయనాలు, ఆలోచనలు, ప్రయోగాలు మరియు అనుభవం ద్వారా సంపాదించబడుతుంది.

**2.2.2. ద్వితీయ మేధస్సు** అంటే మనం ఇతరుల అనుభవం నుండి పొందేది. ఇది మన సంప్రదాయం, సహవాసం మొదలైన వాటి నుండి వారసత్వంగా పొందిన సంచితం కావచ్చు. ఈ వర్గంలో కృత్రిమ మేధస్సు వస్తుంది. ఇది తర్కించగల, నేర్చుకోగల మరియు తెలివిగా వ్యవహరించగల మరియు మన స్వంత మేధస్సుతో పోటీ పడగల యంత్రాలను నిర్మించాలనే మానవుని అన్వేషణయే.

## 2.3. మేధస్సు మరియు కృత్రిమ మేధస్సు

మనం మానవ మేధస్సును కృత్రిమ మేధస్సుతో పోల్చి, విభేదించి మరియు విమర్శనాత్మకంగా విశ్లేషించవచ్చు. కృత్రిమ వ్యవస్థతో పోలిస్తే, మన స్వంత మెదడు చాలా సంక్లిష్టమైనది. ఆధునిక మైక్రో-ప్రాసెసర్ చిప్‌లో $10^9$ ట్రాన్సిస్టర్‌లు ఉంటాయి, అయితే మానవ మెదడులో $10^{14}$ 'సినాప్సెస్' ఉంటాయి, ఇవి రసాయన మరియు విద్యుత్ శక్తిపై పనిచేసే న్యూరాన్‌ల మధ్య కమ్యూనికేషన్ జంక్షన్లు. ఇంకా, ఒక అత్యాధునిక మైక్రోప్రాసెసర్ దాని ట్రాన్సిస్టర్‌లను అనుసంధానించే మొత్తం వైర్ 30 కి.మీ.లకు దగ్గరగా ఉండవచ్చు, అయితే

మెదడు ఆక్సాన్‌లతో తయారు చేయబడిన కేబుల్ కనెక్షన్‌లను కలిగి ఉంటుంది. మెదడు యొక్క మొత్తం వైర్ భూమి నుండి చంద్రునికి సగటు దూరానికి సమానంగా ఉంటుంది. మెదడు ప్రాసెసింగ్ వేగం కంప్యూటర్ వేగాన్ని సులభంగా అధిగమించగలదు: మెదడు సెకనుకు 100 బిలియన్ (10") నరాల ప్రేరణలను ఉత్పత్తి చేయగలదు, అయితే ఆధునిక మైక్రోప్రాసెసర్ సెకనుకు ఒక మిలియన్ సూచనలను మాత్రమే పంపుతుంది. ఇంటెల్ నుండి వచ్చిన అత్యంత వేగవంతమైన మైక్రోప్రాసెసర్ 195.3 GHz సామర్థ్యం కలిగి ఉంటుంది. కాబట్టి మెదడులో కంప్యూటర్‌లోని ట్రాన్సిస్టర్‌ల కంటే చాలా ఎక్కువ సినాప్సెస్ ఉంటాయి మరియు కంప్యూటర్ మెదడు కంటే 100 రెట్లు నెమ్మదిగా ఉంటుంది.

## 2.4. నైతిక పరిగణనలు

మనము కొన్ని సంవత్సరాల క్రితం మన కుటుంబ సభ్యుల మరియు స్నేహితుల ఫోన్ నంబర్లను గుర్తుంచుకునేవాళ్ళం, ఇప్పుడు అలా లేదు. కొన్ని సంవత్సరాల క్రితం, ఒక ప్రదేశానికి వెళ్ళే మార్గాన్ని గుర్తుంచుకునేవాళ్ళం లేదా తోటి మానవులతో సంభాషించి మన మార్గాన్ని కనుగొనగలిగేవాళ్ళం. మరి ఇప్పుడు, మన ఏకైక సహచరుడు గూగుల్ మ్యాప్స్ అయ్యింది. మనం బహుశా కృత్రిమ మేధస్సు (AI) గాడ్జెట్లకు అంతగా అలవాటు పడ్డాం.

ఇప్పటి వరకు మనిషి చేసే పనులను, ఇప్పుడు కృత్రిమ మేధస్సు (AI), సులభంగా చేస్తుంది. కృత్రిమ మేధస్సు (AI) ద్వారా మానవుడు తన జీవనోపాధిని పణంగా పెడుతున్నాడు. ఈ పరిస్థితిలో, మనం సృష్టించిన యంత్రాలు మనకంటే తెలివైనవిగా మారి, మన సంక్షేమం గురించి కాకుండా వాటి సంక్షేమం గురించి ఆలోచించడం ప్రారంభిస్తే ఏమి జరుగుతుంది?

మానవుల స్థానంలో కృత్రిమ మేధస్సు (AI) ఎంతగా పనిచేసినా, కృత్రిమ మేధస్సు (AI) లేదా రోబోలు చేయలేని సంభాషణా నైపుణ్యాలు, సానుభూతి, కరుణ, నమ్మకం, సృజనాత్మకత లేదా తార్కికం ఆధారంగా తర్కం అవసరమయ్యే ఏదైనా పనికి అవసరమైన ఉద్యోగాలు ఇప్పటికీ ఉంటాయి.

మానసిక చికిత్స, వైద్య సంరక్షణ, కల్పన/కథల రచన, బోధన, నిర్వహణ మొదలైన వాటికి మనకు మనుషులు అవసరం. సంక్షిప్తంగా, ప్రేమ, సంరక్షణ మరియు ఆప్యాయతపై ఆధారపడిన మానవ ప్రయత్నాలు లేదా పనులు ఏవైనా మానవులే సృష్టించగలరు మరియు నిర్వహించగలరు. ఉదాహరణకు, ఒక ఆత్మ కోసం ఆరాటపడవచ్చు కానీ దానికి ఆత్మ ఉండదు.

సమాజ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకోనే, ఏ శాస్త్రీయ లేదా సాంకేతిక పురోగతి జరగాలి. లేకపోతే, ఆదికాండంలో ప్రస్తావించిన బాబెలు గోపుర వృత్తాంతం పునరావృతం అయ్యే అవకాశం ఉంది (ఆదికాండము 11:1–9). బాబెలు ప్రజలు 'ఆకాశాన్ని చేరుకునే గోపురం' నిర్మించడానికి ప్రయత్నించారు కానీ చివరికి గందరగోళం మరియు కోలాహలంలో పడిపోయారు.

కృత్రిమ మేధస్సుతో సహా,శాస్త్రీయత లేదా సాంకేతిక నిరంతరం అభివృద్ధి చెందుతోంది. ఈ నిరంతర అభివృద్ధి క్రమంలో దీనిని దుర్వినియోగం చేసే ప్రమాదం కూడా ఉంది: శాస్త్రీయ ప్రపంచపు ప్రస్తుత ఆవిష్కరణలు లేదా అభిప్రాయాలు మానవ జీవితపు వాస్తవికతను నవీకరించవచ్చు. కానీ దాని పూర్తి బాధ్యతను మనం వహించగలగాలి. పీపుల్ ఆఫ్ ది లై (1983)లో స్కాట్ పెక్ చెప్పినట్లుగా:" అణు బాంబు శాస్త్రవేత్తల కృషి ద్వారా సాధ్యమైనప్పటికీ, దానిని నిర్మించాలనే నిర్ణయం రాజకీయ నాయకులదే మరియు దానిని వినియోగించిన మిలటరీ సైన్యందే. అనగా శాస్త్రవేత్తలు తమ పరిశోధనలను ఉపయోగించే విధానానికి ఎటువంటి బాధ్యత వహించరని కాదు. కానీ పరిస్థితిపై వారికి నియంత్రణ లేదని చెప్పడమే దీని భావం. కృత్రిమ మేధస్సును అర్థవంతంగా పర్యవేక్షంచకపోతే మరియు సమర్థవంతంగా నియంత్రించకపోతే అదే పరిస్థితి తలెత్తవచ్చు.

## Segment 3 వృత్తుల లక్షణాలు

**3.1. అంతర్గత, నిగూఢ జ్ఞాన శాస్త్రం:** వృత్తులకు సాధారణంగా ఉన్నత విద్య ద్వారా పొందే రహస్య లేదా అంతర్గత జ్ఞాన శాస్త్రం యొక్క నైపుణ్యం అవసరం అనిపిస్తుంది. వృత్తి సభ్యునికి ఈ జ్ఞానం అవసరం. జ్ఞానాన్ని నేర్చుకోవడంలో ప్రావీణ్యం లేనివారు ఆ పనిని చేయలేరు.

**3.2 స్వయం ప్రతిపత్తి వృత్తుల సభ్యులు:** సాధారణంగా సభ్యులు ఆర్డర్లు తీసుకునే ఇతర వృత్తులతో పోలిస్తే వారి పనిలో మంచి స్వయంప్రతిపత్తిని కలిగి ఉంటారు. ఈ స్వయంప్రతిపత్తి సమర్థించబడుతోంది ఎందుకంటే నిపుణుల పని, అంతర్గత జ్ఞానంపై ఆధారపడి ఉంటుంది: నిగూఢజ్ఞాన శాస్త్రం ఉన్నవారు అవగాహన లేని వారి నుండి సలహాలు తీసుకోవడం కంటే, వివేకంతో కూడిన నిర్ణయాలు తీసుకోవాలి మరియు అందువల్ల పరిస్థితిని పూర్తిగా అర్థం చేసుకోలేరు.

**3.3 అధికారిక సంస్థాగత:** వృత్తులు సాధారణంగా రాష్ట్ర మరియు/లేదా సమాఖ్య ప్రభుత్వంచే గుర్తించబడిన ఒకే ఏకీకృత, అధికారిక సంస్థను కలిగి ఉంటాయి మరియు ఈ సంస్థ వృత్తిలో ప్రవేశాన్ని నియంత్రించవచ్చు అలాగే అభ్యాసానికి ప్రమాణాలను నిర్దేశించవచ్చు.

**3.4. నీతి నియమావళి:** వృత్తులకు సాధారణంగా వృత్తిపరమైన నియమావళికి నీతి నియమావళి ఉంటుంది. నీతి నియమావళి అనేది రంగంలో ప్రమాణాలను నిర్ణయించే మార్గం మరియు స్వయంప్రతిపత్తిని కొనసాగించే యంత్రాంగం రెండూ.

**3.5 సామాజిక విధి:** వృత్తులు సాధారణంగా ఒక ముఖ్యమైన సామాజిక విధిని నెరవేరుస్తాయని అర్థం చేసుకుంటాము. ఉదాహరణకు, వైద్యశాస్త్రం ఆరోగ్యాన్ని ప్రోత్సహించడానికి కట్టుబడి ఉంది. ఇంజనీరింగ్ అనేది ఒకే సామాజిక మంచికి కట్టుబడి లేనందున, ఇంజనీరింగ్ అనేది వివిధ రకాల సామాజిక ప్రయత్నాలను సులభతరం చేసే సాంకేతికతలను అభివృద్ధి చేయడానికి అంకితం చేయబడింది. రవాణా, కమ్యూనికేషన్ వాణిజ్యం మొదలైన వాటికి అంకితం చేయబడింది.

## వృత్తిపరమైన సంబంధాలు

### యజమాని- ఉద్యోగి

యజమాని ఉద్యోగి మధ్య సంబంధం నైతికతతో మరియు ఒప్పందంతో కూడి ఉంటుంది. ఇద్దరూ వారి యొక్క లాభానికి పనిచేస్తారు ఒకరికొకరు పనిలో ఒప్పందం కుదుర్చుకొని ఆ పనికి తగ్గ క్రియలు చేస్తారు. మరియు మంచి వాతావరణం కలిగి ఉంటారు. ఈ ప్రక్రియ ఒప్పందంతో ముడిపడి

ఉంది. కావున ఎవరు పూర్తి చేయాల్సిన కార్యాలు వారు చేస్తారు ఒకరికొకరు స్వేచ్ఛ ద్వారా ఒప్పందం కుదుర్చుకున్నారు కాబట్టి వారి ఎంతో శ్రద్ధతో పనిచేస్తూ వారి మధ్య ఏర్పరచుకున్న నిబంధనలను పాటిస్తూ అభివృద్ధి చెందగలుగుతారు.

## వృత్తిపరంగా యజమాని- ఉద్యోగి

వృత్తిపరంగా యజమాని ఉద్యోగి నైతికంగా ఉండాలి ఈ రంగంలో నైతిక బాధ్యత కష్టతరమైన బాధ్యత ఉద్యోగి సమయానికి రుణాలు చెల్లించడం యజమాని యొక్క పనులను సకాలంలో పూర్తి చేయడం ఉద్యోగ యొక్క కర్తవ్యం మరియు బాధ్యత ఇరువురు ఒకరికొకరు గౌరవంతో పనిచేసినప్పుడు వారి మధ్య ఉన్న సంబంధం న్యాయబద్ధంగా ఉంటుంది.

వాణిజ్య రహస్యాలు ఎంతవరకు పాటించాలి లేదా వాటిని ఇతరులకు తెలియజేయడం అనేది చాలా కష్టమైన క్రియ. ఉద్యోగులు యజమానుల వ్యాపార రహస్యాలను పరిరక్షించగలగాలి అది వారి యొక్క నైతిక బాధ్యత అదేవిధంగా వాణిజ్య రహస్యాలను కాపాడుకొనుటకు యజమానుడు ఎంత దూరమైనా వెళ్ళవచ్చు మరియు ఆ రక్షంచుకు ఉద్యోగికి పూర్తి స్వేచ్ఛనివ్వాలి.

## వినియోగదారుడు - వృత్తి నైపుణ్యుడు

(1) సంస్థ, (2) పితృస్వామ్యం మరియు (3) విశ్వసనీయత

సంస్థ యందు వృత్తి పరమైన విధానం గురించి క్లుప్తంగా వృత్తి నైపుణ్యత యొక్క యాజమాన్యనిగా వ్యవహరించడానికి వినియోగదారుడు అభ్యర్థించిన వాటిని అమలు చేయాలి.

దీనికి విరుద్ధమైన తీవ్రతలో పితృస్వామ్య నమూనా ఉంది. ఇక్కడ వినియోగదారుడు అన్ని నిర్ణయాలను వృత్తి నైపుణ్యత చేయు యాజమాన్య సిబ్బందికి అందింప చేస్తాడు. వృత్తిపరమైన చర్యలు అనేవి వినియోగదారుడు చూపించే నిర్ణయాల పై నమ్మకాన్ని చూపెడుతుంది. ఈ విధానాన్ని ప్రత్యేక నైపుణ్యం గల విధానంగా వృత్తి యందు గ్రహించగలుగుతాము. ఇంకనూ చెప్పాలంటే ఒక వైద్యుడు రోగికి మధ్య ఉన్న సంబంధాన్ని ఈ విధమైన సంబంధం అని మనం పోల్చవచ్చు.

మూడవ విధానం వినియోగదారుని అర్థం చేసుకొనుటకు ప్రయత్నిస్తుంది. రెండు పార్టీలు పాత్ర పోషించే మరియు కలిసి పనిచేసే సంబంధాలుగా అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తుంది. క్లయింట్లు నిర్ణయం తీసుకునే అధికారాన్ని కలిగి ఉంటారు. కానీ వృత్తి నైపుణ్యత అందించిన సమాచారం ఆధారంగా నిర్ణయాలు తీసుకుంటారు. దీనిని నమ్మకత్వ విధానం అని పిలుస్తారు, ఇది నమ్మకాన్ని సూచిస్తుంది. ఈ నమూనాలో, రెండు సమావేశాలు ఒకరినొకరు విశ్వసించాలి. వినియోగదారుడు తన నిపుణుల జ్ఞానాన్ని ఉపయోగించడానికి మరియు వినియోగదారుని యొక్క ఆసక్తి పరంగా ఆలోచించడానికి విశ్వసించాలి, కానీ వృత్తి నైపుణ్యత సంబంధిత సమాచారాన్ని వినియోగదారుడికి ఇస్తాడని కూడా విశ్వసించాలి.

## సమాజం- నైపుణ్యత

నిపుణులు వృత్తిపరమైన పాత్రలలో వారి నైపుణ్యం మరియు కళను ఉపయోగించినప్పుడు, వారి కార్యకలాపాలు యజమానులు లేదా వినియోగదారులు కాని ఇతరులను ప్రభావితం చేస్తాయి ఉదాహరణకు, మీరు ప్రమాదకరమైన తయారీ ప్రక్రియలో ఉపయోగించే కంప్యూటర్ వ్యవస్థను రూపొందించవచ్చు. వ్యవస్థను ఉపయోగించడం వల్ల కార్మికులను ప్రమాదంలో పడేయవచ్చు. ప్లాంట్ పరిసరాల్లోని నివాసితులను ప్రమాదంలో పడేయవచ్చు లేదా సామాచార బేట్‌లో ఉన్న వారికి సిస్టమ్ యొక్క భద్రత చిక్కులను కలిగి ఉన్న కంపెనీ కోసం మీరు సామాచార బే నిర్వహణ వ్యవస్థను సరళంగా రూపొందించవచ్చు కంప్యూటర్ నిపుణుల పని ఈ సంభావ్య ప్రభావాలను కలిగి ఉన్నందున, కంప్యూటర్ నిపుణులు ప్రభావితం అయ్యే వారితో సంబంధాన్ని కలిగి ఉంటారు.

## వృత్తి నైపుణ్యత - వృత్తి నైపుణ్యం

నిపుణులు ఒకరికొకరు ఏమి ఇష్టపడతారో ఆలోచించడానికి ఒక మార్గం ఏమిటంటే, వారు ఒకరినొకరు ఏమి ఇష్టపడతారో ఆలోచించడం, వారు ప్రవర్తన యొక్క సాధారణ ప్రమాణాలకు కట్టుబడి ఉండటం. స్వల్పకాలంలో ఒకరికొకరు సహాయం చేసుకోవడానికి మరియు రక్షించుకోవడానికి వారు

ఏమి చేయవచ్చో ఆలోచించడానికి ఇది భిన్నంగా ఉంటుంది. ఆసక్తి సంఘర్షణలను నివారించడం, క్రెడిట్ ఇవ్వాల్సిన చోట క్రెడిట్ ఇవ్వడం మొదలైన వాటి గురించి నియమాలు ఒక వృత్తిలోని ఒక సభ్యుడు ఇతర సభ్యుల పట్ల కలిగి ఉన్న బాధ్యతలను అర్థం చేసుకుంటాయి.

## సెగ్మెంట్ 4

## ముఖ్యమైన లక్షణాలు

కృత్రిమ మేధస్సు మరియు మానవ మేధస్సు మధ్య సంబంధంపై శ్రీసభ అందించిన గమనిక -28-01-2025.

### మానవ కేంద్రీకృత విధానం

కృత్రిమ మేధస్సు (AI)ను, నియంత్రించే సాధనంగా కాక, మానవ గౌరవాన్ని పెంచే మరియు సమాజ శ్రేయస్సును ప్రోత్సహించే విధంగా ఉపయోగించాలి.

### నైతిక పరిగణనలు

ఈ కృత్రిమ మేధస్సును బాధ్యతాయుతంగా ఉపయోగించాలని మరియు హాని కలిగించకుండా ఉండేలా నైతిక మార్గదర్శకాల ప్రాముఖ్యతను శ్రీసభ, నొక్కి వక్కాణిస్తుంది.

### ప్రాణాంతక స్వయంప్రతిపత్తి ఆయుధ వ్యవస్థలపై నిషేధం

ప్రాణాంతకమైన స్వయంప్రతిపత్తి ఆయుధ వ్యవస్థలను నిషేధించాలని ఫ్రాన్సిస్ పాపు గారు పిలుపునిచ్చారు, ఏ యంత్రాన్ని కూడా మానవ ప్రాణాలను తీయడానికి ఉపయోగించరాదని ప్రస్తావించారు.

### తప్పుడు సమాచారం మరియు మోసం

కృత్రిమ మేధస్సు ద్వారా ఎన్ని సౌకార్యాలున్నాయో, దాని కంటే ఎక్కువ మోతాదులో నష్టాలు కూడా ఉన్నాయి. ఈ కోణాన్ని వివరిస్తూ, కృత్రిమ మేధస్సు (AI) తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడానికి మరియు ప్రజలను మోసం చేసే అవకాశం కలిగి ఉందని శ్రీసభ హెచ్చరించింది.

### సామాజిక సంభాషణ మరియు విద్య

క్రైస్తవులు ఎదుర్కొంటున్న నైతిక సవాళ్లను పరిష్కరించడానికి, వివిధ

వాటాధారులు, శాస్త్రవేత్తలు, పాలసీ రూపకర్తలు మరియు మత నాయకుల మధ్య బహిరంగ సంభాషణ మరియు సహకారాన్ని శ్రీసభ  ప్రోత్సహిస్తుంది.

## కృత్రిమ మేధస్సు (AI) అనేది మానవ మేధస్సు యొక్క ఉత్పత్తి మాత్రమే, దానికి మరో రూపం కాదు

ఈ నేపథ్యంలో, కృత్రిమ మేధస్సు (AI)కు సంబంధించి ఇంటెలిజెన్స్ అనే పదాన్ని ఉపయోగించడం తప్పుదారి పట్టించేలా ఉంటుందని ఈ పత్రం ధృవీకరిస్తుంది. కృత్రిమ మేధస్సు (AI)ను మానవ మేధస్సు యొక్క కృత్రిమ రూపంగా చూడకూడదు, కానీ కేవలం దాని ఉత్పత్తిగా మాత్రమే చూడాలి"

## హానికరమైన ఒంటరితనము మరియు ఆంత్రోపోమార్ఫైజింగ్ కృత్రిమ మేధస్సు

శ్రీసభ, కృత్రిమ మేధస్సు వాడటం వలన ప్రమాదకరమైన ఒంటరితనానికి దారితీస్తుంది అని నొక్కి వక్కాణిస్తుంది. అదే విధంగా ఈ కృత్రిమ మేధస్సు ద్వారా పిల్లల ఎదుగుదల లోపిస్తుంది.

## కృత్రిమ మేధస్సు ఒక మానవునిగా చూపించుట

కృత్రిమ మేధస్సును ఒక వ్యక్తిగా చూపించినప్పుడు అది గొప్ప అనైతిక ఉల్లంఘనకు దారితీస్తుంది. ఇది మోసపూరిత ప్రయోజనాల కొరకు వాడినప్పుడు ఇంకా గొప్ప ప్రమాదం చోటు చేసుకుంటుంది.

## సాంకేతిక పరిణామాలపై పాపు గార్ల అభిప్రాయాలు

**12వ భక్తినాథ  జగద్గురువులు:** "శాంతితో ఏమి కోల్పోము కానీ యుద్ధము వలన అన్నింటినీ కోల్పోతాం."–24 ఆగస్టు 1939.

**23వ జాన్ జగద్గురువులు:** "యుద్ధం వలన పెను ప్రమాదాలు నష్టాలు కలుగుతాయి. ముఖ్యముగా అణుబాంబులు ఆయుధాలు వాడిన మరింత నష్టము వాటిల్లుతుంది. అందుకుగాను ప్రపంచ నాయకులకు ఇటువంటి భయంకరమైన యుద్ధాలను స్వస్తి చెప్పాలని జగద్గురువులు పిలుపునిచ్చారు." –25 అక్టోబర్ 1962

**6వ పౌలు జగద్గురువులు:** "మీరు సోదరులు మరియు సోదరీమణులుగా ఉండాలనుకుంటే, ముఖ్యంగా ఆధునిక శాస్త్రం మీకు అందించిన భయంకరమైన

ఆయుధాలను మీ చేతుల నుండి వదిలేయండి, చెడు కలలను పుట్టించండి. చెడు భావాలను పెంచండి, పీడకలలు, శత్రుత్వాలు మరియు చీకటి తీర్మానాలను సృష్టించండి, అవి బాధితులను మరియు విధ్వంసాలను కలిగించడానికి ముందే." –4 అక్టోబర్ 1965

**పునీత రెండవ జాన్ పౌలు జగద్గురువులు:** "ఒక సవాలు" అని ఆయన మాటల్లో ఇలా చెప్పారు, "సైన్స్ విలువలను మరియు మనస్సాక్ష విలువలను సమన్వయం చేయడంలో ఉంటుంది" "ఈ గ్రహం మీద మన భవిష్యత్తు, అణు వినాశన ప్రమాదానికి గురవుతుంది", అని ఆయన హెచ్చరించారు, ఒకే ఒక అంశం మీద ఆధారపడి ఉంటుంది. అదే "మానవత్వం నైతిక తిరుగుబాటును అమలు చేయాలి." –25 ఫిబ్రవరి 1981,

**16వ బెనెడిక్ట్ జగద్గురువులు:** 2006 ప్రపంచ శాంతి దినోత్సవం కోసం సందేశంలో," అణు యుద్ధంలో", విజేతలు ఉండరని, బాధితులు మాత్రమే ఉంటారని ఆయన పేర్కొన్నారు.

## బాధ్యతాయుతమైన అభివృద్ధి

**ఫ్రాన్సిస్ జగద్గురువులు** పదే పదే నైతిక పరిశీలనలు మరియు మానవ గౌరవం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెబుతూ కృత్రిమ మేధస్సు (AI) యొక్క బాధ్యతాయుతమైన అభివృద్ధి మరియు ఉపయోగం కోసం పిలుపునిచ్చారు.

## మానవ అభివృద్ధిపై దృష్టి

అతను కృత్రిమ మేధస్సును మానవ సంబంధాలను లేదా నిర్ణయం తీసుకోవడాన్ని భర్తీ చేయడానికి కాకుండా, మానవ అభివృద్ధి మరియు శ్రేయస్సును ప్రోత్సహించడానికి ఉపయోగించాల్సిన సాధనంగా చూస్తాడు.

## సాంకేతిక అభివృద్ధికి సాదర ఆహ్వానం

ఫ్రాన్సిస్ జగద్గురువులు ఆందోళనలు వ్యక్తం చేస్తూనే, సాంకేతిక పురోగతిని వ్యతిరేకించడం లేదు, కానీ అది ఎల్లప్పుడూ నైతిక సూత్రాల ద్వారా మరియు సాధారణ మంచి కోసం ఆందోళనతో మార్గనిర్దేశం చేయబడాలని ఆయన విశ్వసిస్తున్నారు.

## సామూహిక బాధ్యతను నొక్కి చెబుతుంది

బాధ్యతాయుతమైన ప్రపంచ సమాజాన్ని పెంపొందించడంలో విద్య మరియు అవగాహన పాత్రను నొక్కి చెబుతూ, కృత్రిమ మేధస్సు (AI) యొక్క నైతిక నిర్దేశాలలో సమిష్టి బాధ్యతను ఫ్రాన్సిస్ జగద్గురువులు చెప్పారు.

## సెగ్మెంట్ 5

**హ్యాకింగ్ మరియు హ్యాకర్:** హ్యాకింగ్ అనేది ఒక ప్రక్రియ. అది ఏమిటంటే కంప్యూటరు సాంకేతికతను లోతుగా అర్ధం చేసుకొని దానిని తప్పు త్రోవలో నడిపించటం లేదా వాడటం. అలా చేసే వారిని హ్యాకర్ అంటారు. హ్యాకింగ్ అనేది అనైతిక ప్రక్రియ. ఎందుకంటే అది అందరని చెడు త్రోవలో నడిపిస్తుంది.

**ఆన్లైన్ మర్యాద** (Netiquette ): ఆన్లైన్ లో ఏంచేయాలో ఏం చేయకూడదో నేర్పిస్తుంది.

**అసభ్య పదజాలం:** సామాజిక మాధ్యమాలలో వ్యక్తులు సంభాషించి నప్పుడు, అసభ్యకరమైన పద జాలం, చిత్రాలు, వీడియోలు, ఈమెయిల్ ద్వారా లేదా ఇతర సాంకేతికత ద్వారా పంపడం నైతికంగా తప్పు.

## విభాగం 6

## కృత్రిమ మేధస్సు: తుఫానా లేదా తారనా?

కృత్రిమ మేధస్సు వాడటం వలన ఎంతోమంది సమాజంలో పెద్ద ఎత్తున బానిసలుగా మారుతున్నారు. మన ఆలోచన మరియు కృత్రిమ మేధస్సు వాడకంలో మనం స్పష్టంగా మరియు జాగ్రతగా ఉండాలి. ఇది మనల్ని ప్రగతి పథంలో మరింత ముందుకు నడిపించే తార కావచ్చు. అదే విధంగా గందరగోళం మరియు విపత్తును సృష్టించే తుఫాను కూడా కావొచ్చు. వాస్తవానికి గందరగోళంలో పడేసే ఆస్కారాలే ఎక్కువగా ఉన్నాయి.

## టాంటమ్ క్వాంటం సూత్రం

కృత్రిమ మేధస్సు గురించి తెలుసుకోవడం అవగాహన కలిగి ఉండటం అవసరమైనంత దానిని వాడటం గురించి తెలిపేదే ఈ సూత్రం. ఈ కృత్రిమ మేధస్సు ఎంతవరకు ఉపయోగపడుతుందో ఎంతవరకు సహాయపడుతుందో

అంతవరకు మాత్రమే వినియోగించాలి. అలా కాకుండా మనల్ని మనం అడ్డుకునేంత మనల్ని బానిసలుగా సంకెళ్లతో కట్టిపడే సంత దానికి బానిసలు అవ్వకూడదు (స్పెక్స్ 231) అనేది ఎంతవరకు సమర్థవంతంగా పనిచేస్తుందో అంతవరకు వాడటం తెలుసుకోవాలి కానీ దానిని విచ్చలవిడిగా వాడి దానిపై పూర్తిగా ఆధారపడినప్పుడు మనము దానికి బానిసలుగా మారుతాము. అది ఒక అనైతికమైన కృత్రిమ యజమానిగా మారుతుంది అదేవిధంగా ఈ కృత్రిమ మేధస్సు మన ఆలోచనలను మరియు సామర్థ్యాన్ని మనం పోగొట్టుకునేలా చేస్తుంది.

కృత్రిమ మేధస్సు సమర్ధవంతమైన సేవకుడు కాగలడని మనం తెలుసుకోవాలి, కానీ మనం దానిపై ఆధారపడినప్పుడు లేదా మనం బానిసలుగా మారినప్పుడు, అది ఒక క్రూరమైన యజమానియై, మన వ్యక్తిగత, ఆలోచన మరియు నిర్ణయం తీసుకునే సామర్థ్యాన్ని దోచుకుంటుంది.

**ముగింపు వ్యాఖ్యలు**

మనం ఏ విధంగా ఉన్నా మరియు మనం ఏమి చేసినా, మనం తరచుగా సంబంధ బాంధవ్యాలకు ప్రాధాన్యత ఇస్తాం. వాటిని 'పరిచయాలు'గా పేరు పెట్టవచ్చు, ఇక్కడ పని వాతావరణం, సాధారణ లక్ష్యాన్ని పంచుకోవడం మరియు లక్ష్యాన్ని సాధించడం అనేది దృష్టి కానీ, మనం కుటుంబం మరియు స్నేహితుల వద్దకు తిరిగి వచ్చినప్పుడు, మన జీవితాలను విలువైనదిగా చేసే శాశ్వతమైన మరియు అర్ధవంతమైన 'బంధుత్వాల' కోసం చూస్తాము. ఇతరులతో మనం సంబంధం కలిగి జీవించుటకు సంభాషణ అనేది తోడ్పడుతుంది ఇది ఒక సేతులా పనిచేస్తుంది.

మానవ జీవితాలను అర్థం చేసుకోవడానికి ప్రేమతో కూడిన సంభాషణలను కొనసాగిస్తాము. ఇటువంటి ప్రేమ దృష్టి కోణము ఎప్పుడూ మరవకూడదు. కృత్రిమ మేధస్సు సమాచారానికి మరి ఇతర అవసరాలకు ఉపయోగపడవచ్చు కానీ మానవ సత్సంబంధాలకు ఏ విధంగా సహాయ పడదు. మానవులందరూ ఒకరికొరకు నిలబడుతూ కరుణ కలిగి సఖ్యతతో ఇతరులతో జీవించాలి ప్రేమానురాగాలు బంధాలు, సాంకేతిక పరికరాలలోనూ కృత్రిమ మేధస్సులోనూ కనబడదు.

కృత్రిమ మేధస్సు ప్రపంచాన్ని సాంకేతికతలో మెరుగుపడటానికి ఉపయోగపడవచ్చు. కానీ మానవుని మరింత బాధ్యతగా ప్రేమపూరితంగా మలచలేదు. కృత్రిమ మేధస్సు వాడకంలో పడి కృత్రిమ బంధాలను కలిగి మానవుడు జీవించకూడదు. చరిత్ర అనేది కృత్రిమ మేధస్సు ముందు కృత్రిమ మేధస్సు తర్వాత అని లిఖించబడుతుంది. కృత్రిమ మేధస్సును ఉపయోగిస్తూ, దాని ద్వారా గొప్ప ఆవిష్కరణలు గొప్పఘనతలు, విజయాలు సాధించాలి. కృత్రిమ మేధస్సు ప్రపంచ పురోగతిలో మరింత ఎక్కువగా సహాయపడుతూ, మానవునికి ఎంతగానో సహాయపడే గొప్ప సాధనంగా మారాలని ఆశిద్దాం. రానున్న రోజుల్లో ఈ కృత్రిమ మేధస్సు మరింత ప్రగతిని సాధిస్తుందని నమ్మకంతో ముందుకు సాగుదాం.

❋ ❋ ❋ ❋

# 3. మానవ బుద్ధి మరియు కృత్రిమ మేధస్సు శ్రీసభ సమగ్ర ధార్మిక - నైతిక దృష్టికోణం

– డీకన్ కొమ్మెర పవన్



## పరిచయం

యుగాలు మారుతున్నకొద్దీ, మానవుడు తన బుద్ధి ద్వారా కొత్త ఆవిష్కరణలు చేస్తూ ముందుకు సాగుతున్నాడు. ప్రతి యుగంలోనూ శాస్త్రం మరియు సాంకేతికత మానవ జీవితాన్ని ప్రభావితం చేశాయి. అయితే, నేటి కాలంలో కృత్రిమ మేధస్సు *(Artificial Intelligence – AI)* మానవ చరిత్రలో ఒక ప్రత్యేకమైన మలుపుగా నిలుస్తోంది. ఇది కేవలం ఒక సాధనం మాత్రమే కాకుండా, మానవ ఆలోచనలను, నిర్ణయాలను, సృజనాత్మకతను అనుకరించే స్థాయికి చేరుకుంది. ఈ నేపథ్యంలో, శ్రీసభ తన పురాతన జ్ఞానాన్ని మరియు ఆధునిక అవగాహనను కలిపి, ఈ కొత్త వాస్తవాన్ని విశ్లేషించాల్సిన బాధ్యతను అనుభవిస్తుంది. "పాతదీ కొత్తదీ వెలికి తీయు జ్ఞాని" (మత్తయి 13:52) అన్న ప్రభువు మాటలు, ఈ సందర్భంలో శ్రీసభకు మార్గదర్శకంగా నిలుస్తాయి.

## మానవ బుద్ధి: దేవుని స్వరూపానికి ప్రతిబింబం

క్రైస్తవ విశ్వాసం ప్రకారం, మానవ బుద్ధికేవలం జీవ శాస్త్రీయ లేదా మానసిక సామర్థ్యం మాత్రమే కాదు. అది దేవుడు మనిషికి ఇచ్చిన ప్రత్యేకమైన వరం. ఆదికాండంలో మనం చదువుతాము: "దేవుడు మానవ జాతిని సృజించెను. తన పోలికలో మానవుని చేసెను" (ఆది. 1:27). ఈ స్వరూపంలో ముఖ్యమైన అంశం మానవ బుద్ధి మరియు సంకల్పం. శ్రీసభ బోధన ప్రకారం, బుద్ధి ద్వారా మనిషి సత్యాన్ని తెలుసుకోగలడు, మంచిని గుర్తించగలడు, మరియు నైతిక నిర్ణయాలు తీసుకోగలడు. *Gaudium et Spes (15)* ప్రకారం, మానవ బుద్ధి ద్వారా మనిషి

దేవుని సృష్టిని అర్థం చేసుకుంటూ, తన జీవితానికి అర్థం మరియు లక్ష్యాన్ని కనుగొంటాడు.

ఈ బుద్ధి మనిషిని దేవునితో సంభాషణలోకి తీసుకువెళ్తుంది. ప్రార్థన, ధ్యానం, మరియు మనస్సాక్షి ద్వారా మనిషి దేవుని చిత్తాన్ని తెలుసుకునే ప్రయత్నం చేస్తాడు. అందువల్ల, మానవ బుద్ధి యంత్ర బుద్ధితో పోల్చలేనంత లోతైనది. కృత్రిమ మేధస్సు (AI) సమాచారం విశ్లేషించగలదు, నమూనాలను గుర్తించగలదు, కానీ అది సత్యాన్ని ప్రేమించలేదు, మంచిని ఎన్నుకోలేదు, దేవునితో సంబంధం కలిగి ఉండలేదు, బంధాలు మరియు భావోద్వేగాలు దానికి ఉండవు, మంచి చెడుల మధ్య వ్యత్యాసాలు గ్రహించ లేకపోవచ్చు ఇలా అనేకమైన లోపాలు కలిగివుంది కృతిమ మేధస్సు.

## సృష్టిపై మానవ బాధ్యత మరియు బుద్ధి పాత్ర

"దేవుడైన యావే నరుని కొనిపోయి ఏదేను తోటను సాగుచేయుటకును, కాచుటకును దానిలో ఉంచెను" (ఆది. 2:15). ఈ పిలుపు మానవ బుద్ధిని బాధ్యతాయుతంగా ఉపయోగించమనే ఆహ్వానం. శ్రీసభ బోధన ప్రకారం, శాస్త్రం మరియు సాంకేతికతలు ఈ పిలుపును నెరవేర్చే సాధనాలు. అవి మానవ జీవనాన్ని మెరుగుపరచాలి, పేదల జీవనాన్ని గౌరవించాలి, మరియు సృష్టి సమగ్రతను కాపాడాలి.

సిరాపుత్రుడైన యేసు జ్ఞాన గ్రంథం మనకు గుర్తుచేస్తుంది: "ప్రభువు నరులకు వైద్య విజ్ఞానమును దయచేసెను. అతని అద్భుతములకుగాను నరులు అతనిని సన్నుతింతురు" దేవుడు మనుష్యులకు నైపుణ్యాన్ని ఇచ్చినది తన మహిమ కొరకు (సిరాకు 38:6). అందువల్ల, మానవ సృజనాత్మకత దేవుని మహిమకు దారితీయాలి. కాని అదే సృజనాత్మకత దేవుని స్థానాన్ని ఆక్రమించాలనే ప్రయత్నం చేస్తే, అది అహంకారానికి దారితీస్తుంది. చరిత్రలో ఎన్నోసార్లు మనం చూసినట్లుగా, నియంత్రణ లేకుండా ఉపయోగించిన సాంకేతికత మానవత్వానికే ప్రమాదంగా మారుతుంది.

## కృత్రిమ మేధస్సు యొక్క ప్రత్యేకత

కృత్రిమ మేధస్సు ఇతర సాంకేతిక సాధనాల కంటే భిన్నమైనది. ఇది కేవలం యంత్ర శక్తిని పెంచడం కాదు మానవ ఆలోచనా ప్రక్రియను అనుకరించడం.

కృత్రిమ మేధస్సు (AI) మానవుల వ్రాతలను విశ్లేషించి కొత్త వచనాలను సృష్టించగలదు, చిత్రాలను రూపొందించగలదు, మరియు కొన్ని రంగాల్లో మానవ నిర్ణయాలను మించిపోయినట్లు కనిపించగలదు. ఈ సామర్థ్యం వల్ల, కృత్రిమ మేధస్సు (AI) మానవ బుద్ధికి ప్రత్యామ్నాయమా అనే ప్రశ్న సమాజంలో తలెత్తుతోంది.

శ్రీసభ ఈ విషయంలో స్పష్టంగా చెబుతుంది: కృత్రిమ మేధస్సు (AI) ఎంత అభివృద్ధి చెందినా, అది మానవ బుద్ధితో సమానం కాదు. ఎందుకంటే కృత్రిమ మేధస్సు (AI)కి ఆత్మ లేదు, మనస్సాక్షి లేదు, ప్రేమించే సామర్థ్యం లేదు. అది గణనలపై ఆధారపడిన వ్యవస్థ మాత్రమే. మానవ బుద్ధి మాత్రం సంబంధాత్మకమైనది, నైతికమైనది, మరియు ఆధ్యాత్మికమైనది.

## నైతిక బాధ్యత మరియు స్వేచ్ఛ

కృత్రిమ మేధస్సు (AI) యుగంలో అత్యంత ముఖ్యమైన ప్రశ్న నైతిక బాధ్యత గురించిందే. ఒక యంత్రం తీసుకున్న నిర్ణయం వల్ల హాని కలిగితే, బాధ్యత ఎవరిది? శ్రీసభ బోధన ప్రకారం, నైతిక బాధ్యత ఎప్పటికీ మానవుడిదే. యంత్రానికి బాధ్యత అప్పగించడం మానవ మనస్సాక్షిని బలహీనపరచే ప్రమాదం కలిగిస్తుంది. కతోలిక శ్రీసభ సత్యోపదేశం 1782 ప్రకారం, నైతిక నిర్ణయం తీసుకునే సామర్థ్యం మానవ వ్యక్తికి మాత్రమే ఉంది.

ప్రత్యేకంగా న్యాయ వ్యవస్థ, ఆరోగ్య సంరక్షణ, మరియు యుద్ధ రంగాల్లో కృత్రిమ మేధస్సు (AI) వినియోగం తీవ్రమైన నైతిక ప్రశ్నలను లేవనెత్తుతోంది. యుద్ధంలో స్వయంచాలక ఆయుధాలు మానవ నిర్ణయాన్ని తొలగిస్తే, అది మానవ జీవన గౌరవాన్ని ప్రమాదంలో పడేస్తుంది. అందువల్ల, శ్రీసభ మానవ నియంత్రణ మరియు బాధ్యత తప్పనిసరిగా ఉండాలని నొక్కి చెబుతుంది.

## ఫ్రాన్సిస్ జగద్గురువులు మరియు "యుగాంతర మార్పు"

ఫ్రాన్సిస్ జగద్గురువులు కృత్రిమ మేధస్సు (AI)ని "యుగాంతర మార్పు"గా పేర్కొన్నారు. ఆయన దృష్టిలో, ఈ సాంకేతిక విప్లవం మానవ సమాజాన్ని మౌళికంగా మార్చే శక్తి కలిగి ఉంది. అయితే, ఆయన హెచ్చరిక కూడా స్పష్టంగా ఉంది: సాంకేతిక పురోగతి నైతిక పురోగతితో కూడి ఉండాలి. లేకపోతే, అది కొద్దిమందికి మాత్రమే లాభం చేకూర్చి, అనేకమందిని వెనుకబెట్టే ప్రమాదం ఉంది.

ఫ్రాన్సిస్ జగద్గురువులు "హృదయ జ్ఞానం" గురించి మాట్లాడుతారు. ఇది కేవలం డేటా ఆధారిత జ్ఞానం కాదు, కానీ ప్రేమ, దయ, న్యాయం, మరియు ఐక్యతతో కూడిన జ్ఞానం. కృత్రిమ మేధస్సు (AI) మనిషిని మరింత సమర్థుడిని చేయవచ్చు, కానీ మరింత మానవుడిని చేయలేదు. ఆ బాధ్యత మనదే.

## శ్రీసభ పాత్ర: మార్గనిర్దేశకురాలిగా

శ్రీసభ ఈ సాంకేతిక యుగంలో ప్రపంచానికి నైతిక దిక్సూచిని అందించాలనే పిలుపు కలిగి ఉంది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, యాజకులు, పీఠాధిపతులు అందరూ కృత్రిమ మేధస్సు (AI) గురించి సరైన అవగాహనను పెంపొందించాలి. యువతకు కృత్రిమ మేధస్సు (AI) ఒక సహాయక సాధనం మాత్రమే అని, అది మనస్సాక్షిని భర్తీ చేయలేదని నేర్పాలి. విద్యలో కృత్రిమ మేధస్సు (AI) ఉపకరణంగా ఉపయోగపడవచ్చు, కానీ గురువు స్థానాన్ని తీసుకోకూడదు. కమ్యూనికేషన్‌లో అది వేగాన్ని పెంచవచ్చు, కానీ మానవ సంబంధాలను బలహీనపరచకూడదు. ఈ సమతుల్యతను కాపాడటం శ్రీసభ యొక్క బాధ్యత.

## ముగింపు

మానవ బుద్ధి దేవుని వరం. కృత్రిమ మేధస్సు మానవ సృష్టి. ఈ రెండింటిని సమానంగా చూడడం మానవ గౌరవాన్ని తగ్గించే ప్రమాదం కలిగిస్తుంది. శ్రీసభ స్పష్టంగా ప్రకటిస్తున్నది ఏమిటంటే, సాంకేతికత మానవునికి సేవ చేయాలి, మానవుడు సాంకేతికతకు సేవకుడిగా మారకూడదు. కృత్రిమ మేధస్సు (AI) యుగంలో నిజమైన సవాలు ఎక్కువ తెలివి కలిగిన యంత్రాలను తయారు చేయడం కాదు, మరింత బాధ్యతాయుతమైన, దయగల, నైతిక మానవులుగా మారడం. ఇదే శ్రీసభ మనకు ఇచ్చే పిలుపు బుద్ధితో పాటు హృదయాన్ని, శక్తితో పాటు ప్రేమను, పురోగతితో పాటు మానవత్వాన్ని కాపాడుకోవడం.

## కృత్రిమ మేధస్సు (Artificial Intelligence – AI) అంటే ఏమిటి?

కృత్రిమ మేధస్సు AI అనే భావనలోని "మేధస్సు" అనేది కాలక్రమేణా విస్తృత అర్థాలను సంతరించుకుంది. తత్వశాస్త్రం, విజ్ఞానశాస్త్రం, గణితం, న్యూరోసైన్స్ మరియు కంప్యూటర్ శాస్త్రం వంటి అనేక రంగాల నుంచి వచ్చిన ఆలోచనల కలయికగా కృత్రిమ మేధస్సు (AI) అభివృద్ధి చెందింది. దీని మూలాలు శతాబ్దాల క్రితమే కనిపించినప్పటికీ, 1956లో అమెరికా దేశానికి చెందిన

కంప్యూటర్ శాస్త్రవేత్త జాన్ మెకార్తీ డార్ట్‌మౌత్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన వర్క్‌షాప్‌తో కృత్రిమ మేధస్సు (AI) పరిశోధనకు స్పష్టమైన దిశ ఏర్పడింది. ఆయన కృత్రిమ మేధస్సు (AI)ని, "మనిషి చేస్తే తెలివిగా భావించే విధంగా ఒక యంత్రం ప్రవర్తించేలా చేయడం"గా నిర్వచించాడు. ఈ నిర్వచనం ద్వారా మానవ మేధస్సుకు సంబంధించిన పనులను యంత్రాల ద్వారా సాధించాలనే ఆలోచన బలపడింది.

ఈ అభివృద్ధిని శ్రీసభ సంపూర్ణంగా తిరస్కరించదు. ఎందుకంటే శ్రీసభ ప్రకారం, మానవ బుద్ధి దేవుడు ఇచ్చిన వరం (కీర్తనలు 8). ఆ బుద్ధి ద్వారా మనిషి సృష్టించిన ప్రతి సాంకేతిక సాధనం దేవుని సృష్టిలో భాగంగానే చూడాలి. అయితే శ్రీసభ ఒక స్పష్టమైన హెచ్చరిక ఇస్తుంది: మనిషి సృష్టించిన సాధనం ఎప్పటికీ మనిషి స్థానం తీసుకోకూడదు. సాంకేతిక జ్ఞానం సేవకురాలిగా ఉండాలి గానీ, యజమానిగా మారకూడదు.

కాలక్రమేణా కృత్రిమ మేధస్సు (AI) పరిశోధన వేగంగా ముందుకు సాగి, ఈరోజు మనం ఉపయోగిస్తున్న అత్యంత ఆధునిక వ్యవస్థలుగా మారింది. ఇవి సాధారణంగా "నారో కృత్రిమ మేధస్సు (AI)" (Narrow AI)గా పిలవబడతాయి. ఈ రకమైన కృత్రిమ మేధస్సు (AI) ఒక నిర్దిష్టమైన పనికే రూపకల్పన చేయబడుతుంది. ఉదాహరణకు భాషలను అనువదించడం, వాతావరణ మార్పులను అంచనా వేయడం, చిత్రాలను గుర్తించడం, వైద్య నివేదికలను విశ్లేషించడం, విద్యార్థుల ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడం వంటి పనులు కృత్రిమ మేధస్సు (AI) సమర్థంగా నిర్వహిస్తోంది. సమాజంలో దీనివల్ల అనేక మంచి ఫలితాలు కనిపిస్తున్నాయి. ఉదాహరణకు, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సదుపాయాలు లేని చోట్ల కృత్రిమ మేధస్సు (AI) ఆధారిత స్కానింగ్ ద్వారా వ్యాధులను ముందే గుర్తించడం అనేక ప్రాణాలను కాపాడుతోంది. ఇది శ్రీసభ చెప్పే "జీవన పరిరక్షణ" (pro-life) సూత్రానికి అనుకూలంగా ఉంటుంది.

ఈ కృత్రిమ మేధస్సు (AI) వ్యవస్థలు పెద్ద మొత్తంలో డేటాను విశ్లేషించి, అందులోని నమూనాలను గుర్తించి, భవిష్యత్తు ఫలితాలను ఊహిస్తాయి. ఇవి మానవ ఆలోచనలను అనుకరిస్తాయి కానీ నిజంగా ఆలోచించవు. న్యూరల్ నెట్‌వర్కులు, మంత్రాల యుక్తి, సామర్థ్యం, శక్తివంతమైన ప్రాసెసర్లు వంటి సాంకేతిక

పురోగతుల వల్ల ఇవి సాధ్యమయ్యాయి. ఫ్రాన్సిస్ జగద్గురువులు *Laudato Si* మరియు *Fratelli Tutti* లో స్పష్టంగా చెబుతారు: సాంకేతిక పురోగతి మానవ కుటుంబం మొత్తానికి మేలు చేయాలి. అది బలహీనుల్ని మరింత బలహీనులను చేయకూడదు, పేదలను పక్కకు నెట్టకూడదు.

కృత్రిమ మేధస్సు (AI) అభివృద్ధి కారణంగా ఒకప్పుడు కేవలం మనుషులే చేయగలిగిన అనేక పనులు ఇప్పుడు యంత్రాల చేతిలోకి వెళ్తున్నాయి. ముఖ్యంగా డేటా విశ్లేషణ, వైద్య నిర్ధారణ, పరిశోధన రంగాల్లో కృత్రిమ మేధస్సు (AI) మానవ సామర్థ్యాలను మించి పనిచేస్తోంది. దీనితో పాటు, కొంతమంది శాస్త్రవేత్తలు "ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్" (AGI) అనే లక్ష్యాన్ని ప్రతిపాదిస్తున్నారు. అంటే, ఒకే యంత్రం మానవుడిలా అన్ని మేధో రంగాల్లో పనిచేయగలగడం. కొందరు దీన్ని మానవ పురోగతికి కొత్త ద్వారంగా చూస్తున్నారు. అయితే మరికొందరు, ఇది మానవ గౌరవాన్ని తగ్గించే ప్రమాదం ఉందని భయపడుతున్నారు.

ఈ సందర్భంలో శ్రీసభ చాలా స్పష్టంగా మాట్లాడుతుంది. మనిషి దేవుని స్వరూపంలో సృష్టించబడ్డాడు (ఆది 1:26). అతని గౌరవం అతని సామర్థ్యాలపై ఆధారపడదు, అతని సృష్టి స్వభావంపైనే ఆధారపడి ఉంటుంది. ఒక యంత్రం ఎంత తెలివైనదైనా, అది దేవుని ప్రతిరూపం కాదు. అందుకే శ్రీసభ కృత్రిమ మేధస్సు (AI)ను ఉపయోగించాలి కానీ దానికి మనిషి విలువను అప్పగించకూడదని బోధిస్తుంది.

ఇక్కడ మానవ మేధస్సు మరియు కృత్రిమ మేధస్సు (AI) మేధస్సు మధ్య ఉన్న తేడాను స్పష్టంగా గుర్తించాలి. మానవ మేధస్సు అనేది కేవలం సమస్యలను పరిష్కరించే సామర్థ్యం కాదు. అది భావోద్వేగాలు, నైతికత, అంతరాత్మ, ప్రేమ, త్యాగం వంటి అంశాలతో ముడిపడి ఉంటుంది. కృత్రిమ మేధస్సు (AI)లోని "మేధస్సు" మాత్రం పూర్తిగా కార్యనిర్వహణాత్మకమైనది. అది ముందుగా ఇచ్చిన డేటా మరియు అల్గోరిథమ్‌ల ఆధారంగా పనిచేస్తుంది. పునీత థామస్ అక్వైనాస్ చెప్పినట్లుగా, మానవ మేధస్సు ఆత్మతో ముడిపడి ఉంటుంది యంత్రానికి ఆత్మ ఉండదు.

ఈ తేడాను మరింత స్పష్టంగా చూపేది ట్యూరింగ్ టెస్ట్. ఒక యంత్రం మనిషిలా ప్రవర్తిస్తే దాన్ని "తెలివైనది"గా పరిగణించాలనే ఈ పరీక్ష, కేవలం బాహ్యా ప్రవర్తననే కొలుస్తుంది. కానీ మనిషి మేధస్సు కేవలం సమాధానాల ఉత్పత్తి కాదు. అతను ప్రేమించగలడు, బాధపడగలడు, క్షమించగలడు, దేవుణ్ని అన్వేషించగలడు. ఇవేవీ కృత్రిమ మేధస్సు (AI) లో లేవు. శ్రీసభ ప్రకారం, మానవుడు సంబంధాల జీవి అతని మేధస్సు సంబంధాల ద్వారా పరిపూర్ణమవుతుంది.

కృత్రిమ మేధస్సు (AI) ఎంత అభివృద్ధి చెందినా, అది ఆలోచించదు. ఇది ఒక కీలకమైన సత్యం. కృత్రిమ మేధస్సు (AI) లెక్కిస్తుంది, పోలుస్తుంది, అంచనా వేస్తుంది. కానీ అది "అర్థం"ను అనుభవించదు. మనిషి మాత్రం తన చర్యలకు బాధ్యత వహిస్తాడు, తన అంతరాత్మ ద్వారా మంచిచెడులను విచారిస్తాడు. ఇదే మానవ గౌరవానికి మూలం. అందుకే శ్రీసభ చెబుతుంది: టెక్నాలజీ అభివృద్ధి మానవ మేధస్సును సహాయపడాలి, భర్తీ చేయకూడదు.

సమాజంలో కృత్రిమ మేధస్సు (AI) మంచి విధంగా ఉపయోగించబడి నప్పుడు శ్రీసభ దాన్ని స్వాగతిస్తుంది. ఉదాహరణకు, పేద పిల్లలకు ఆన్‌లైన్ విద్య అందించడం, విపత్తుల సమయంలో సహాయక చర్యలను సమర్థంగా నిర్వహించడం, వైద్య సేవలను అందరికీ చేరవేయటం, ఇవి ప్రేమ మరియు సేవకు మార్గాలుగా మారతాయి. అయితే అదే కృత్రిమ మేధస్సు (AI)ను ప్రజలపై నిఘా పెట్టడానికి, నకిలీ వార్తలు సృష్టించడానికి, లేదా మానవ ఉద్యోగాలను విలువలేనివిగా చూపించడానికి ఉపయోగిస్తే, అది మానవ గౌరవానికి విరుద్ధమవుతుంది.

ముగింపుగా, శ్రీసభ ఈ యుగానికి ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తుంది: కృత్రిమ మేధస్సు మానవ సేవ కోసం ఉన్న సాధనం మాత్రమే. నిజమైన మేధస్సు యంత్రాల్లో కాదు, ప్రేమలో, సత్యంలో, బాధ్యతలో, మరియు దేవునితో ఉన్న సంబంధంలోనే పరిపూర్ణమవుతుంది. కృత్రిమ మేధస్సు (AI) యుగంలో కూడా, మనిషే దేవుని ప్రతిరూపం, అతనికే అత్యున్నత గౌరవం.

❋ ❋ ❋ ❋

# 4. వేదాంత శాస్త్రము మరియు దైవశాస్త్ర సంప్రదాయంలో తర్కశక్తి యొక్క పాత్ర

- బ్రదర్ గుత్తుల ప్రేమ్‌కుమార్



## తార్కికత (Rationality)

మానవుడు "నేను ఎవరు?", "నా జీవితానికి అర్థం ఏమిటి ?" అని ఆలోచించడం ప్రారంభించినప్పటి నుండి, మనిషి మనస్సు ఈ ప్రశ్నలకు సమాధానం వెతకడంలో ప్రధాన పాత్ర పోషిస్తుంది.

అరిస్టోటిల్ అనే గొప్ప తత్వవేత్త ఇలా చెప్పాడు: "ప్రతి మానవుని తన సహజ స్వభావం ప్రకారం తెలుసుకోవాలని తపనపడతాడు." అంటే మనిషికి పుట్టుకతోనే కొత్త విషయాలు తెలుసుకోవాలనే ఆసక్తి ఉంటుంది. ఎంతో ఆసక్తితో, ఎంతో తెలుసుకోవాలనే తపన మనుషులను జంతువుల నుండి ప్రత్యేకంగా, వేరుగా నిలబెడుతుంది. తత్వవేత్తలు, ధార్మికులు, మానసిక శాస్త్రవేత్తలు కూడా తార్కికత గురించి అధ్యయనం చేస్తూ, మనిషి ప్రపంచాన్ని ఎలా అర్థం చేసుకుంటాడు, తన స్థానాన్ని ఎలా గ్రహిస్తాడు అనే విషయాలను పరిశీలించారు. ఈ అధ్యయనాల ద్వారా క్రైస్తవ బోధన ఒక ముఖ్యమైన నిజాన్ని చెబుతుంది: మనిషి అంటే శరీరం మరియు ఆత్మ కలిసిన ఒక సంపూర్ణ వ్యక్తి. అవును, మనిషి భౌతిక లోకంలో జీవిస్తాడు, శరీరంతో పని చేస్తాడు.

కానీ అదే సమయంలో అతనిలో ఒక ఆధ్యాత్మిక లోకం ఉంటుంది, అది అతన్ని ఈ భౌతిక ప్రపంచాన్ని మించి ఆలోచించగలిగేలా చేస్తుంది. సాంప్రదాయ తత్వం ప్రకారం, మనిషి మేధస్సు ఎలా పనిచేస్తుంది? అన్నది చెప్పడానికి రెండు ముఖ్యమైన భావాలను ఉపయోగిస్తారు: అవి (1) బుద్ధి, (2) జ్ఞానం.

1. బుద్ధి *(Ratio)* ఇది ఆలోచించడం, విచారణ చేయడం, ప్రశ్నలు వేయడం, విశ్లేషించడం ద్వారా తీర్పు *(judgment)* కు చేరే తార్కిక ప్రక్రియ. ఉదాహరణ: ఒక సమస్యకు పరిష్కారం కనుగొనడానికి దశలవారీగా ఆలోచించడం. ఇది పదేపదే ఆలోచిస్తూ నిర్ణయానికి వచ్చే విధానం.
2. జ్ఞానం *(Intellectus)* అనేది సత్యాన్ని నేరుగా గ్రహించే విధానము. ఉదాహరణ: మనం ఒక మంచి వ్యక్తిని చూసినప్పుడు, "ఇతను మంచివాడు" అని వెంటనే అర్థం అవుతుంది. దీన్ని అర్థం చేసుకోవడానికి ఎక్కువగా ఆలోచన లేదా తార్కిక *reasoning* అవసరం ఉండదు.

అంటే, *Intellectus* అనేది మనసు సత్యాన్ని తక్షణమే, నేరుగా గ్రహించే విధానం.

ఇవి రెండు వేర్వేరుకావు అని. ఇవి ఒకే మేధస్సు పనిచేసే రెండు విధానాలు అని పునీత థామస్ అక్వినాస్ చెప్పారు. ఇంటెల్లిజెరే *(Intelligere)* అనేది మనిషి చేసే ప్రత్యేక పని, ఇది జ్ఞానం *(Intellectus)* మరియు బుద్ధి *(Ratio)* కలిసే ప్రక్రియ. జ్ఞానం సత్యాన్ని నేరుగా గ్రహించడంలో సహాయం చేస్తుంది, బుద్ధి ఆ సత్యాన్ని ఆలోచించి, విశ్లేషించి అర్థం చేసుకోవడానికి సహాయపడుతుంది. వీటి కలయిక ద్వారా మనిషి సత్యాన్ని గ్రహించగల సామర్థ్యం, ఆలోచించగల శక్తి ఏర్పడుతుంది.

మనిషిని "తార్కిక జీవి" అని చెప్పడం అంటే అతన్ని కేవలం ఆలోచించే యంత్రంగా మాత్రమే చూడటం కాదు. మనిషి తరలించే, అర్థం చేసుకునే, నిర్ణయించే సామర్థ్యం జీవితం యొక్క అన్ని అంశాలను ప్రభావితం చేస్తుంది. ఈ సామర్థ్యం సరైన విధంగా ఉపయోగించినా, తప్పుగా ఉపయోగించే కోణం మనిషి స్వభావంలో భాగమే. ఈ విధంగా తార్కికత అనేది తెలుసుకోవడం, అర్థం చేసుకోవడం, నిర్ణయించడం, ప్రేమించడం, ఆశించడం వంటి అన్ని మానవుడు కలిగి వుంటాడు. ఇవి శరీరంతో కూడిన మన చర్యలతో కూడా అనుసంధానంగా ఉంటాయి.

ఈ సమగ్ర దృష్టి చూపేది ఏమిటంటే, మనిషి దేవుని రూపంలో సృష్టించబడిన వ్యక్తి, మరియు అతని బుద్ధి, సంకల్పం, చర్యలన్నీ అతని వ్యక్తిత్వాన్ని ఆకృతిచేస్తాయి, ఎత్తిచూపిస్తాయి మరియు మార్చివేస్తాయి.

## పరస్పర సంబంధ స్వభావం

మనిషికి మనిషికి మధ్య ఉండే పరస్పర అనుబంధం వారి సహజ స్వభావంలో భాగం. మనుషులు ఒకరిని ఒకరు ప్రేమతో అంగీకరిస్తారు, ఒకరికి ఒకరు తోడుగా నిలుస్తారు, ఒకరి కోసం ఒకరు జీవిస్తారు. ఎవరూ ఒంటరి వ్యక్తి కాదు. ప్రతి వ్యక్తి ఏదో ఒక విషయంలో ఇతరులపై ఆధారపడి ఉంటాడు.

మనిషి తనంతట తాను అన్నింటిని నేర్చుకోలేడు. ఇతరులతో కలిసి, ఇతరుల ద్వారా ఎన్నో విషయాలను అవగాహన చేసుకుంటాడు. మనం ఇతరులతో మాట్లాడే విధానం, మన ప్రవర్తన, వారికి ఇచ్చే మన స్పందన, సహాయం, ప్రేమ మరియు సోదర భావం ఇవన్నీ మన మధ్య ఉన్న అనుబంధాన్ని మరింత బలపరుస్తాయి.

అసలైన, శాశ్వతమైన అనుబంధం అనేది దేవునితో ముడిపడిన బంధమే. త్రియేక దేవుడు మనపై ఉన్న ప్రేమను సృష్టిలోనూ, తన రక్షణ ప్రణాళికలోనూ స్పష్టంగా వెల్లడించాడు. మనందరం దేవునిలో పరస్పర సంబంధంతో, ప్రేమతో, ఆయనతో కలసి జీవించడమే నిజమైన అనుబంధం.

అదే మన జీవిత పిలుపు దేవునితో ఏకమై ప్రేమలో జీవించడం. దేవుని యందు మన ప్రేమ–అనుబంధం అనే పిలుపు ఇతరులతో మనం కలిసిమెలిసి జీవించడం ద్వారా వ్యక్తమవుతుంది. ఇతరులను ప్రేమించలేకపోతే దేవునిని ప్రేమిస్తున్నామని చెప్పుకోవడం అసాధ్యం. ఇదే విషయాన్ని పరిశుద్ధ గ్రంథం స్పష్టంగా బోధిస్తుంది.

1 యోహాను 4:20–21 ఇలా చెబుతుంది: "ఎవడైనా 'నేను దేవుని ప్రేమిస్తున్నాను' అని చెప్పి తన సోదరునిని ద్వేషించినయెడల వాడు అసత్యవాది. తన కళ్లతో చూసిన సోదరునిని ప్రేమించనివాడు తాను చూడని దేవునిని ఎలా ప్రేమించగలడు? కాబట్టి దేవుడిని ప్రేమించువాడు తన సోదరునిని కూడా ప్రేమించవలెనని ఆయన మనకు ఆజ్ఞ ఇచ్చాడు."

కాబట్టి క్రైస్తవునిగా మన కర్తవ్యం ప్రభువు ఇచ్చిన ఆజ్ఞను పాటించడం, అదే ఇతరులను ప్రేమించడం. మనం చూపించే ప్రేమ, సోదరత్వం, నిస్వార్థంగా చేసే మంచి క్రియలు దేవుని జీవనాన్ని మనలో ప్రతిబింబిస్తాయి. ఇవి ఇతరులతో ఉన్న మన సంబంధాలను దృఢపరచి దేవుని యందు ఉన్న మన నిజమైన ప్రేమను వెల్లడిస్తాయి.

## సత్యంతో సంబంధం

దేవుడు మనకు సత్యాన్ని గ్రహించడానికి జ్ఞానాన్ని ఒక గొప్ప వరంగా ఇచ్చాడు. కతోలిక సత్యోపదేశం 1704లో దేవుని పోలికలో సృష్టించబడిన మానవుని, సత్యాన్ని తెలుసుకునే మరియు మంచి దారిని ఎంచుకునే సామర్థ్యం కలిగి ఉన్నాడు. సత్యాన్వేషణ మనిషిలో సహజ స్వభావం వస్తువులు ఎందుకు ఉన్నాయి? నిజమైన మార్గం ఏది?" అని ప్రశ్నిస్తూ మనిషి ఎప్పుడూ ముందుకు సాగుతాడు. సత్యాన్ని పూర్తిగా గ్రహించడం సులభం కాదు.

మన బుద్ధి అందుకోలేని లోతైన భావాలు ఎన్నో ఉన్నాయి. అయినా సత్యం మనిషిని ఎల్లప్పుడూ ఆకర్షిస్తుంది, అతన్ని ఉన్నతమైన సత్యాల వైపు నడిపిస్తుంది. సత్యాన్ని తెలుసుకోవాలనే ఈ సహజ కోరిక మనుషుల్లో సృజనాత్మకత ద్వారా స్పష్టమవుతుంది. ఈ సత్యాన్వేషణ మనిషి గౌరవానికి, అతని సామాజిక జీవితానికి తగ్గవిధంగా సాగుతుంది. అదే విధంగా, మనం చేసే సేవలు లేదా ప్రేమ నిజమైనవి కావాలంటే, సత్యంపై నిలకడగా ఉండటం చాలా ముఖ్యము. సత్యాన్వేషణ అనేది ఎంతో ప్రాముఖ్యమైనది.

ఈ ప్రపంచాన్ని, అందులోని సమస్తాన్ని నిజంగా అర్థం చేసుకోవాలంటే మన పరిమిత జ్ఞానం సరిపోదు. ఎందుకంటే ఈ సృష్టిలో ఎంతో లోతైన, గాడమైన రహస్యాలు మన కళ్లకు కనిపిస్తాయి కానీ వాటి సంపూర్ణ అర్థం మనం స్వతహాగా గ్రహించలేము. ఆ రహస్యాలు సృష్టికర్త అయిన దేవుని యందే వెలుగులోకి వస్తాయి. ఆయనే ఆధారమైన సత్యం. ఆయనే అసలైన మూలం. ఆయనే సమస్తానికి కారణం, సమస్త ప్రాణికోటికి జీవితకారకుడు. నిజమైన సత్యం దేవునిలోనే ఉంది. మనము ఆ సత్యాన్ని గ్రహించి, మన హృదయాలను దేవునికి సమర్పించినప్పుడు ఆయన మనకు పరమ రహస్యాలను అర్థం చేసుకునే వెలుగును ప్రసాదిస్తాడు.

## ప్రపంచ సంరక్షణ సృష్టి సంరక్షణలో మనిషి బాధ్యత

క్రైస్తవ విశ్వాసం ప్రకారం, సృష్టి అనేది త్రిత్వ దేవుని స్వేచ్ఛాయుత చర్య. పునీత బోనవెంచర్ గారు ఇలా అంటారు, దేవుడు "తన మహిమను పెంచుకోవడానికి ఈ సృష్టిని సృష్టించలేదు, దానిని వ్యక్తపరచి ఇతరులకు

పంచడానికి" సృష్టించాడు. దేవుడు తన జ్ఞానం ప్రకారం సృష్టించినందు ఈ సృష్టి ఒక క్రమబద్ధతతో నిండి ఉంది, అది దేవుని ప్రణాళికను తెలియజేస్తుంది, ఈ ప్రణాళికలో దేవుడు మనుష్యులను ఒక ప్రత్యేకమైన స్థానం ఇచ్చారు. అదే ప్రపంచాన్ని సాగుచేయడం మరియు సంరక్షించడం.

ఈ సృష్టిని సృష్టించిన దేవునికి మనిషి ఎంతో ప్రియమైనవాడు. ఎందుకంటే దేవుడు మనిషిని తన పోలికలో, తన స్వరూపంలో సృష్టించాడు. అందుకే ఆదికాండము 2:15 ప్రకారం, దేవుడు మనిషిని ఈ లోకంలో సృష్టిని కాచి, కాపాడే బాధ్యత కోసం ఉంచాడు. సృష్టిని నిర్మించిన దేవునికి ఒక గొప్ప ప్రణాళిక ఉంది. అది సృష్టి ఆరంభం నుంచే మనకు స్పష్టంగా కనిపిస్తుంది. దేవుడు మానవాళిని ముందుండి నడిపించే దేవుడు చివరికి మనిషిని తన దగ్గరికి తిరిగి రప్పించడమే ఆయన అంతిమ లక్ష్యం."సృష్టి అనేది దేవుని ప్రేమతో నిండిన బహుమతి. దానిని గౌరవంతో, కృతజ్ఞతతో స్వీకరించాలి." (*Laudato Si*, నం. 76). "పర్యావరణ సంక్షోభం ఒక నైతిక పిలుపు. మన జీవనశైలి మారాలి." (*Laudato Si*, నం. 202)

సృష్టితో మనకు సరైన బంధం ఉంటే, అది మనలను రెండు ముఖ్యమైన మార్గాల వైపు నడిపిస్తుంది:

**మొదటిది:** సృష్టిని సరియైన రీతిలో సంరక్షించడం. ఇలా చేసినప్పుడు దేవుడు మనకు ఇచ్చిన కర్తవ్యానికి, మన పిలుపుకు నమ్మకస్తులమై నిలబడతాం.

**రెండవది:** పునీత బోనవెంచర్ గారు చెప్పినట్లుగా, సృష్టి మన మానసిక ప్రపంచాన్ని క్రమంగా దేవుని వైపుకి తీసుకువెళ్తుంది అనగా సర్వలోకాన్ని సృష్టించిన ఏకైక సృష్టికర్త వైపు. అందువల్ల, సృష్టి సంరక్షణలో మనిషి పాత్ర అత్యంత ఉన్నతమైనది, పవిత్రమైనది. ఈ బాధ్యతను ఎవ్వరూ నిర్లక్ష్యం చేయకూడదు. మనము సృష్టిని గమనించి దాని మీద ఆలోచించడం ప్రారంభించినప్పుడు, "ఈ ప్రపంచం ఎలా వచ్చింది?", "దీనికి మూలకర్త ఎవరు?" అనే ప్రశ్నలు మనలో కలుగుతాయి. ఆ ప్రశ్నలకు సమాధానాలు వెతుకుతూ సరైన మార్గంలో ఆలోచించినప్పుడు, ఈ మహత్తరమైన సృష్టికి సృష్టికర్త ఒకరే అదే సర్వలోక సృష్టికర్త అయిన దేవుడు అని మనకు అర్థమవుతుంది.

దేవుడు మన కంటికి ప్రత్యక్షంగా కనిపించకపోయినా, ఆయనను, ఆయన సృష్టించిన ఈ ప్రపంచం ద్వారా మనం తెలుసుకోగలం. ఈ సృష్టి యొక్క అందం, క్రమం, మహిమను చూశాక, "ఈ అంతటి సృష్టిని చేసినవాడు ఎవరు?" అని మనం ఆలోచించినప్పుడు, మన మనస్సు దేవుని వైపుకు లాగబడుతుంది. ఈ విధంగా సృష్టిని ధ్యానించడం మనలను తిరిగి సృష్టికర్త దేవుని సన్నిధికి తీసుకు వెళ్తుంది. అందుచేత, సృష్టి సంరక్షణ ఒక చిన్న పని కాదు ఇది దేవుడు మనిషికి అప్పగించిన గొప్ప మరియు పవిత్రమైన బాధ్యత.

"మానవ బుద్ధిని నిజంగా అర్థం చేసుకోవాలంటే, మనిషి తనలోని అన్ని కోణాలను ఆధ్యాత్మికత, తార్కిక–భౌతిక సామర్థ్యం, శరీరంతో అనుభవించే లోకజీవితం, ఇతరులతో సంబంధాలు ఇవన్నింటినీ సమగ్రంగా అంగీకరించాలి. అప్పుడే నిజమైన అవగాహన ఏర్పడుతుంది."

మనం ప్రపంచాన్ని అర్థం చేసుకునే విధానం చాలా రకాలుగా ఉంటుంది. ప్రతి మనిషి తనదైన ప్రత్యేక వ్యక్తిత్వంతో జీవిస్తాడు. మనం:

1. ప్రపంచాన్ని తెలుసుకోవడానికి
2. ఇతరులతో మంచి సంబంధాలు ఏర్పరచుకోవడానికి
3. సమస్యలను పరిష్కరించుకోవడానికి
4. సృజనాత్మకతను చూపడానికి
5. ఆరోగ్యంగా, సంతోషంగా జీవించడానికి ప్రయత్నిస్తాం. ఈ ప్రయత్నంలో మన బుద్ధి (తెలివి) అనేక విధాలుగా పనిచేస్తుంది.

కేవలం చదువు లేదా తర్కం మాత్రమే కాదు. తెలివి అంటే కేవలం లెక్కలు చేయగలగడం లేదా మాట్లాడగలగడం మాత్రమే కాదు. వాస్తవాన్ని తెలుసుకోవడానికి ఇతర మార్గాలు కూడా ఉన్నాయి:

శిల్పి ఉదాహరణ: ఒక శిల్పి రాళ్లలో లేదా పదార్థంలో సాధారణ మనుషులకు కనిపించని ఒక అందమైన రూపాన్ని గుర్తిస్తాడు. తన నైపుణ్యంతో దాన్ని బయటకు తీసుకొస్తాడు. ఇది ఒక ప్రత్యేకమైన తెలివి.

## ప్రకృతితో అనుబంధం

భూమికి దగ్గరగా జీవించే స్థానిక ప్రజలు (ఆదివాసీలు) ప్రకృతిని, దాని

మార్పులను లోతుగా అర్థం చేసుకోగలరు. ఇది వారి ప్రత్యేకమైన అనుభూతి. సంబంధాల నిర్వహణ: సరైన సమయంలో సరైన మాట చెప్పగలిగే స్నేహితుడు లేదా ఇతరులతో సంబంధాలను చక్కగా నిలబెట్టుకోగలిగే వ్యక్తి కూడా ఒక ప్రత్యేకమైన తెలివిని కలిగి ఉన్నట్టే. ఈ తెలివి అంతా మన స్వీయ పరిశీలన, ఇతరులతో మాట్లాడటం, మరియు ఒకరిపై ఒకరు చూపించే ఔదార్యం ద్వారా ఏర్పడుతుంది.

జగద్గురువులు ఫ్రాన్సిస్ మాటల్లో, ఈ నూతన కృత్రిమ మేధస్సు (AI) యుగంలో కూడా, మన మానవత్వాన్ని కాపాడుకోవడానికి కవిత్వం (సృజనాత్మకత) మరియు ప్రేమ చాలా అవసరం. క్రైస్తవ విశ్వాసం ప్రకారం, బుద్ధి (జ్ఞానం) అంటే మనిషి తెలుసుకున్న సత్యాన్ని తన జీవితంలో జీవించడం, ముఖ్యంగా నైతికంగా (మంచి–చెడు మధ్య తేడా తెలుసుకుని మంచి దారిలో నడవడం) మరియు ఆధ్యాత్మికంగా సరిగా జీవించడం.

దేవుని దయ మరియు సత్యం అనే వెలుగులో జీవించినప్పుడు, అదే సత్యం మన పనులను సరైన దిశగా నడిపిస్తుంది. ఫ్రెంచ్ కవి పాల్ క్లోడెల్ ఇలా అన్నాడు "ఆనందం లేని బుద్ధి అసలు బుద్ధి కాదు." అంటే, మనసులో ఆనందం, ఆశ్చర్యం, లోతైన సంతృప్తి లేకుండా ఉండే జ్ఞానం జీవం లేనట్టే. డాంటే, స్వర్గానుభవాన్ని వర్ణిస్తూ ఇలా చెబుతాడు,"ప్రేమతో నిండిన దివ్య తేజస్సులోనే నిజమైన ఆనందం ఉంది. ఆ ఆనందం ప్రతి మాధుర్యాన్ని మించి ఉంటుంది." జీవితంలో ముఖ్యమైన ప్రశ్నలకు మనం ఎంతగా నెర్చుకునేకిటికి తెరిచి ఉన్నామనే దాని మీద మన అసలైన తెలివితేటలు ఆధారపడతాయి. ఉదాహరణకు "నేను ఎందుకు పుట్టాను?", "జీవితం యొక్క ఉద్దేశ్యం ఏమిటి?" వంటి లోతైన ప్రశ్నలు.

మనిషి తెలివితేటలు అతనిలో ఉన్న దేవుని పోలికను ప్రతిబింబిస్తాయి. అందుకే ఈ ప్రపంచాన్ని, సృష్టిని, వాటి అర్థాన్ని లోతుగా ఆలోచించే ప్రత్యేకమైన సామర్థ్యం మనకు ఉంది. మన ఆలోచన లెక్కలు, గణితం వంటి వాటికే పరిమితం కాదు వాటి కంటే మరింత లోతైన ఉనికి, జీవితం, మంచి–చెడు వంటి విషయాలను వెదికే శక్తి ఉంది. విశ్వాసులైన మనం ఈ బుద్ధిని ఉపయోగించి దేవుని మర్మాలను తెలుసుకుంటాం. బైబిల్‌లో వెల్లడించబడిన సత్యాలు ఇంకా లోతుగా మనకు

అర్థమవుతాయి. దీనినే *Intellectus fidei* అంటారు, అంటే విశ్వాసం ద్వారా ఆలోచించడం. నిజమైన తెలివితేటలు ప్రేమతో నిండి ఉంటాయి. దేవుని ప్రేమ పరిశుద్ధాత్మ ద్వారా మన హృదయంలో కుమ్మరించబడినప్పుడు (రోమా 5:5), మన ఆలోచనలు మరింత శుద్ధి చెంది, నిజం, మంచితనం వైపు సులభంగా తిరుగుతాయి.

మనిషి బుద్ధి మరియు కృత్రిమ మేధస్సు (AI) మధ్య స్పష్టమైన తేడాలు ఉన్నాయి. కృత్రిమ మేధస్సు (AI) అనేది మనిషి చేసే కొన్ని పనులను అనుకరించే శక్తి ఉన్న సాంకేతికం అయినప్పటికీ, అది మనిషిలా నిజంగా ఆలోచించదు. కృత్రిమ మేధస్సు (AI) పూర్తిగా సంఖ్యలు, డేటా, గణాంకాలు చూసే వ్యవస్థ మాత్రమే. ఇవి ఆధారంగా లెక్కలు వేసి సమాధానాలు ఇస్తుంది. వేర్వేరు రంగాల సమాచారాన్ని కలిపి నమూనాలు తయారు చేయడంలో, అలాగే నిపుణులు పెద్ద సమస్యలను అర్థం చేసుకునేలా సహాయం చేయడంలో కృత్రిమ మేధస్సు (AI) చాలా ఉపయోగపడుతుంది.

అయితే కృత్రిమ మేధస్సు (AI) పనిచేసేది తర్కం, గణితం, లెక్కలు అనే పరిమితుల్లోనే. అందుకే దానికి సహజంగానే కొన్ని పరిమితులు ఉంటాయి. దీనికి భిన్నంగా మనిషి బుద్ధి చిన్నప్పటి నుండి పెద్దయ్యే వరకూ సహజంగానే అభివృద్ధి చెందుతుంది. మనం చూసేది, వినేది, అనుభవించేది, మన భావాలు, మనం మాట్లాడే తీరు ఇవి అన్నీ కలిసి మన తెలివితేటలను తీర్చిదిద్దుతాయి. మనిషి జీవితాన్ని అనుభవిస్తాడు, ప్రతి రోజు కొత్త పరిస్థితులను ఎదుర్కొంటాడు, వాటి నుంచి నేర్చుకుంటాడు. ఇవన్నీ కలిసి ఒకరి వ్యక్తిత్వం మరియు పూర్తిస్థాయి బుద్ధిని తయారు చేస్తాయి.

కానీ కృత్రిమ మేధస్సు (AI)కి శరీరం లేదు, జీవితం లేదు, భావాలు లేవు. అది రోజువారీ అనుభవాల వల్ల నేర్చుకోదు. మనం ఇచ్చే డేటా, రికార్డ్ చేసిన సమాచారాలు, గణాంకాలు వీటి నుంచే అది నేర్చుకుంటుంది. అందుకే కృత్రిమ మేధస్సు (AI) ఎంత శక్తివంతమైనా, అది మనిషి బుద్ధిని పూర్తిగా భర్తీ చేయలేదు.

## కృత్రిమ మేధస్సు (AI) సామర్థ్యాల పరిమితులు

మానవ మేధస్సు అంటే ఒక వ్యక్తి యొక్క జీవిత అనుభవాలు, భావోద్వేగాలు,

కుటుంబం, సమాజం, నైతిక విలువలు, ఆధ్యాత్మికత ఇవన్నీ కలిసి ఏర్పడే ప్రత్యేకమైన శక్తి. అది మనిషి ఆలోచనా విధానాన్ని పూర్తిగా మార్చుతుంది. కృత్రిమ మేధస్సు (AI) మాత్రం ఈ సంపూర్ణ జీవిత అనుభవాన్ని కలిగి లేదు. అందుకే ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి కృత్రిమ మేధస్సు (AI) మీద మాత్రమే ఆధారపడితే, వస్తువుల మధ్య ఉన్న సంబంధం, జీవితంలోని మొత్తం దృశ్యం, విస్తృతమైన అర్థం ఇవన్నీ కోల్పోయే ప్రమాదం ఉంది. కృత్రిమ మేధస్సు (AI)కు, శరీర అనుభవం సంబంధాల లోతు, సత్యం–మంచి పట్ల గుండె తెరవడం వంటి మానవ లక్షణాలు లేవు. కాబట్టి అది ఎంత శక్తివంతంగ కనిపించినా, మనిషి నిజాన్ని అర్థం చేసుకునే విధంగా పోల్చలేము. ఒక మనిషి, అనారోగ్యం నుంచి, ప్రేమతో ఇచ్చే క్షమాపణ ఆలింగనం నుంచి, ఒక అందమైన సూర్యాస్తమయం నుంచి కూడా ఎన్నో విషయాలు నేర్చుకుంటాడు.

మానవ మేధస్సు *(Human Intelligence)* మరియు కృత్రిమ మేధస్సు (AI)ని ఒకటిగా చూడటం ప్రమాదకరం. ఎందుకంటే, దీనివల్ల మనుషుల విలువను వారు చేసే పనుల ఆధారంగా మాత్రమే కొలిచే తప్పుడు భావన ఏర్పడుతుంది. కానీ మనిషి విలువ అతని నైపుణ్యాలు, తెలివి లేదా విజయాలపై ఆధారపడదు. దేవుని స్వరూపంలో సృష్టించబడినందున, ప్రతి మనిషికి సహజమైన గౌరవం *(inherent dignity)* ఉంటుంది.

ఈ గౌరవం గర్భంలోని శిశువుకైనా, స్పృహలేని వ్యక్తికైనా, బాధపడుతున్న వృద్ధుడికైనా ఎప్పుడూ ఒకే విధంగా ఉంటుంది. ఈ సహజ గౌరవమే మానవ హక్కులకు పునాది. పోప్ ఫ్రాన్సిస్ చెప్పినట్లుగా, కృత్రిమ మేధస్సు (AI)కి "బుద్ధి *(intelligence)*" అనే పదాన్ని ఉపయోగించడం కొంచెం తప్పుదారి పట్టించవచ్చు, ఎందుకంటే అలా చేస్తే మనుషిలోని అత్యంత విలువైన లక్షణాలు కనిపించక పోవచ్చు. అందువల్ల, కృత్రిమ మేధస్సు (AI)ని మనిషి మేధస్సుతో సమానంగా చూడకూడదు. అది కేవలం మనిషి మేధస్సు సృష్టించిన ఒక సాధనం మాత్రమే.

❋ ❋ ❋ ❋

# 5. సాంకేతిక పరిజ్ఞాన (కృత్తిమ మేధస్సు) వినియోగంలో నైతిక విలువల పాత్ర

- బ్రదర్ దొప్పలపూడి రవీంద్ర



## ఉపోద్ఘాతము

సమాజంలో నైతిక విలువలు ఉండాలి. ఎందుకంటే నైతిక విలువలు పాటించేవారు, పాటించని వారు అందరూ కూడా సమాజంలో ఉంటారు. ఎప్పుడైతే సమాజంలో ఒక క్రమము లేదా ఉన్నత విలువలకు స్థానము దొరికినప్పుడు ఆ సమాజము ఎంతగానో అభివృద్ధి చెందింది అని చెప్పగలం. ఒకవేళ జీవిత ప్రయాణంలో ఎటువంటి కార్యకలాపాలలోనైనా నైతికతకు స్థానం లేకపోతే అటువంటి మనుషులు లేదా సమాజము గందరగోళంగా ఉంటుంది. నైతిక విలువలు సమాజంలో మంచిని కాపాడుతుంది చెడును విడనాడి న్యాయము ధర్మము మానవత్వమును నిలబెడుతుంది. మనమందరము సాంకేతిక పరిజ్ఞానము అభివృద్ధి చెందిన కాలంలో ఉన్నాము ఏ పనిలో చూసిన ఎక్కడ చూసినా కృత్రిమ మేధస్సు(AI) అనేది బాగా విస్తరించింది ఎంతగా విస్తరించిందంటే సాంకేతికత లేని ప్రదేశము ఎక్కడైనా కనపడుతుందా అంటే ఎక్కడ కూడా లేదు. అంతగా ఆధునిక ప్రపంచము సాంకేతిక నైపుణ్యం వైపు పరుగులు పెడుతుంది. మరి అటువంటి సాంకేతికతను వాడే తరుణంలో నైతికత అనే విషయము చాలా ప్రధానమైనది. అంటే ఏ విధముగా పరిజ్ఞానాన్ని సమాజ శ్రేయస్సుకు మనిషి అభివృద్ధికి కుటుంబాలలో శాంతికి దొహదపడతాయో ఆ విధంగా వినియోగించాలి. కనుక ఒకవేళ మనలో నైతిక విలువలు లోపిస్తే ఈ ఆధునిక విజ్ఞానాన్ని చెడుగా వినియోగించే ప్రమాదం ఎంతైనా ఉంది. కనుక సమాజము చెడు వైపు ప్రయాణించకుండా స్వార్థం వైపు పయనించకుండా నైతిక విలువలు సమాజంలో ఉండటము ఎంతైనా ఆవశ్యకత ఉంది.

## 1. కృత్రిమమేధస్సు వినియోగంలో నైతిక విలువలు వాని కీలకపాత్ర

నవీకరింపబడిన కృత్తిమ మేధస్సు వినియోగంలో నైతిక విలువలు కీలకపాత్రను పోషిస్తాయి. ఆధునిక ప్రపంచం అన్ని రంగాలలో వృద్ధి చెందింది. మానవాళి మనుగడ సృష్టింపబడిన సాంకేతిక పరికరాలపై ఆధారపడి ఉంది మనిషి తన జ్ఞానంతో చేసిన ఆవిష్కరణలు ఒక ప్రక్క మంచికి మరో ప్రక్క వినాశనానికి దారి తీస్తున్నాయి. మరి ఈ పరిస్థితులలో నైతికత ఏ విధముగా మానవాళిని ముందుకు నడిపించగలదు? మానవ పరికరాల పరిజ్ఞానం అంతర్జాలాన్ని ఇంటర్నెట్ దేవుని ప్రణాళికలో మనము ఏ విధముగా అవగతం చేసుకోగలం? దీనికి సమాధానంగా సాంకేతిక విజ్ఞాన కార్యక్రమము లేదా ప్రక్రియ తటస్థంకాదని గుర్తు చేసుకోవాలి. అంటే కృత్రిమ మేధస్సు ఎప్పుడు ఒకేలాగా ఉండాలని కోరుకోలేం. కాలానుగుణంగా మనిషి తన సృజనాత్మక ద్వారా అభివృద్ధి చేసే కృత్రిమ యంత్రాంగం మనిషి సంస్కృతిని సాంప్రదాయాలను ప్రభావితం చేస్తుంది. ఇది కేవలము మానవ కష్ట ఫలితమే కనుక యంత్రాంగం దాని విధానం, వినియోగం మానవ జీవితాన్ని అన్ని కోణాలలో ఒక మానవ కార్య మానవ మేధస్సులో అమర్చబడిన శక్తి సామర్థ్యాల ఫలం సామాన్య శాస్త్రాలపై పట్టు మరియు సాంకేతిక నైపుణ్యాల అభివృద్ధి ఇవన్నీ కూడా స్త్రీ పురుషులు దేవుడు చేసిన సృష్టిలో భాగస్వామ్యం అవుతూ దానిని ఆ సృష్టిని పరిపూర్ణం చేయడంలో ప్రధాన పాత్ర పోషిస్తాయి.

## 2. సాంకేతిక పురోగతి మానవగౌరవం నైతిక బాధ్యత

అంతేకాకుండా మనిషి సాధించిన విజయం, పరికరాల పరిజ్ఞానము, ఆధునికత ఇవన్నీ కూడా దేవుడువోసగిన కృప ఆయన ఆశీర్వాదం. కనుక మానవుడు తన పరిజ్ఞానమంత దేవుని ఉద్దేశాన్ని దృష్టిలో ఉంచుకొని సాధ్యమైనంతవరకు సరియైన విధంగా వినియోగించాలి. దీని ద్వారా దేవుని మహిమను పెంచుతూ మానవ గమనం గమ్యం వైపు చేరుకునేందుకు పునాదులు ఏర్పడతాయి. సాంకేతిక పరిజ్ఞానం మనిషికి హాని కలిగించే వివిధ రకాల చెడుల నుండి మరియు మనిషి ఔన్నత్యాన్ని తగ్గించే పనుల నుండి ఉపశమనం పొందేలా చేసింది అనడంలో ఎటువంటి లేదు అతియోశక్తి లేదు. కొన్ని పనులు మానవులకు

వారి పరిధి దాటి ఉంటాయి. ఉదాహరణకు ఒక కంపెనీలో లెక్కలు సరిచేయు విధానం చూస్తే మనిషి ఈ పనిలో చాలా కష్టంగా భావిస్తూ ఉంటాడు. తొందరగా చేయాలి అని ఫిర్యాదులు వస్తే ఆ ఆఫీసులో ఉద్యోగి మానసికంగా కుమిలిపోయే పరిస్థితి వస్తుంది. ఏవైనా ప్రాజెక్టు తొందరగా పెట్టాలంటే మనిషి తక్కువ సమయంలో చేయడంలో అతలాకుతలమైపోతాడు. ఇదే పరిస్థితి అన్ని రంగాలలో చోటు చేసుకుంటుంది. కనుక అధునాతన యంత్రాల వల్ల మనిషి కొంతమేరకు సానుకూలత, స్వేచ్ఛను పొందాడు. అయినప్పటికిని అన్ని సాంకేతిక పురోగతులు నిజమైన మానవ పురోగతిని సూచించవు. పవిత్ర జీవితానికి మనిషి ఔన్నత్యాన్ని సవాలు విసిరే అంశాలను శ్రీసభ వ్యతిరేకిస్తుంది. మనిషి ఏ విధముగానయితే సాటివారి అభివృద్ధికై సేవ చేస్తాడో బంధాలకు విలువ ఇస్తాడో న్యాయపరంగా అంతే వెలుగుతాడు. అదేవిధంగా సాంకేతిక అభివృద్ధి కూడా ఇలానే మరింత అభివృద్ధికి దోహదపడేలా చేయాలి లేదా ఉండాలి. సాంకేతిక పరిజ్ఞానం వల్ల వచ్చే ఇబ్బందులు నైతిక విలువలలో మార్పులు సమాజంలో ఆందోళనలు ఇవన్నీ కేవలం శ్రీసభలో మాత్రమే కాదు లౌకికంగా అనేక మంది శాస్త్రవేత్తలు సాంకేతిక నిపుణులు సభ్య సమాజం కూడా చవిచూస్తుంది. లౌకికపరమైన వ్యక్తులు, విద్య గడించినవారు, ఉపాధ్యాయులు, ప్రభుత్వాలు ఇలా రకరకాల వ్యక్తులు సంస్థలు శ్రీసభ ఆలోచనలతో ఏకీభవిస్తూ సాంకేతిక పరిజ్ఞానాన్ని మంచికి ఏ విధముగా వాడాలో ప్రతి ఒక్కరికి కూడా పిలుపునిస్తున్నారు. సమాజంలో సాంకేతికత నెలకొనడం అభివృద్ధికి మారుపేరు అయితే ఆ సాంకేతికతను సరియైన మార్గంలో అందరి వృద్ధికి వినియోగించడం అనేది నేటి సమాజానికి కత్తి మీద సాములాగా తయారయింది.

## 3. సాంకేతిక సమాజంలో విలువలు పూసే కలువలు

విలువలు కలిగిన సమాజం నైతికత ఊరే ఉపన్యాసాలలో ఉండదు కానీ ప్రతి ఒక్కరూ నిగ్రహమైన జీవితాన్ని అలవర్చుకున్నప్పుడు ఆగ్రహమైన జీవితాన్ని వదిలి వేసిన క్షణాన తన జీవన ఆలోచన సరళి మారి స్వార్థపరమైన వృద్ధికి కాకుండా కృత్రిమ మేధస్సు (AI) వినియోగం అందరి మేలుకై వాడేలా నిలుస్తారు. ఈ విధముగా చేయాలంటే మనిషికి దేవుని సాయం కావాలి అంతేకాకుండా మానవ వ్యక్తి యొక్క గౌరవం తాను చేసే వృత్తిలో దాగివున్న నైతికత ప్రాముఖ్యతను

నొక్కి చెప్పడం చాలా అవసరం. ఈ మార్గదర్శక సూత్రం కృత్రిమ మేధస్సు (AI) సంబంధించిన ప్రశ్నలకు కూడా వర్తిస్తుంది. కనుక ఇలా చేయడం ద్వారా నైతిక పరిమాణం ప్రాణం పోసుకుంటుంది. కారణం వ్యవస్థలను రూపొందించేది మరియు అవి ఏ ప్రయోజనాల కోసం ఉపయోగించబడతయో నిర్ణయించేది వ్యక్తులే. ఒక యంత్రం మనిషి మధ్య తరువాత వ్యక్తి మాత్రమే నైతిక ఏజెంట్. కాబట్టి మనిషి తన నిర్ణయంలో స్వేచ్ఛను వినియోగించి వాటి ద్వారా నెలకొనే నైతికతను అంగీకరించాలి. మంచితనంతో సంబంధం ఉన్న వ్యక్తి నైతిక మనస్సాక్షి ద్వారా మార్గ నిర్దేశం చేయబడి వ్యక్తులను ప్రేమించడానికి మరియు మంచిని చేయడానికి పూనుకుంటాడు. మనిషి అత్యున్నత స్థాయిని ప్రతిబింబిస్తూ సత్యానికి అధికారిగా సాక్ష్యం ఇస్తాడు. అదేవిధంగా ఒక యంత్రము మరియు మానవుడి మధ్య మానవుడు మాత్రమే మనస్సాక్షి యొక్క స్వరాన్ని వినటము మరియు అనుసరించుటము వివేకంతో వివేచన చేయటము ప్రతి పరిస్థితులు సాధ్యమయ్యే మంచిని కోరుకునే స్థాయికి తగినంత స్వీయ అవగాహన కలిగి ఉండగలడు. నిజానికి ఇదంతా ఒక వ్యక్తి తెలివితేటలకు సంబంధించిన విషయము. మానవ సృజనాత్మకత ద్వారా ఉత్పత్తి అయిన సాంకేతిక పరిజ్ఞానం మన సానుకూల లక్ష్యాల వైపు మళ్లించవచ్చు. మానవ గౌరవాన్ని గౌరవించే వ్యక్తులు మరియు సంఘాల శ్రేయస్సును ప్రోత్సహించే మార్గాల్లో ఈ మానవ జ్ఞానాన్ని సాంకేతికతను వినియోగించినప్పుడు అది మానవ వృత్తికి సానుకూలంగా దోహదపడుతుంది. అయినప్పటికిని మానవులు ప్రతిరంగంలో నిర్ణయాలు తీసుకోవటం జరుగుతుంది. మరి సాంఘిక విజ్ఞాన విషయంలో కూడా మంచి చెడ్డలనుంచి ఒక పరిణతి చెందిన స్వేచ్ఛ ద్వారా మంచిని చేయాలి అభివృద్ధిని పొందాలి అన్న నిర్ణయము తీసుకోవటము చాలా అవసరము. ఈ సాంకేతిక పరిజ్ఞానము ఎంతవరకు మనకు ఉపకరిస్తుంది నైతికతను నిలబెడుతుంది అన్న విషయాలను మనం పరిగణలోనికి తీసుకోవాలి. అదేవిధంగా నైతికత లక్షణాలు మాత్రమే కాదు దానిని సాధించడానికి మార్గాలను కూడా మనం చూడాలి. అనగా ఒక వ్యక్తి యొక్క దృష్టి మరియు అవగాహనను కూడా పరిగణలోనికి తీసుకున్నప్పుడు సాంకేతికత ద్వారా నైతికపరమైన వృద్ధి మనము చూడవచ్చు. సాంకేతిక ఉత్పత్తులు వాటిని వ్యాపింపజేసే యజమానులు, వినియోగదారులు, నియంత్రణదారుడు ప్రపంచ దృష్టి కోణాన్ని

ప్రతిబింబిస్తాయి మరియు ప్రపంచాన్ని శాసించే శక్తిని కలిగి ఉంటాయి. సామాజిక స్థాయిలో కొన్ని సాంకేతిక పరిణామాలు మానవ వ్యక్తి యొక్క అవగాహనకు విరుద్ధంగా ఉన్న సంబంధాలు శక్తిని మానవ గమనాన్ని కూడా బలోపేతం చేస్తాయి. కాబట్టి ఏఐ ఇచ్చినా లేదా దాని సారాంశము ఉపయోగించే విధానము మరియు సాధనాలు అన్నీ కూడా మానవ గౌరవాన్ని దృష్టిలో ఉంచుకొని సరియైన మంచిని ప్రోత్సహించేలా ఉండాలని కృత్రిమ మేధస్సు ముఖ్య ఉద్దేశమై ఉండాలి.

## 4. ఫ్రాన్సిస్ జగద్గురువుల ఆలోచనలు కృత్రిమ మేధస్సు నైతికత

ప్రతి పురుషుడు మరియు ప్రతి స్త్రీ తమ అంతర్లీన గౌరవంతో జ్ఞానముతో బహుగా విస్తరిస్తున్న లేదా ఉద్భవిస్తున్న సాంకేతిక పరిజ్ఞానమును అంచనా వేయటంలో కీలకమైన పాత్ర పోషించాలి. ఏ విధంగా మానవగౌరవాన్ని కాపాడటంలో మరియు మానవ జీవితంలోనే ప్రతి మెట్టులో కృత్రిమ మేధస్సు అనువదించుకుంటూ నైతికంగా మంచిదని నిరూపించబడతాయి అంటే మానవ జీవితము కృత్రిమమేధస్సును వినియోగించడంలో తమ ఔన్నత్యాన్ని కోల్పోకుండా సరైన నైతికత జీవన విధానం అలవడేటట్లు చూసుకోవాలి. సామాజిక ఆర్థిక రంగాలలో మానవ మేధస్సు సాంకేతికతను అభివృద్ధిచేయటంలో మరియు ఉత్పత్తి చేయడంలో మాత్రమే కాకుండా మానవ వ్యక్తి యొక్క నిజమైన వృద్ధికి అనుగుణంగా కృత్రిమ జ్ఞానాన్ని వినియోగంలో ఉండేటట్లు చేయాలి. ఎందుకంటే సాంకేతికత సామాజిక మరియు ఆర్థిక రంగాలలో దాని అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుంది. కనుక దీనిని తెలివిగా నిర్వహించే బాధ్యత సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరి భుజస్కందాలపై ఆధారపడి ఉంది. ఇంత గొప్ప బాధ్యతను నెరవేర్చటానికి కతోలిక బోధన మరియు ఇతర నైతిక సూత్రాలు మనకు సహాయపడతాయి. మానవ స్వేచ్ఛ మరియు నిర్ణయాలు కూడా ఈ బాధ్యతను నెరవేర్చటంలో ఎంతగానో సహాయపడతాయి. కృత్రిమ మేధస్సు (AI) వినియోగంలో మానవ సంపూర్ణ స్వేచ్ఛ తీసుకునే ఆలోచన సరళి విధానము ప్రతి మానవుడు కూడా అత్యున్నత విలువను కలిగి ఉన్నాడు. కారణం దేవుని పోలికలో మనమందరము ఉన్నాము కాబట్టి. ప్రతి మానవుని యొక్క గౌరవం మరియు మానవ వృత్తి పట్ల కృత్తిమ మేదస్సు ఎప్పుడు కూడా మద్దతు ఇస్తుంది మరియు ప్రోత్సహిస్తుంది అనే

సత్యాన్ని కృత్రిమ మేధస్సు యొక్క డెవలపర్లు యజమానులు ఆపరేటర్లు వినియోగదారులు ఈ విధంగా అందరికీ కూడా ఒక వివేచన యొక్క సూత్రంగా పనిచేస్తుంది. దీని ఉపయోగం ప్రతి స్థాయిలో చెల్లుబడి అవుతుంది అంటే కృత్రిమ మేధస్సు మనుగడ మానవ సమాజంలో అందరికీ కూడా ఒక మానవ సంపూర్ణతకు అభివృద్ధికి సూచికగా నిలుస్తుంది. మనిషి తన జీవిత మలుపులలో, అలుపెరగక కృత్రిమ మేధస్సును వినియోగించుకునే ఆలోచన నైతికమైనదిగా ఉండాలి. ఇటువంటి మార్గదర్శక విలువలు కృత్రిమ మేధస్సు (AI)కు సంబంధించిన సూత్రాలలో నిమగ్నమై ఉంది. నైతిక బాధ్యతకు ప్రాముఖ్యత ఇచ్చినప్పుడు కృత్తిమమేధస్సును వినియోగించడంలో నైతికత చోటు చేసుకుంటుంది అంటే కృత్రిమ మేధస్సును సృష్టించడంలో ప్రముఖ పాత్ర వహించిన వారు ముఖ్యముగా దాని గురించి పూర్తిగా అవగాహన ఉన్నవారు, నేర్చుకునేవారు, ప్రోగ్రామింగ్ చేయగల సామర్థ్యం ఉన్నవారు, అందులో ఎదురయ్యే సమస్యలను సరిదిద్దేవారు వారందరినీ గుర్తించి కృత్రిమ మేధస్సు నైతికపరమైనదిగా వాడుకునే వీలుగా ఉండేటట్లు చేయాలి. దిగువ పేర్కొన్న విధానాలన్నీ కూడా లోతైన నెట్వర్క్లు ఏఐ ప్లస్ సంక్లిష్ట సమస్యలను పరిష్కరించడానికి వీలు కలిగి ఉన్నా అవి సృష్టించిన సమస్యలకు పరిష్కారాన్ని కనుగొనుటలో చాలా కష్టం ఉంటుంది. ఇది జవాబుదారీతనాన్ని క్లిష్టతరం చేస్తుంది కారణం కృత్రిమ మేధస్సు (AI) అప్లికేషన్ ఒకవేళ అవాంఛనీయమైన ఫలితాలను ఉత్పత్తి చేస్తే దానికి ఎవరు బాధ్యత వహిస్తారు అని నిర్ణయించడం లేదా తెలుసుకోవటం చాలా కష్టం. కనుక కృత్రిమ మేధస్సులో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేటప్పుడు సంక్లిష్టమైన అత్యంత ఆటోమేటిక్ సెట్టింగ్లలో జవాబుదారీతనం ప్రక్రియలకు శ్రద్ధ ఇవ్వాలి. అలా చేసినప్పుడు ఫలితాలు మధ్యస్థం నుండి దీర్ఘకాలికంగా మాత్రమే స్పష్టంగా కనిపిస్తాయి. దీనికోసం మరల కృత్రిమ మేధస్సు (AI)ని ఉపయోగించి తీసుకునే నిర్ణయాలకు అంతిమ బాధ్యత మానవ నిర్ణయాధికారులపై ఉంటుంది. అంతేకాకుండా నిర్ణయం తీసుకునే ప్రక్రియలో ప్రతి దశలో కూడా కృత్రిమ మేధస్సు (AI)ని ఉపయోగించడం కోసం జవాబుదారీతనం ఉండటం ఎంతో శ్రేష్టకరం. కృత్రిమ మేధస్సు వినియోగంలో నైతికతకు ఎవరు బాధ్యత వహిస్తారు అని నిర్ణయించడంతోపాటు కృత్రిమ మేధస్సు (AI) వ్యవస్థలకు ఇవ్వబడిన

లక్ష్యాలను గుర్తించటం చాలా అవసరం. ఎందుకంటే కొన్నిసార్లు ఈ వ్యవస్థలన్నీ కూడా పర్యవేక్షణ లేని అభ్యాస విధానాలను ఉపయోగించవచ్చు మరికొన్నిసార్లు మానవులు పరిష్కరించలేని మార్గాలను అనుసరించవచ్చు. ఏది ఏమైనా

కృత్రిమ మేధస్సు (AI) వ్యవస్థలన్నీ కూడా ప్రోగ్రామర్లు స్థాపించిన విధానంనే అనుసరిస్తాయి. అయినప్పటికిని కూడా కృత్రిమ మేధస్సు (AI) నమూనాలు స్వతంత్రంగా నేర్చుకునే సామర్థ్యాన్ని పెంచుకునేటప్పుడు మానవులకు ఒక సవాలు విసురుతుంది. అటువంటి సవాలను ఎదుర్కోవటానికి కృత్తిమమేధస్సు ప్రయోజనాలు ఎంతవరకు ఉపయోగపడతాయి అని నిర్ధారించుకోవటానికి వాటిపై నియంత్రణను కొనసాగించే సామర్థ్యం ఒకరకంగా తగ్గిపోతుంది. ఇటువంటి ధోరణి ద్వారా కృత్రిమ మేధస్సు (AI) వ్యవస్థలు ప్రజలకు వ్యతిరేకంగా పనిచేయకుండా వారి మంచి కోసము క్రమబద్ధీకరించబడిందని ఎలా నిర్ధారించుకోవాలని ప్రశ్నలు లేవనెత్తుతాయి. అంటే సృష్టింపబడిన కృత్తిమమేధస్సు లేదా ఆధునిక యంత్రాలు మానవ మంచి కోసమే పనిచేస్తున్నాయని వాటిని ఆ విధంగా ఉండేటట్లు చేశారని ఎలా మనకు తెలుస్తుంది అనే ప్రశ్నలు వస్తూ ఉంటాయి. కృత్రిమ మేధస్సు (AI) వ్యవస్థలను అభివృద్ధి చేసిన వ్యక్తుల నుండి నైతికత ఆధారపడి ఉండగా వాటిని ఉపయోగించే వారితో కూడా ఈ నైతికత పంచుకోబడుతుంది. అంటే కేవలము కృత్రిమ మేధస్సును పరిచయం చేసిన వారికే నైతికత పరిమితం కాదు కానీ ఆ కృతిమమేధస్సును వినియోగించే ప్రతి వ్యక్తి పైన ఈ నైతికత ఆధారపడిఉంది. అంటే ప్రతి ఒక్కరు కూడా కృత్రిమ మేధస్సు (AI) జ్ఞానాన్ని సరైన విధంగా వినియోగించాలి. ఫ్రాన్సిస్ జగద్గురువులు గుర్తించినట్లుగా ఒక యంత్రము బాగా నిర్వహించబడిన ప్రమాణాల ఆధారంగా సూత్రాల ఆధీనంలో ఉన్నట్లయితే అది అనేక రంగాలలో అభివృద్ధిని అందిస్తుంది. అయితే మానవులు ఆ యాంత్రిక జ్ఞానాన్ని హత్తుకొని దానికి సరియైన విధంగా ఉండాలి. మానవులు వారి హృదయాలలో ఈ యంత్రముదాని ద్వారా వచ్చే వినియోగము అభివృద్ధిని మాత్రమే చూడకుండా నైతిక విషయాల పట్ల నిర్ణయం తీసుకునే సామర్థ్యం కలిగి ఉండాలి. ఒక పనిని సాధించడానికి కృత్రిమ మేధస్సును ఉపయోగించేవారు దాని సూత్రాలను పాటించాలి. బాధ్యత కలిగి ఆ యంత్రంలో ఉన్న శక్తికి వీరందరూ అంతిమ బాధ్యతను వహించాలి. కృత్రిమ మేధస్సు

మానవులకు సహాయం చేయగలదు. కాబట్టి దాని నియంత్రించే విధానము అనుసరించే సూత్రాలు అసమానతులను తొలగించడానికి ఎన్నుకున్న మార్గాలు నమ్మదగినవిగా తగినంత బలంగా ఉండాలి. అంతేకాకుండా పక్షపాతాలు అనాలోచిత ప్రభావాలను తగ్గించడానికి మానవులు అనుసరించే ఆపరేషన్‌లో పారదర్శకంగా ఉండాలి. కృత్రిమ మేధస్సులో బాధ్యత, పారదర్శకత చట్టపరమైన నియంత్రణ చట్టాలు దాని ఉపయోగ పరిణామాలకు చట్టపరమైన జవాబుదారితనం సంస్థలలో ఉండేలాగున చూసుకోవాలి. గోప్యత మరియు జవాబుదారితనం రక్షణ ఇవన్నీ కూడా సాంకేతిక విజ్ఞానం వినియోగించే వారిపై వారు తీసుకునే నిర్ణయాలపై ఎక్కువగా ఆధారపడకుండా చేయాలి . అంటే గోప్యత ఉంది కాబట్టి దానిని ఎవరూ చూడరు కాబట్టి ఎలాగ పడితే అలగాచేయొచ్చు అన్నటువంటి ధోరణి వినియోగించే వారిలో ఉండకూడదు. ఇటువంటి ధోరణి నేటి సమకాలీన సమాజం సాంకేతికతపై ఎక్కువగా ఆధారపడటాన్ని పెంచుతుంది. కతోలిక శ్రీసభ నైతిక మరియు సామాజిక స్పృహను మానవులను కాపాడే విధంగా ఏ విధంగా సాంకేతిక జ్ఞానాన్ని వినియోగించాలో దానికి కావలసిన వనరులను, సలహాలను దైవ జ్ఞానంతో కూడిన జాబితాను అందిస్తుంది. ఉదాహరణకు న్యాయం గురించిన సామాజిక స్థితులను పెంపొందించడం అంతర్జాతీయ భద్రతను కాపాడటం మరియు శాంతిని ప్రోత్సహించటం జరుగుతుంది. అంతర్జాలాన్ని, సాంకేతిక జ్ఞానాన్ని వినియోగించడం ద్వారా వ్యక్తులు మరియు సంఘాలు మానవ గౌరవాన్ని దిగజార్చే లేదా పర్యావరణానికి హాని కలిగించే మార్గాలను నివారించేటప్పుడు మానవాళికి ప్రయోజనం చేకూర్చటానికి కృత్రిమ మేధస్సు (AI) ఏ విధంగా ఉపయోగపడుతుందో గుర్తించాలి. ఈ సందర్భంలో ఒకరి పట్ల మరొకరు బాధ్యత కలిగి ఇరుగుపొరుగువారు సంరక్షణకు వారి అభివృద్ధికి ప్రోత్సహించే వారిలాగా ప్రతి ఒక్కరూ మెలగాలి. అంటే సాంకేతిక వినియోగంలో బాధ్యత అనేది పరిమితస్థాయిలో మాత్రమే అర్థం చేసుకోకుండా ఇతరులను గురించి బాధ్యత తీసుకున్నప్పుడు అది కృత్రిమ మేధస్సు (AI) సాధించే ఫలితాలు కన్నా ఎక్కువ ఫలితాలను ఇస్తుందని అర్థం చేసుకోవాలి. ఏ సాంకేతికత పరిజ్ఞానమైన మానవాళి శ్రేయస్సు కోసం వారి అభివృద్ధి కోసం బాధ్యతాయుతమైన విధానములో భాగం కావచ్చు. అయితే కృత్రిమ మేధస్సు (AI) మానవ మేధస్సులో వారి ఆలోచనలకు

తగినట్టుగా ఉండాలి వారిలో మిళితమై ఉండాలి. ఈ యంత్రాల సహాయము తీసుకోవటము మానవ గౌరవాన్ని కృత్రిమ మేధస్సు గౌరవించేలా నిర్ధారించుకోవాలి.

## 5. కతోలిక శ్రీసభ బోధన - సామాజిక న్యాయం మానవ శ్రేయస్సు

ఈ ఉన్నతమైన గౌరవాన్ని గుర్తిస్తూ రెండవ వాటికన్ మహాసభ సామాజిక క్రమము మరియు దాని అభివృద్ధి ఎల్లప్పుడూ మానవ వ్యక్తి యొక్క ప్రయోజనం కోసం పనిచేయాలని ధ్రువీకరించింది. జగద్గురువులు ఫ్రాన్సిస్ గారు చెప్పినట్లుగా కృత్రిమ మేధస్సు (AI) యొక్క ఉపయోగం ప్రేరణతో నిండిన దృష్టితో స్వేచ్ఛ బాధ్యత మరియు సోదరభావం యొక్క నీతితో ఇతరులతో అదే విధంగా సృష్టికి సంబంధించిన అభివృద్ధిని ప్రజల యొక్క వృద్ధుని పెంపొందించగల సామర్థ్యం కలిగి ఉండాలి. జగద్గురువు ఫ్రాన్సిస్ గారు వారి దృక్పథంతో ప్రతిపాదించిన హృదయజ్ఞానం దేనికి అనుగుణంగా ఆచరణాత్మక పరిస్థితులలో నైతిక దోరణాన్ని అందించడంలో సాంకేతికత పట్ల ఏవిధంగా స్వార్ధ బుద్ధిని విడనాడి అత్యున్నత స్థాయికి మానవ గౌరవాన్ని నిలబెట్టే స్థాయిలో నైతికతను పాటించు సమాజంలో సమకాలీన విధానంలో అభివృద్ధిని కోరుకుంటూ సృష్టిలో ఎవరు కూడా ఎటువంటి మభ్యపెట్టె విధానాలకు లోనుకాకుండా సాంకేతిక వినియోగం వాతావరణ పరిస్థితులను కూలగొట్టకుండా అందరికీ అన్నివిధాలుగా ఈ సాంకేతికత ఉపయోగపడేలా ఉండాలని పిలుపునిచ్చారు.

## ముగింపు


సాంకేతికత పరిజ్ఞాన వినియోగంలో నైతిక విలువల పాత్ర మరియు నిర్ణయాల పాత్రను విశ్లేషిస్తూ దానికి అనుగుణంగా కృత్రిమ మేధస్సు ఏ విధంగా మానవాళికి ఉపయోగకరంగా ఉంటుందో ఇందులో వెల్లడిస్తూ నైతిక విలువలకు ప్రాముఖ్యతనిస్తూ అభివృద్ధి అంటే కేవలం కృత్రిమ మేధస్సును వినియోగించడంలోనే కాదు దానిని బాధ్యతాయుతంగా పూర్తి స్వేచ్ఛతో అవగాహనతో సమగ్రతను కాపాడుతూ సమాజంలో విలువలనుపెంచుతూ జవాబుదారితనంగా ఉండాలని ఈ లేఖ మనకు నేర్పిస్తుంది. కాబట్టి నేటి సమాజంలో మనమందరము కూడా ఈ సాంకేతికతను దాని పరిజ్ఞానాన్ని

వినియోగించే విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకునేలా ప్రయత్నం చేద్దాం. తద్వారా ఒక కతోలిక విశ్వాసిగా, విశ్వాసురాలుగా మనలో వచ్చిన నైతికబాధ్యత కృత్రిమ మేధస్సును వినియోగించే విధానంలో కొంతమేర అదుపును ఉంచుకోవడంలో మన గుర్తింపు ఉంటుంది. కాబట్టి శ్రీసభ అందించే సత్యాలను అర్థం చేసుకుంటూ అందులో గుప్తమై ఉన్న దైవ జ్ఞానాన్ని పొందుకుంటూ కృత్రిమ మేధస్సు పట్ల మన అవగాహనను పెంచుకుంటూ దానిని ఎంత రీతిలో వాడాలో ఆవిధంగా చూసుకుంటూ సంఘాలలో విశ్వాసులలో క్రీస్తును గురించిన సువార్తను వెదజల్లడంలో ఈ సాంకేతికతను అనుసంధానం చేస్తూ దేవునికి మహిమగా మానవునికి గౌరవంగా ఉండే విధానంలో ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుదాం. ఈ ప్రయాణంలో దేవదేవుడు మన అజ్ఞానాన్ని తొలగించి తన జ్ఞానాన్ని ఇచ్చి కృత్రిమ మేధస్సును ఏ విధంగా వినియోగించాలో ప్రేరణనిస్తూ ఆత్మదేవుని సహాయము మనకు ఎల్లప్పుడూ ఉండాలని ప్రయాసపడదాం.

❋ ❋ ❋ ❋

# 6. కృత్రిమ మేధస్సు మరియు సమాజం

– డీకన్ కారసాల విజయబాబు



## పరిచయం

కాలచక్రం తిరుగుతోంది. ఒకప్పుడు మనిషి తన చేతులతో మట్టిని తాకి భవిష్యత్తును నిర్మించాడు. ఇప్పుడు అతడు తన చేతిని చరవాణిపై ఉంచి భవిష్యత్తును ఆజ్ఞాపిస్తున్నాడు. నిప్పు కనుగొన్న రోజున మనిషి భయపడ్డాడు, చక్రం తిరిగిన రోజున మనిషి ఆశ్చర్యపడ్డాడు, యంత్రం పుట్టిన రోజున మనిషి శక్తిని అనుభవించాడు. ఇప్పుడు కృత్రిమ మేధస్సు ఎదుట మనిషి తన ఆత్మను ప్రశ్నించుకుంటున్నాడు.

ఇది కేవలం సాంకేతిక మార్పు కాదు. ఇది సమాజ నిర్మాణాన్ని, అధికార సమీకరణాన్ని, పేద–ధనిక అంతరాన్ని, మనిషి విలువను తిరిగి నిర్వచించే ఘట్టం. ఈ సందర్భంలో సంఘం మౌనంగా ఉండలేదు. ఎందుకంటే శ్రీసభ ఎప్పుడూ మనిషి గౌరవానికి కాపలాదారిగా నిలిచింది. అందుకే కృత్రిమ మేధస్సు మరియు సమాజం మధ్య సంబంధాన్ని నైతిక దీపంతో పరిశీలించడం అత్యవసరం.

## కృత్రిమ మేధస్సు: సమాజాన్ని తాకుతున్న శక్తి

కాలం పరుగులు తీస్తోంది. ఒకప్పుడు మనిషి నక్షత్రాలను లెక్కపెట్టాడు, ఇప్పుడు వాటి మధ్య ప్రయాణాన్ని లెక్కపెడుతున్నాడు. ఒకప్పుడు చెట్టు నీడలో కూర్చుని ఆలోచించాడు. ఇప్పుడు చరవాణి వెలుగులో భవిష్యత్తును నిర్ణయిస్తున్నాడు.

ఇనుము మనిషికి బలం ఇచ్చింది. విద్యుత్ అతనికి వేగం ఇచ్చింది. ఇప్పుడు కృత్రిమ మేధస్సు అతనికి నిర్ణయ శక్తిని ఇచ్చే దశకు వచ్చింది. కానీ ప్రశ్న ఇదే: నిర్ణయం తీసుకునేది ఎవరు? యంత్రమా? లేదా మనస్సాక్షితో కూడిన మనిషినా?

ఈ ప్రశ్న కేవలం సాంకేతికది కాదు. ఇది సమాజ నిర్మాణానికి సంబంధించినది, న్యాయానికి సంబంధించినది, పేద–ధనిక మధ్య ఉన్న దూరానికి సంబంధించినది. అందుకే శ్రీసభ ఈ మార్పును ఆశ్చర్యంతో మాత్రమే కాదు, ఆత్మపరిశీలనతో చూస్తోంది. కృత్రిమ మేధస్సు మనకు సేవకుడిగా ఉండాలి. మనిషికి యజమానిగా కాదు.

కృత్రిమ మేధస్సు అనేది మనిషి మేదస్సును అనుకరించేలా రూపొందించిన సాధనం. అది సమాచారాన్ని విశ్లేషిస్తుంది, నిర్ణయాలను సూచిస్తుంది, మనిషి కంటే వేగంగా పనిచేస్తుంది. నేటి సమాజంలో కృత్రిమ మేదస్సు లేని రంగం లేదు. వ్యవసాయం, వైద్యం, విద్య, రవాణా, బ్యాంకింగ్, ప్రభుత్వ పరిపాలన – ప్రతిచోట కృత్రిమ మేదస్సు ప్రవేసించింది. ఒక రైతు వాతావరణ యాప్ పై ఆధారపడి పంట వేయాలా వద్దా అని నిర్ణయించుకుంటున్నాడు. ఇది అతనికి సహాయం. కానీ అదే యాప్ పెద్ద కంపెనీల ప్రయోజనాల కోసం డేటాను మలిస్తే? అప్పుడు రైతు స్వేచ్ఛ అల్గోరిథం చేతుల్లోకి వెళ్తుంది.

The real risk with AI is not malice, but competence without values. మానవ మౌళిక సంబంధాలకు విలువను ఇవ్వకపోవడమే కృత్రిమ మేధస్సు యొక్క లోపం. వేగంగా పనిచేసే యంత్రం తప్పు దిశలో నడిస్తే, దాని ప్రభావం లక్షల మందిపై పడుతుంది. అందుకే కృత్రిమ మేధస్సు సామర్థ్యాన్ని మాత్రమే కాదు, దాని వెనుక ఉన్న విలువలను కూడా సమాజం పరిశీలించాలి.

## కృత్రిమ మేధస్సు మరియు సామాజిక అసమానతలు

కృత్రిమ మేధస్సు సమాజంలోని అసమానతలను తగ్గించే సాధనంగా మారవచ్చు, లేదా అవే అసమానతలను మరింత లోతుగా ముద్రించవచ్చు. నగరాల్లో ఉన్న పెద్ద ఆసుపత్రుల్లో కృత్రిమ మేదస్సు ఆధారిత స్కాన్లు క్యాన్సర్ను తొలిదశలోనే గుర్తించి జీవితాలను కాపాడుతున్నాయి. అదే సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో కనీస వైద్య సదుపాయాలు లేక ప్రజలు బాధపడుతున్నారు. ఇక్కడ సమస్య కృత్రిమ మేధస్సు సామర్థ్యం కాదు; ఆ సామర్థ్యం ఎవరికీ అందుబాటులో ఉంది అన్నదే అసలైన ప్రశ్న. World Wide Web సృష్టికర్త టిమ్ బెర్నర్స్ – లీ చెప్పినట్టు, సాంకేతికత అతి బలహీనులను శక్తివంతం చేయాలి, మరింత వెనక్కి నెట్టకూడదు. కృత్రిమ మేధస్సు కొద్ది మంది చేతుల్లో కేంద్రీకృతమైతే,

అది డిజిటల్ పేదరికాన్ని సృష్టిస్తుంది. సంఘం దృష్టిలో ఇది తీవ్రమైన నైతిక లోపం, ఎందుకంటే నిజమైన పురోగతి అందరికీ మేలు చేయాలి.

## అధికార కేంద్రీకరణ మరియు ప్రజాస్వామ్యానికి సవాలు

కృత్రిమ మేధస్సు ఆధారిత వ్యవస్థలు మన అభిరుచులను గమనించి, మనకు నచ్చే వార్తలనే చూపిస్తాయి. ఈ ప్రక్రియ మెల్లగా మన ఆలోచనలను పరిమితం చేస్తుంది. ఎన్నికల సమయంలో, సామాజిక మాధ్యమాల్లో కనిపించే సమాచారం కూడా అల్గోరిథంల ద్వారా నియంత్రించబడుతుంది. ఇది ప్రజాస్వామ్యానికి పెద్ద సవాలు, ఎందుకంటే స్వేచ్ఛాయుత ఆలోచనకు అవసరమైన విభిన్న స్వరాలు మౌనమవుతాయి. శాస్త్రవేత్త కాథీ ఓ'నీల్స్ అన్నట్టుగా, అల్గోరిథంలు తటస్థమైనవి కావు; అవి కోడ్లో నిక్షప్తమైన అభిప్రాయాలు, అందుకే కృత్రిమ మేధస్సు తీసుకునే ప్రతి నిర్ణయానికి మానవ బాధ్యత తప్పనిసరి. యంత్రం నిర్ణయాన్ని తీసుకోవచ్చు, కానీ దాని నైతిక ఫలితాలకు సమాజమే బాధ్యత వహించాలి.

## సాంకేతికమైన నమునా (Technocratic Paradigm) మానసికతపై సంఘ హెచ్చరిక

"సాంకేతికమైన సమునా" అనేది సాంకేతికత మరియు శాస్త్రీయ పరిజ్ఞానం (expertise) ద్వారా సమాజంలోని సమస్యలను పరిష్కరించవచ్చనే లేదా సమాజాన్ని మెరుగుపరచవచ్చనే ఆలోచనా విధానాన్ని సూచిస్తుంది. ఈ నమునాలో, నిర్ణయాలు రాజకీయ నాయకుల కంటే సాంకేతిక నిపుణులు, శాస్త్రవేత్తలు మరియు ఇంజనీర్ల వంటి నిపుణులచే తీసుకోబడతాయి, ఎందుకంటే వారికి నిర్దిష్ట రంగాలలో లోతైన జ్ఞానం ఉంటుంది.

ఫ్రాన్సిస్ పాపుగారు తరచుగా హెచ్చరించే అంశం "సాంకేతికమైన నమునా". Technocratic Paradigm ఇందులో సామర్థ్యమే మేలుగా, వేగమే సత్యంగా, లాభమే విలువగా మారుతుంది. ఈ దృష్టికోణంలో మనిషి ఒక సాధనంగా, వినియోగ వస్తువుగా మారిపోతాడు. సంఘం దీనిని గట్టిగా తిరస్కరిస్తుంది, ఎందుకంటే మనిషి ఎప్పుడూ లక్ష్యంగా చూడబడాలి, సాధనంగా కాదు. పరిశుద్ధ ఫ్రాన్సిస్ జగద్గురువులు పలికినట్టు, కృత్రిమ మేధస్సు ఎంత సమర్థంగా పనిచేసినా, అది మనిషి జీవితం యొక్క అర్థాన్ని నిర్ణయించలేదు.

సత్యం, మంచితనం, న్యాయం వంటి విలువలు అల్గోరిథంల నుండి పుట్టవు; అవి మనస్సాక్షి నుండి పుడతాయి. అందుకే సంఘం సాంకేతిక పురోగతిని నైతిక పునాది మీద నిలబెట్టాలని పిలుస్తుంది.

## శ్రీసభ బోధనలలో కృత్రిమ మేధస్సు

పరిశుద్ధ ఫ్రాన్సిస్ జగద్గురువులు చెప్పినట్టు కృత్రిమ మేధస్సు మన చేతుల్లో ఉన్న అగ్ని లాంటిది. అది చలిని తొలగించగలదు, లేదా ఇల్లు కాల్చగలదు. ఏ దిశలో దాన్ని ఉపయోగించాలో నిర్ణయించేది మన మనస్సాక్షి. యంత్రాలు వేగంగా ఆలోచించగలవు, కానీ సమాజాన్ని నిలబెట్టేది మనిషి హృదయం మాత్రమే. కాబట్టి శ్రీసభ స్పష్టంగా చెబుతోంది: సాంకేతికత మనిషికి సేవ చేయాలి, మనిషి సాంకేతికతకు కాదు. మనిషి గౌరవం కేంద్రంగా ఉన్న అభివృద్ధే నిజమైన పురోగతి. ఇదే సాంకేతిక యుగంలో సమాజానికి శ్రీసభ ఇచ్చే స్పష్టమైన పిలుపు.

## కృత్రిమ మేదస్సు మరియు మానవ సంబంధాలు

మనిషి సంబంధాల వల్ల పుట్టాడు, సంబంధాల మధ్య పెరిగాడు, సంబంధాల ద్వారానే తన అర్థాన్ని కనుగొంటాడు. తల్లి ఒడిలో మొదలైన జీవితం, స్నేహితుడి భుజంపై నిలబడుతుంది, చివరికి ఎవరో ఒకరి చేతిని పట్టుకుని ముగుస్తుంది. ఒక చూపు, ఒక మాట, ఒక మౌనం ఇవే మనిషిని మనిషిగా నిలబెట్టే మౌళిక భాషలు. కానీ నేటి కాలంలో ఈ భాష నెమ్మదిగా మారుతోంది. మనం ఉదయం లేచినప్పుడు మనిషిని చూడకముందే చరవాణి చూస్తున్నాం. మన హృదయ నిర్ణయాన్ని వినకముందే యంత్రాన్ని సంప్రదిస్తున్నాం.

కృత్రిమ మేధస్సు ఈ సంబంధాల మధ్య ప్రవేశించింది. అది మాట్లాడుతున్నట్టు అనిపిస్తుంది. వింటున్నట్టు అనిపిస్తుంది, అర్థం చేసుకున్నట్టు అనిపిస్తుంది. కానీ ఈ అనిపించడమే అసలైన ప్రశ్న. ఇది నిజమైన సంబంధమా? లేక సంబంధాల ప్రతిరూపమా? శ్రీసభ ఈ ప్రశ్నను చాలా గంభీరంగా తీసుకుంటుంది, ఎందుకంటే మానవ సంబందాలే విశ్వాస జీవన సోపానాలు.

బైబిల్ స్పష్టంగా చెబుతుంది: “మనిషి ఒంటరిగా ఉండటం మంచిది కాదు.” ఈ ఒంటరి తనాన్ని వేరొక మనిషి తీర్చగలరు. ఈ మాట ఈ సాంకేతిక యుగంలో మరింత ప్రాముఖ్యతను సంతరించుకుంది. మనిషి సంబంధాల ద్వారానే సంపూర్ణుడవుతాడు. దేవుడు కూడా మనిషిని ఒంటరిగా రక్షించలేదు;

ఒక సమాజంగా, ఒక సంఘంగా పిలిచాడు. రెండవ వాటికన్ మహాసభ చెప్పినట్టుగా, మనిషి నిజంగా తనను తాను కనుగొనేది స్వయంగా తనను అర్పించుకున్నప్పుడు. ఈ అర్పణ యంత్రానికి సాధ్యం కాదు. అందుకే మానవ సంబంధాల కేంద్రంలో ఎప్పుడూ మనిషి ఉండాలి.

**ముగింపు**

కృత్రిమ మేధస్సు యుగం మన తలుపు తట్టలేదు: మన ఇంట్లోకి నిశ్శబ్దంగా ప్రవేశించింది. అది మన చేతుల్లో పనిని తేలిక చేసింది, మన మెదళ్లకు వేగం ఇచ్చింది. కానీ అదే సమయంలో మన హృదయాలను ప్రశ్నిస్తుంది. మనిషి ఎక్కడ నిలబడ్డాడు? సమాజంలో కృత్రిమ మేధస్సు ఒక శక్తివంతమైన సాధనంగా ఎదిగింది. అది న్యాయానికి తోడ్పడగలదు, లేదా అన్యాయాన్ని యంత్రబద్ధం చేయగలదు. అది పేదవాడిని పైకి లేపగలదు, లేదా అతన్ని కనిపించని సంఖ్యగా మార్చగలదు. అందుకే సంఘం స్పష్టంగా చెబుతోంది: సాంకేతిక పురోగతి విలువలేని పురోగతి అయితే, అది పురోగతే కాదు అది ముప్పు. మనిషి గౌరవం, సామాన్య మేలు, ఐక్యత ఇవే కృత్రిమ మేధస్సు కి హద్దులు గీయాల్సిన అక్షరాలు.

**ఫ్రాన్సిస్ పాపుగారు మనకు గుర్తు చేస్తున్న గొప్ప సత్యం ఇదే:** సాంకేతికత మనిషికి సేవ చేయాలి. మనిషి సాంకేతికతకు కాదు. కృత్రిమ మేధస్సు మన నిర్ణయాలకు సహాయకుడిగా ఉండాలి, కానీ మన మనస్సాక్షి ప్రత్యామ్నాయం కాదు. మన భవిష్యత్తు అల్గోరిథంల చేతిలో కాదు, బాధ్యతగల మనుషుల చేతిలో ఉండాలి.

అందుకే ఈ యుగంలో శ్రీసభ చేసే పిలుపు స్పష్టం, ధైర్యవంతం, ప్రవచనాత్మకం. మనిషిని కేంద్రంగా పెట్టే అభివృద్ధి కావాలి. సంబంధాలను రక్షించే సాంకేతికత కావాలి. హృదయాన్ని మరిచిపోయే తెలివి కాదు, హృదయాన్ని వెలిగించే జ్ఞానం కావాలి.

**చివరికి ఒక సత్యం నిలుస్తుంది:** యంత్రాలు ప్రపంచాన్ని మార్చగలవు. కాని ప్రపంచాన్ని సంరక్షించేది మనిషి మాత్రమే. కృత్రిమ మేధస్సు మన కాలపు సాధనం కావచ్చు, కానీ ప్రేమ, న్యాయం, కరుణ ఇవే మానవ చరిత్రను ముందుకు నడిపించే నిజమైన మేధస్సు మార్గం. ఇదే శ్రీసభ స్వరం. ఇదే మన భవిష్యత్తుకు దారి చూపే వెలుగు.

# 7. కృత్రిమ మేధస్సు, ఆర్థిక వ్యవస్థ మరియు పని

– డీకను మైలాబత్తుల ఆధిత్య



## పరిచయం

"సైన్స్ మనకు శక్తిని ఇస్తుంది, కానీ ఆ శక్తిని ఏ దిశలో ఉపయోగించాలో నిర్ణయించేది మన నైతిక బుద్ధి" అని ఆల్బర్ట్ ఐన్స్టీన్ చేసిన హెచ్చరిక నేటి కాలంలో మరింత ప్రాముఖ్యతను సంతరించుకుంది. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న కొద్దీ, మానవుడు ప్రకృతిపై, సమాజంపై, తాను సృష్టించిన వ్యవస్థలపై అపూర్వమైన నియంత్రణను పొందుతున్నాడు. అయితే ఈ నియంత్రణ మానవ గౌరవానికి సేవ చేస్తున్నదా? లేక మానవుణ్ని అదే వ్యవస్థల బానిసగా మార్చుతోందా? అన్న ప్రశ్నలు మన ముందుకు వస్తున్నాయి.

21వ శతాబ్దంలో కృత్రిమ మేధస్సు *(Artificial Intelligence - AI)* మానవ చరిత్రలో ఒక మైలురాయిగా నిలుస్తోంది. ఇది కేవలం ఒక సాంకేతిక సాధనం కాదు; ఇది మన ఆలోచనా విధానాలను, నిర్ణయ ప్రక్రియలను, సంబంధాలను, సామాజిక నిర్మాణాలను కూడా ప్రభావితం చేసే శక్తిగా మారింది. ఒకప్పుడు మానవ మేధస్సుకే పరిమితమైన అనేక పనులు – విశ్లేషణ, అంచనా, నిర్ణయం – నేడు యంత్రాల చేతుల్లోకి వెళ్తున్నాయి. కృత్రిమ మేధస్సు ప్రభావం కేవలం కంప్యూటర్లు, రోబోట్లకే పరిమితం కాదు. అది ఆర్థిక వ్యవస్థ, పని ప్రపంచం, ఆరోగ్య సంరక్షణ, విద్య వంటి మానవ జీవితం యొక్క మూలాధార రంగాల్లోకి లోతుగా ప్రవేశించింది. ఈ నేపథ్యంలో కృత్రిమ మేధస్సు మనకు అపారమైన అవకాశాలను అందిస్తూనే, గంభీరమైన నైతిక, సామాజిక, ఆధ్యాత్మిక సవాళ్లను కూడా ముందుకు తెస్తోంది.

ఈ గ్రంథం కృత్రిమ మేధస్సు యొక్క ద్వంద్వ స్వభావాన్ని ఆశ మరియు ప్రమాదం, పురోగతి మరియు విరోధం, సామర్థ్యం మరియు మానవ గౌరవం– మానవ కేంద్రిత దృష్టితో విశ్లేషించడానికి ప్రయత్నిస్తుంది. ఈ పరిశీలనలో ప్రధానంగా ఒక ప్రశ్న నిలుస్తుంది: కృత్రిమ మేధస్సు మానవ జీవితానికి సేవ చేస్తున్నదా లేక మానవ జీవితాన్ని దాని సామర్థ్యాలకు తక్కువగా మార్చుతోందా?

## కృత్రిమ మేధస్సు మరియు ఆర్థిక–ఆర్థిక వ్యవస్థలు

కృత్రిమ మేధస్సు తన అంతర్–విభాగ స్వభావం కారణంగా ఆర్థిక మరియు ఆర్థిక వ్యవస్థలలో వేగంగా విలీనం అవుతోంది. ఒకప్పుడు ఆర్థిక నిర్ణయాలు ప్రధానంగా మానవ అనుభవం, అంచనా, నైతిక బాధ్యతల ఆధారంగా తీసుకునేవారు. నేడు అవి అల్గోరిథమ్స్, డేటా విశ్లేషణ, ఆటోమేటెడ్ మోడళ్ల చేతుల్లోకి వెళ్తున్నాయి. సాంకేతిక రంగం మాత్రమే కాకుండా, శక్తి రంగం, బ్యాంకింగ్, బీమా, స్టాక్ మార్కెట్లు, మీడియా మరియు వినియోగదారుల డేటా నిర్వహణ వంటి రంగాల్లో కృత్రిమ మేధస్సు (AI) విస్తృతంగా ఉపయోగించబడుతోంది. ముఖ్యంగా మార్కెటింగ్, అమ్మకాలు, లాజిస్టిక్స్, ఉత్పత్తి ఆప్టిమైజేషన్, సమ్మతి *(compliance)* మరియు రిస్క్ నిర్వహణ వంటి రంగాల్లో ఇది కీలక పాత్ర పోషిస్తోంది. అయితే, ఈ అభివృద్ధి ఒక గంభీరమైన ప్రమాదాన్ని కూడా బయటపెడుతోంది. కృత్రిమ మేధస్సు అనువర్తనాలు కొద్దిమంది పెద్ద కార్పోరేషన్ల చేతుల్లో కేంద్రీకృతమవుతున్నాయి. డేటా, కంప్యూటింగ్ శక్తి, అల్గోరిథమ్స్ ఇవన్నీ పెద్ద సంస్థల నియంత్రణలో ఉండటం వల్ల, కృత్రిమ మేధస్సు ద్వారా సృష్టించబడే సంపద కూడా వారికే పరిమితమయ్యే ప్రమాదం ఉంది.

ఆర్థిక శాస్త్రవేత్త జోసెఫ్ స్టిగ్లిట్జ్ చెప్పినట్లుగా, “సాంకేతిక పురోగతి సమానత్వం లేకుండా జరిగితే, అది అసమానతలను తగ్గించదు, మరింత లోతుగా చేస్తుంది.” ఈ పరిస్థితిలో చిన్న వ్యాపారాలు, స్థానిక ఆర్థిక వ్యవస్థలు, బలహీన వర్గాలు మరింత వెనుకబడే ప్రమాదం ఉంది.

## డిజిటల్ ఆర్థిక వ్యవస్థ మరియు వాస్తవ జీవితం

డిజిటల్ ప్రపంచం మరియు వాస్తవ ఆర్థిక వ్యవస్థ మధ్య ఉన్న సంబంధం

అత్యంత సున్నితమైనది. స్థానిక సందర్భాలు, చరిత్ర, సంస్కృతి, సామాజిక బంధాల ద్వారా రూపుదిద్దుకున్న ఆర్థిక వ్యవస్థలు సహజంగా వైవిధ్యభరితంగా ఉంటాయి. ఈ వైవిధ్యమే వాటి బలం. అయితే డిజిటల్ వేదికలు భౌగోళిక పరిమితులు లేనివిగా, ఎక్కువగా సజాతీయంగా, వ్యక్తిత్వం లేనివిగా మారుతున్నాయి. డేటా ఆధారిత నిర్ణయాలు మానవ అనుభవం, సంభాషణ, సాంప్రదాయ జ్ఞానాన్ని పక్కన పెట్టే ప్రమాదం ఉంది.

ఈ వైవిధ్యం ఒక సమాజం యొక్క ఆర్థిక జీవితానికి అపారమైన సంపద. ముఖ్యంగా సంక్షోభ సమయాల్లో మహమ్మారులు, ఆర్థిక మాంద్యం, సహజ విపత్తులు స్థానిక ఆర్థిక వ్యవస్థల బలమే సమాజాలను నిలబెడుతుంది. ఆర్థిక వ్యవస్థను పూర్తిగా డిజిటల్ సాంకేతికతకు అప్పగిస్తే, మానవ సంబంధాలు, పరస్పర విశ్వాసం, సంభాషణల ఆధారంగా దొరికి పరిష్కారాలు క్రమంగా కనుమరుగవుతాయి. అప్పుడు ఆర్థిక సమస్యలు కేవలం “సాంకేతిక సమస్యలుగా మారి, మానవ కోణం కోల్పోతాయి.

## పని ప్రపంచం మరియు కృత్రిమ మేధస్సు

కృత్రిమ మేధస్సు అత్యంత తీవ్ర ప్రభావం చూపుతున్న రంగాల్లో పని ప్రపంచం ఒకటి. ఒక వైపు కృత్రిమ మేధస్సు ఉత్పాదకతను పెంచి, కొత్త ఉద్యోగ అవకాశాలను సృష్టిస్తోంది. డేటా సైన్స్, నైతికత, సాఫ్ట్వేర్ అభివృద్ధి వంటి కొత్త రంగాలు రూపుదిద్దుకుంటున్నాయి. మరో వైపు, అదే కృత్రిమ మేధస్సు అనేక సంప్రదాయ ఉద్యోగాలను తొలగిస్తోంది. ఆటోమేషన్ కారణంగా మానవ శ్రమ అవసరం తగ్గుతోంది. కార్మికులు యంత్రాల వేగానికి లోబడి పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. సాధారణ పనులను ఆటోమేషన్ చేయడం ద్వారా కృత్రిమ మేధస్సు ఉత్పాదకతను పెంచుతుందని చెప్పినా, వాస్తవంలో అనేక చోట్ల కార్మికులు ఆటోమేటెడ్ నిఘా, కఠినమైన పనితీరు లక్ష్యాలు, నిరంతర ఒత్తిడికి లోనవుతున్నారు. ఫలితంగా వారి సృజనాత్మకత, స్వేచ్ఛ, గౌరవం క్షీణిస్తుంది. సైబర్నటిక్స్ పితామహుడు నార్బర్ట్ వీనర్ చెప్పినట్లుగా: “మనుషులు యంత్రాలకు సేవ చేయడానికి పుట్టలేదు; యంత్రాలు మనుషులకు సేవ చేయాలి.”

## మానవ గౌరవం మరియు ఉద్యోగ భవిష్యత్తు

కృత్రిమ మేధస్సు కొన్ని ఉద్యోగాలను పూర్తిగా తొలగిస్తోంది. కృత్రిమాన్ని మానవ శ్రమకు సహాయకంగా కాకుండా ప్రత్యామ్నాయంగా ఉపయోగిస్తే, కొద్దిమందికి అపార లాభం, అనేక మందికి పేదరికం అనే పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉంది. సామర్థ్యాన్ని మాత్రమే విలువగా చూసే ప్రపంచంలో మానవ జీవితం కేవలం ఒక ఖర్చు అంశంగా మారుతుంది. అయితే మానవ జీవితం దాని ఆర్థిక ఉత్పత్తికి ఆధారపడకుండా అంతర్గతంగా విలువైనది.

పోప్ ఫ్రాన్సిస్ హెచ్చరిస్తూ "కృత్రిమ మేధస్సు వంటి శక్తివంతమైన సాధనం బలహీనులను మరింత బలహీనులుగా చేసే నమూనాను బలోపేతం చేయకూడదు; దానికి విరుద్ధంగా, అది వారి రక్షణకు ఒక కోటగా మారాలి." పని అనేది కేవలం జీవనోపాధి కోసం మాత్రమే కాదు. అది వ్యక్తిగత వృద్ధి, సామాజిక సంబంధాలు, ఆత్మగౌరవానికి మార్గం. అందువల్ల కృత్రిమం మానవ తీర్పును భర్తీ చేయకూడదు; సహాయం చేయాలి.

## ఆరోగ్య సంరక్షణ మరియు కృత్రిమ మేధస్సు

ఆరోగ్య సంరక్షణ రంగంలో కృత్రిమ మేధస్సు అపారమైన అవకాశాలను కలిగి ఉంది. నిర్ధారణలో సహాయం చేయడం, చికిత్సలను అభివృద్ధి చేయడం, సేవలకు ప్రావీణ్యత విస్తరించడం ద్వారా ఇది వైద్య సేవలను మరింత సమర్ధవంతం చేయగలదు. అయితే, రోగి వైద్యుడు మధ్య ఉన్న మానవ సంబంధాన్ని యంత్రాలతో భర్తీ చేస్తే, ఆరోగ్య సంరక్షణ వ్యక్తిత్వం లేని వ్యవస్థగా మారుతుంది. చికిత్సకు సంబంధించిన తుది నిర్ణయాలు ఎప్పుడూ మానవుల చేతుల్లోనే ఉండాలి. ఆర్థిక సమర్థత మాత్రమే ఆధారంగా ఎవరు చికిత్స పొందాలో నిర్ణయించడం నైతికంగా అంగీకారయోగ్యం కాదు, ఎందుకంటే ప్రతి జీవితం విలువైనది.

## విద్య మరియు కృత్రిమ మేధస్సు

విద్య యొక్క లక్ష్యం కేవలం సమాచారాన్ని అందించడం కాదు; మొత్తం మానవ వ్యక్తిని రూపొందించడం. ఉపాధ్యాయుడు-విద్యార్థి మధ్య ఉన్న జీవ సంబంధమే విద్య యొక్క హృదయం. (కృత్రిమ మేధస్సు) విద్యకు సహాయక

సాధనంగా ఉపయోగించబడితే, విద్యకు ప్రావీణ్యత పెంచి, వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా మద్దతు ఇవ్వగలదు. కానీ అధికంగా కృత్రిమ మేధస్సుపై ఆధారపడితే, విద్యార్థుల విమర్శనాత్మక ఆలోచన, సృజనాత్మకత, స్వతంత్రత క్షీణించే ప్రమాదం ఉంది. పోప్ ఫ్రాన్సిస్ చెప్పినట్లుగా: 'విద్య అంటే తల, హృదయం, చేతులు మూడింటి సమన్వయం."

## ముగింపు


జర్మన్ తత్వవేత్త మార్టిన్ హైడిగర్ హెచ్చరిస్తూ "సాంకేతికత ఒక మంచి సేవకుడు కావచ్చు, కానీ చెడు యజమాని కూడా కావచ్చు." కృత్రిమ మేధస్సు మన భవిష్యత్తును నిర్ణయించే శక్తిగా మారుతోంది. కానీ ఆ భవిష్యత్తు మానవ గౌరవం, న్యాయం, సంఘీభావం మీద ఆధారపడాలి.

కృత్రిమ మేధస్సు మానవ మేధస్సును భర్తీ చేయడానికి కాదు; దాన్ని పరిపూర్ణం చేయడానికి. పని, ఆరోగ్యం, విద్య ప్రతి రంగంలో ఇది మానవునికి సేవ చేసే సాధనంగా మారినప్పుడే నిజమైన పురోగతి సాధ్యమవుతుంది. అప్పుడు మాత్రమే సాంకేతిక అభివృద్ధి మానవాళి అభివృద్ధిగా నూరుతుంది.

❋ ❋ ❋ ❋

# 8. కృత్రిమ మేధస్సు వినియోగం పట్ల వ్యక్తిగత బాధ్యత

- బ్రదర్ బలసాని ప్రభుదాస్



## 1. కృత్రిమ మేధస్సు (AI), అశ్లీల నకిలీ వీడియోలు, మరియు దుర్వినియోగం

కృత్రిమ మేధస్సు (AI) మనుషులుకు సంక్లిష్టమైన విషయాలను సులభంగా అర్థం చేసుకోవడానికి సహాయపడినపుడు, అలాగే ఏదైనా ఒక విషయం గురించి అంతర్జాలంలో వెతుకుతున్నపుడు వారికి మంచి మరియు నమ్మదగిన సమాచార వనరుల వైపు దారి చూపినపుడు, అది మానవ జీవనాన్ని ఉన్నతంగా జీవించుటకు ఉపయోగపడే ఒక మంచి సాధనంగా మారుతుంది. అయితే, నిజంలా కనిపించే తప్పుడు సమాచారం, లేదా నఖిలీ విషయాలను కృత్రిమ మేధస్సు (AI) సృష్టించే ప్రమాదం కూడా ఉంది. ఇటువంటి సమాచారం ప్రజలను సులభంగా మోసం చేయవచ్చు. కొన్ని సందర్భాల్లో ఇది ఉద్దేశపూర్వకంగా కాకుండా మనకు తెలియకుండానే జరుగుతుంది. ఉదాహరణకు, జనరేటివ్ కృత్రిమ మేధస్సు (AI) కొన్నిసార్లు నిజమైనట్టుగా కనిపించే నకిలీ సమాచారాన్ని ఇస్తుంది. దీనిని "కృత్రిమ మేధస్సు (AI) హాల్యూసినేషను అంటారు. మానవులు సృష్టించినట్లే కనిపించే విషయాలను తయారు చేయడం కృత్రిమ మేధస్సు (AI) యొక్క ముఖ్య లక్షణం కావడంతో, ఈ సమస్యలను పూర్తిగా నివారించడం చాలా కష్టం. అయినప్పటికీ, ఇటువంటి తప్పుడు సమాచారం వల్ల వచ్చే నష్టాలు తీవ్రమైనవిగా ఉండవచ్చు. అందుకే, కృత్రిమ మేధస్సు (AI)ను రూపొందించే వారు మరియు ఉపయోగించే వారు, ప్రజలకు చేరే సమాచారం నిజమైనదేనా, సరైనదేనా అనే విషయంలో బాధ్యతతో వ్యవహరించాలి.

నకిలీ సమాచారాన్ని సృష్టించే సామర్థ్యం కృత్రిమ మేధస్సు (AI)లో అంతర్లీనంగా ఉన్నప్పటికీ, ఇంకా ఎక్కువ ఆందోళన కలిగించే సమస్య ఏమిటంటే, కృత్రిమ మేధస్సు (AI)ను ఉద్దేశపూర్వకంగా దుర్వినియోగం చేసి ప్రజలను మోసం చేయడం. వ్యక్తులు లేదా సంస్థలు కావాలనే తప్పుడు విషయాలను సృష్టించి, ఇతరులను మభ్యపెట్టడం లేదా హాని కలిగించడమే లక్ష్యంగా వాటిని వ్యాప్తి చేసినప్పుడు ఇది జరుగుతుంది. దీనిలో "నకిలీ చిత్రాలు, వీడియోలు, ఆడియోలు కూడా ఉన్నాయి. ఇవి కృత్రిమ మేధస్సు (AI) అల్గోరిథమ్ సహాయంతో సవరించబడినవి లేదా పూర్తిగా సృష్టించబడినవి, కానీ ఒక వ్యక్తిని తప్పుడు విధంగా చూపిస్తాయి. డీప్‌ఫేక్‌లను ఇతరులను లక్ష్యంగా చేసుకొని హాని చేయడానికి ఉపయోగించినప్పుడు వాటి ప్రమాదం మరింత స్పష్టంగా కనిపిస్తుంది. చిత్రాలు లేదా వీడియోలు కృత్రిమమైనవైనా, అవి కలిగించే నష్టం మాత్రం నిజమైనదే. ఇవి బాధితుల హృదయాలలో "లోతైన గాయాలను" మిగులుస్తాయి మరియు వారి మానవ గౌరవానికి నిజమైన గాయాలను కలిగిస్తాయి.

ఈ కృత్రిమ మేధస్సు (AI)ను మనం విస్తృత స్థాయిలో చూసినప్పుడు, "ఇతరులతో మరియు వాస్తవంతో మన సంబంధాన్ని" వక్రీకరించడం ద్వారా, కృత్రిమ మేధస్సు (AI) ద్వారా సృష్టించబడిన తప్పుడు మీడియా సమాజపు పునాదులను నెమ్మదిగా కుదిపేస్తుంది. ఈ విషయం జాగ్రత్తగల నియంత్రణను కోరుతుంది, ఎందుకంటే తప్పుడు సమాచారం, ప్రత్యేకించి కృత్రిమ మేధస్సు (AI) ద్వారా నియంత్రించబడే లేదా ప్రభావితం చేయబడే మీడియా ఉద్దేశపూర్వకంగా కాకుండా కూడా వ్యాప్తి చెందవచ్చు. దీని ఫలితంగా రాజకీయ విభజనలు మరియు సామాజిక అశాంతి పెరిగే ప్రమాదం ఉంది. సమాజం సత్యాన్ని పట్టించుకోని స్థితికి చేరినప్పుడు, ప్రజలు అబద్ధాన్ని నిజంలాగా తయారుచేస్తారు. దీని వల్ల సామాజిక జీవనానికి ఆధారమైన పరస్పర బంధాలు మరియు పరస్పర ఆధారతలు బలహీనపడతాయి. డీప్‌ఫేక్‌ల కారణంగా ప్రజలు అన్నిటిపట్ల అనుమానం వ్యక్తం చేయడం ప్రారంభిస్తారు. కృత్రిమ మేధస్సు (AI) సృష్టించిన తప్పుడు సమాచారం వారు చూస్తున్నది, వింటున్న దానిపై ఉన్న నమ్మకాన్ని క్రమంగా చెరిపివేస్తుంది. ఫలితంగా విభజన మరియు సంఘర్షణ మరింత పెరుగుతాయి. ఈ విధమైన విస్తృత మోసం చిన్న విషయం కాదు.

పరస్పర నమ్మకముపై నిర్మించబడ్డ సమాజాన్ని ధ్వంసం చేసి, మానవ జీవన విధానంపై ప్రభావం చూపెడుతుంది.

కృత్రిమ మేధస్సు (AI) ద్వారా వ్యాపించే అసత్యాలను ఎదుర్కోవడం పరిశ్రమ నిపుణులు, మరియు ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదు; ఇది సద్బుద్ధి గల ప్రతి ఒక్కరి కర్తవ్యము. ఏ సాంకేతికత అయిన నూతన ఆవిష్కరణ అయిన మానవ గౌరవాన్ని పెంపొందిచేల ఉండాలె కాని, దానికి హాని కలిగించకూడదు. హింసను కాదు, శాంతిని ప్రోత్సహించాలి. కృత్రిమ మేధస్సు (AI) ద్వారా సృష్టించబడిన విషయాలను రూపొందించే వారు మరియు పంచే వారు, వారు వ్యాప్తి చేసే సమాచారం నిజమా కాదా అన్నదాన్ని ఎప్పుడూ జాగ్రత్తగా పరిశీలించాలి. అలాగే, మానవులను అవమానాలకు గురి చేసే సమాచారం, ఒకరిపట్ల ద్వేషం, అసహనాన్ని పెంచే సమాచారాన్ని తయారు చేయడం కాని, వ్యాప్తి చేయడం కాని చేయకూడదు. ఇతరుల లైంగిక విషయాలను, చిత్రాలను వేరొకరితో పంచుకోవడం మానివేయాలి. ఆన్‌లైన్‌లో తమ కార్యకలాపాల విషయంలో ప్రతి వినియోగదారుడు నిరంతర జాగ్రత్తతో పాటు వివేచనతో వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## 2. కృత్రిమ మేధస్సు (AI), గోప్యత మరియు నిఘా

మనుషులు స్వభావపరంగా ఇతరులతో కలసి మెలసి జీవించే స్వభావం కలిగిన వారు. మనం అంతర్జాలంలో సృష్టించే, లేదా అడిగే ప్రతిది కూడా మనకున్న అభిరుచులను తెలియజేస్తాయి. అంతర్జాలంలో వెతికె ప్రతి దాని వలన మన వ్యక్తిగత గోప్యత కలిగిన విషయాలు దాన్ని నడిపించే సర్వర్‌లో ఉండిపోతాయి. నిరంతరం మనం అంతర్జాలం వాడటం వలన అది మన మనస్సుకు ఎటువంటి విషయాలు కావాలో అంచనా వేసుకుని మనకు ఇస్తుంది. ఈ కోణంలో చూస్తే, వ్యక్తి అంతర్గత జీవిత సరిహద్దులను కాపాడటంలో గోప్యత కీలక పాత్ర పోషిస్తుంది. గోప్యత వల్ల, ఇతరులతో స్వేచ్ఛగా సంబంధం పెట్టుకోవడం, తనను తాను వ్యక్తపరచడం, మరియు ఇతరుల నియంత్రణ లేకుండా నిర్ణయాలు తీసుకోవడం సాధ్యమవుతుంది. ఈ రక్షణ మత స్వేచ్ఛ రక్షణతో కూడా బలంగా అనుసంధానమై ఉంది, ఎందుకంటే నిఘా (సర్వైలెన్స్)ను విశ్వాసుల జీవితాలను నియంత్రించడానికి, వారు తమ విశ్వాసాన్ని ఎలా వ్యక్తపరుస్తారో

నియంత్రించడానికి కూడా కొంతమంది దుర్వినియోగం చేసేవారు ఈ సమాజంలో ఉన్నారు. అందువల్ల, గోప్యత అనే అంశాన్ని "ఏ పరిస్థితుల్లోనైనా" మానవ వ్యక్తి యొక్క న్యాయసమ్మత స్వేచ్ఛ మరియు అపహరణకు గురి కాని వ్యక్తిగత గోప్యత పట్ల శ్రద్ధతో పరిశీలించడం సముచితమైనది. రెండవ వాటికన్ మహాసభ, "నిజమైన మానవ జీవితాన్ని జీవించడానికి అవసరమైన" మౌళిక హక్కులలో "వ్యక్తిగత గోప్యతను కాపాడుకునే హక్కు"ను కూడా చేర్చింది. ఈ హక్కు ప్రతి మనిషికి వారి "ఉన్నత గౌరవం" కారణంగా వర్తించాల్సినదిగా పేర్కొనబడింది. అంతేకాక, వ్యక్తికి మంచి పేరు ఉండే హక్కు, శారీరక మరియు మానసిక సమగ్రతను రక్షించుకునే హక్కు, హాని లేదా అనవసర జోక్యం నుండి విముక్తిగా ఉండే స్వేచ్ఛ వంటి హక్కులను ధృవీకరించే సందర్భంలో, వ్యక్తిగత జీవితం పట్ల న్యాయమైన గౌరవం ఉండాల్సిన హక్కును కూడా శ్రీసభ సమర్థించింది. ఇవన్నీ మానవ వ్యక్తిలో సహజంగా ఉన్న గౌరవాన్ని తగిన విధంగా గౌరవించడానికి అత్యంత ముఖ్యమైన అంశాలు.

ఈ రోజుల్లో కృత్రిమ మేధస్సు (AI) ఆధారిత డేటా విశ్లేషణ చాలా ముందుకు వెళ్లింది. ఒక వ్యక్తి గురించి చాలా తక్కువ సమాచారం ఉన్నా, అతని ప్రవర్తన, అలవాట్లు, ఆలోచనా విధానాన్ని కూడా కృత్రిమ మేధస్సు (AI) అంచనా వేయగలదు. అందుకే వ్యక్తిగత డేటా గోప్యతను కాపాడటం మానవ గౌరవానికి, మనుషుల మధ్య ఉన్న సంబంధాలకు చాలా అవసరం. పోప్ ఫ్రాన్సిస్ గారు చెప్పినట్టుగా, ఒకవైపు మనుషులు ఎవ్వరికీ పట్టనట్టుగా, సహనంలేని వైఖరితో మారుతున్నారు; మరోవైపు సాంకేతికత వల్ల దూరాలు పూర్తిగా తగ్గిపోయాయి. ఈ పరిస్థితిలో వ్యక్తిగత గోప్యత అనే హక్కు దాదాపు కనుమరుగవుతోంది. ప్రతి విషయం ఒక ప్రదర్శనలా మారిపోయి, మనుషుల జీవితం ఎప్పుడూ పర్యవేక్షణలో ఉన్నట్టుగా మారింది.

కృత్రిమ మేధస్సు (AI)ని మానవ గౌరవానికి, సామూహిక మేలుకు అనుగుణంగా ఉపయోగించే సరైన మార్గాలు ఉండొచ్చు. కానీ అదే కృత్రిమ మేధస్సు (AI)ని మనుషులను పర్యవేక్షించడానికి, వారి స్వేచ్ఛను పరిమితం చేయడానికి, దోపిడీ చేయడానికి లేదా కొద్ది మందికి లాభం చేకూర్చి చాలా మందికి నష్టం కలిగించే విధంగా ఉపయోగించడం నైతికంగా తప్పు. కాబట్టి

పర్యవేక్షణ వ్యవస్థలపై సరైన నియంత్రణ ఉండాలి, పారదర్శకతతో పాటు ప్రజల ముందు బాధ్యత కూడా ఉండాలి. అధికారంలో ఉన్నవారు తమ పరిమితులను దాటకూడదు; ఎందుకంటే ప్రతి వ్యక్తి యొక్క గౌరవం మరియు స్వేచ్ఛే న్యాయమైన, మానవీయ సమాజానికి పునాది. అలాగే మానవ గౌరవాన్ని నిజంగా గౌరవించాలంటే, ఒక వ్యక్తిని కేవలం డేటా సమాహారంగా చూడకూడదు. ముఖ్యంగా కృత్రిమ మేధస్సు (AI) ద్వారా వ్యక్తులను లేదా సమూహాలను వారి ప్రవర్తన, లక్షణాలు, గత చరిత్ర ఆధారంగా అంచనా వేసే సోషల్ స్కోరింగు విధానం చాలా ప్రమాదకరం. ఇలాంటి డేటాలో సమాజపు పక్షపాతాలు ఉండొచ్చు. ఒక మనిషి గతాన్ని ఆధారంగా చేసుకుని అతనికి మారే అవకాశం, ఎదిగే అవకాశం, సమాజానికి మేలు చేసే అవకాశం దూరం చేయకూడదు. మానవ గౌరవం ఎప్పటికీ యంత్రాల నిర్ణయాలపై ఆధారపడకూడదు.

### 3. కృత్రిమ మేధస్సు (AI) మరియు పర్యావరణ పరిరక్షణ

మన అందరికి ఒకే నివాసమైన భూమితో మన సంబంధాన్ని మెరుగుపరచడానికి కృత్రిమ మేధస్సు (AI) అనేక ఆశాజనకమైన అవకాశాలను అందిస్తుంది. ఉదాహరణకు, తీవ్ర వాతావరణ ఘటనలను ముందుగా అంచనా వేసే నమూనాలను రూపొందించడం, వాటి ప్రభావాన్ని తగ్గించడానికి ఇంజినీరింగ్ పరిష్కారాలను సూచించడం, సహాయ మరియు పునరావాస కార్యక్రమాలను సమర్థంగా నిర్వహించడం, అలాగే జనాభా మార్పులను ముందుగా ఊహించడం వంటి రంగాల్లో కృత్రిమ మేధస్సు (AI) సమగ్రంగా పని చేయగలదు. అంతేకాక, స్థిరమైన వ్యవసాయానికి మద్దతు ఇవ్వడం, శక్తి వినియోగాన్ని సమర్థవంతంగా చేయడం, ప్రజారోగ్య అత్యవసర పరిస్థితులకు ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను అందించడంలో కూడా కృత్రిమ మేధస్సు (AI) సహాయపడుతుంది. ఇటువంటి నూతన సాంకేతిక పురోగతి వలన వాతావరణ మార్పుల వల్ల ఏర్పడే సవాళ్లను ముందుగానే అంచనావేసి వాటినుండి మనల్ని మనం ఎలా కాపాడుకోవాలని ముందస్తు ప్రణాళికలు చేయగలదు.

కాని, ఈ రోజుల్లో ఉపయోగిస్తున్న కృత్రిమ మేధస్సు (AI) సిస్టమ్స్‌కి, వాటిని నడిపే కంప్యూటర్లు మరియు డేటా సెంటర్లకి చాలా ఎక్కువగా కరెంట్,

నీరు కావాలి. ఇవన్నీ ఉపయోగించడం వల్ల కార్బన్ డయాక్సైడ్ వాయువు ఎక్కువగా విడుదల అవుతుంది, దాంతో ప్రకృతి నష్టపోతుంది. మనం సాధారణంగా "క్లౌడు అని వింటే, డేటా ఏదో గాలిలో ఉన్నట్టు అనిపిస్తుంది. కానీ నిజంగా క్లౌడ్ అంటే గాలిలో ఉన్నది కాదు. అది పెద్ద పెద్ద సర్వర్లు, వైర్లు, యంత్రాలు, కూలింగ్ సిస్టమ్స్ ఉన్న భౌతిక స్థలం. ఇవన్నీ నడవాలంటే నిరంతరం కరెంట్ కావాలి. కృత్రిమ మేధస్సు (AI) సాంకేతిక కూడా అలాగే. ముఖ్యంగా పెద్ద పెద్ద కృత్రిమ మేధస్సు (AI) మోడల్స్ రోజురోజుకీ పెద్దవిగా మారుతున్నాయి. వాటికి ఎక్కువ డేటా, శక్తివంతమైన కంప్యూటర్లు, ఎక్కువ స్టోరేజ్ కావాలి. దాంతో ఇంకా ఎక్కువ ఎనర్జీ ఖర్చవుతుంది. అందుకే ఈ టెక్నాలజీ వల్ల మన భూమికి భారంగా మారుతోంది. కాబట్టి భవిష్యత్తులో కృత్రిమ మేధస్సు (AI)ని ఉపయోగిస్తూనే, ప్రకృతికి తక్కువ నష్టం చేసే విధానాలు తయారు చేయడం చాలా అవసరం. మనం ఉన్న ఈ భూమి మన అందరి ఇల్లు కాబట్టి, దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరికీ ఉంది.

ఫ్రాన్సిస్ పాపుగారు బోధించినట్టుగా, సమస్యలకు పరిష్కారం కేవలం సాంకేతికలో మాత్రమే వెతకకూడదు. నిజమైన మార్పు రావాలంటే మనుషుల ఆలోచనలు, విలువలు, జీవన విధానం కూడా మారాలి. యంత్రాలు ఎంత అభివృద్ధి అయినా, మన మనసు మారకపోతే సమస్యలు అలాగే ఉంటాయి. దేవుడు సృష్టించిన ఈ లోకంలో ఉన్న ప్రతి దానికి వాటి అంతట వాటికే విలువ ఉంది. ప్రకృతిని కేవలం మన అవసరాలకు ఉపయోగపడే వస్తువులా చూడకూడదు. అలా చూస్తే సృష్టి పట్ల గౌరవం తగ్గిపోతుంది. ఈరోజుల్లో కనిపించే ఒక తప్పు ఆలోచన ఏమిటంటే,మనిషి అన్నింటికీ కేంద్రం అని భావించి, ప్రకృతి నుంచి సాధ్యమైనంత అన్నీ తీసుకోవాలి అని ఆలోచిస్తున్నాడు.. అలాగే "కొత్త సాంకేతిక వస్తే చాలు, పర్యావరణ సమస్యలు వాటి అంతట అవే పరిష్కారమవుతాయి" అనే తప్పుడు అభివృద్ధి నమ్మకం కూడా ప్రమాదకరం. దీనిలో నైతిక బాధ్యతకూ, లోతైన మార్పుకూ చోటు ఉండదు. ఈ ఆలోచనల స్థానంలో, సృష్టి క్రమాన్ని గౌరవించే దృష్టికోణం అవసరం. అది మనిషి సంపూర్ణ మేలును ప్రోత్సహించాలి, అలాగే మన అందరి ఇల్లు అయిన ఈ భూమిని జాగ్రత్తగా కాపాడాలి. అప్పుడే నిజమైన, సమతుల్యమైన అభివృద్ధి సాధ్యమవుతుంది.

## 4. కృత్రిమ మేధస్సు (AI) మరియు యుద్ధాలు

రెండో వాటికన్ మహాసభ మరియు ఆ తర్వాత వచ్చిన పాపుగార్ల బోధనల ప్రకారం, శాంతి అంటే కేవలం యుద్ధం లేకపోవడం మాత్రమే కాదు, శత్రువుల మధ్య శక్తి సమతుల్యం ఉండడమూ కాదు. పునీత అగస్తీను గారు చెప్పినట్టు, శాంతి అంటే దేవుడు ఏర్పాటు చేసిన సహజమైన క్రమ జీవితంలో జీవించడం. నిజమైన శాంతి రావాలంటే ప్రతి మనిషి యొక్క జీవితం, గౌరవం, హక్కులు కాపాడబడాలి. వ్యక్తులు మరియు ప్రజల మధ్య స్వేచ్ఛగా సంభాషణ జరగాలి. పరస్పర గౌరవం మరియు అన్నదమ్ముల్లా కలిసి జీవించే భ్రాతృత్వం నిరంతరం ఉండాలి. శాంతి అనేది న్యాయం వల్ల పుడుతుంది, ప్రేమ వల్ల పెరుగుతుంది. బలవంతం లేదా హింసతో దాన్ని సాధించలేం, ఐక్యత, ప్రతి మనిషి సంపూర్ణ అభివృద్ధి మరియు అందరి గౌరవాన్ని గౌరవించడం ద్వారా మాత్రమే శాశ్వత శాంతి నిర్మించబడుతుంది. ఇతర వ్యక్తులు మరియు దేశాల గౌరవాన్ని గుర్తించి, వారితో అన్నదమ్ముల్లా వ్యవహరించాలనే దృఢమైన సంకల్పంతోనే నిజమైన శాంతి నిలబడుతుంది.

కృత్రిమ మేధస్సు (AI)కి ఉన్న విశ్లేషణ శక్తి దేశాలకు శాంతి సాధించడానికి, భద్రతను కాపాడడానికి సహాయపడవచ్చు. కానీ అదే కృత్రిమ మేధస్సు (AI)ని ఆయుధాలుగా మార్చినప్పుడు పెద్ద సమస్యలు వస్తాయి. పోప్ ఫ్రాన్సిస్ గారు చెప్పినట్టుగా, దూరం నుంచి నియంత్రించే యుద్ధ వ్యవస్థల వల్ల యుద్ధం చేసే వాళ్లకు జరిగే నాశనం స్పష్టంగా అనిపించదు. అందుకే ఆయుధాలు ఉపయోగించే బాధ్యత కూడా తగ్గిపోయినట్టుగా ఉంటుంది, యుద్ధం వల్ల కలిగే బాధను చల్లగా, నిర్లక్ష్యంగా చూడటం జరుగుతుంది. ఇలా చేయడం వల్ల యుద్ధం తేలికగా చేయదగినదిగా మారుతుంది. స్వీయ రక్షణ కోసం చివరి మార్గంగా మాత్రమే యుద్ధం చేయాలి అనే సూత్రం కూడా బలహీనపడుతుంది. మానవ నియంత్రణకు అందని స్వయంచాలక ఆయుధాలు పెరగడం వల్ల ఆయుధ పోటీ మొదలై, మానవ హక్కులకు తీవ్రమైన నష్టం కలిగే ప్రమాదం ఉంది. ప్రత్యేకంగా మానవ నియంత్రణ లేకుండానే లక్ష్యాన్ని గుర్తించి దాడి చేసే స్వయంచాలక హత్యాయుధాలు (Lethal Autonomous Weapon Systems) చాలా తీవ్రమైన నైతిక సమస్యగా మారాయి. ఎందుకంటే యంత్రాలకు మనుషుల్లాంటి నైతిక విచక్షణ, మంచి–

చెడును తూకం వేసే సామర్థ్యం ఉండదు. ఈ కారణంగా పోప్ ఫ్రాన్సిస్ గారు ఇటువంటి ఆయుధాల అభివృద్ధిని గంభీరంగా పునరాలోచించాలని, వాటి వినియోగాన్ని నిషేధించాలని బలంగా కోరుతున్నారు. ముఖ్యంగా ఆయుధాలపై నిజమైన, స్పష్టమైన మానవ నియంత్రణ ఉండాలని ఆయన అంటున్నారు. ఒక యంత్రం ఎప్పటికీ ఒక మనిషి ప్రాణం తీసే నిర్ణయం తీసుకోకూడదు అనే విషయం ఆయన స్పష్టంగా చెబుతున్నారు.

స్వయంగా లక్ష్యాన్ని గుర్తించి ఖచ్చితంగా చంపగల యంత్రాల నుంచి, పెద్ద స్థాయిలో విధ్వంసం చేసే ఆయుధాల వరకు వెళ్లడం పెద్ద దూరం కాదు. అందుకే కొంతమంది కృత్రిమ మేధస్సు (AI) శాస్త్రవేత్తలు ఈ టెక్నాలజీ వల్ల మొత్తం ప్రాంతాలే కాదు, మానవ జాతి భవిష్యత్తుకే ప్రమాదం ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నియంత్రణ లేకుండా పనిచేసే ఆయుధాలు అమాయక ప్రజలను, పిల్లలను కూడా చంపే శక్తిని యుద్ధానికి ఇస్తున్నాయనే భయం ఇక్కడ స్పష్టంగా కనిపిస్తుంది. అందుకే *Gaudium et spes* చెప్పినట్టుగా, యుద్ధాన్ని పూర్తిగా కొత్త దృష్టితో పరిశీలించాల్సిన అవసరం ఈ రోజుల్లో మరింత అత్యవసరమైంది. అలాగే, భవిష్యత్తులో వచ్చే ప్రమాదాలకంటే కూడా, చెడు ఉద్దేశాలతో ఉన్న మనుషులు కృత్రిమ మేధస్సు (AI)ని దుర్వినియోగం చేసే ప్రమాదం ఇంకా దగ్గరలో ఉంది. కృత్రిమ మేధస్సు (AI) అనేది ఒక సాధనం మాత్రమే; కానీ చరిత్రలో మనుషులు తమ చేతుల్లో ఉన్న శక్తిని ఎలా దుర్వినియోగం చేశారో మనకు బాగా తెలుసు. పునీత జాన్ పాల్ II గారు చెప్పినట్టు, మనకు ఇప్పుడు అపారమైన శక్తి ఉంది–ఈ లోకాన్ని తోటలా మార్చగలమో, లేక శిథిలాల గుట్టగా మార్చగలమో మన చేతుల్లోనే ఉంది. ఫ్రాన్సిస్ పాపుగారు గుర్తు చేసినట్టుగా, మన బుద్ధిని మంచికి కూడా ఉపయోగించవచ్చు, పరస్పర విధ్వంసానికి కూడా ఉపయోగించవచ్చు. మానవ జాతి స్వయంగా నాశనం కాకుండా ఉండాలంటే, మానవ జీవితం మరియు గౌరవాన్ని ముప్పుకు గురిచేసే ప్రతి సాంకేతికతను వినియోగాన్ని స్పష్టంగా తిరస్కరించాలి. ముఖ్యంగా సైనిక రంగంలో కృత్రిమ మేధస్సు (AI) ఉపయోగం మానవ గౌరవాన్ని కాపాడుతూ, సామూహిక మేలు కోసం మాత్రమే ఉండాలి. ఆయుధాల్లో కృత్రిమ మేధస్సు (AI) అభివృద్ధి మరియు వినియోగం అత్యున్నత నైతిక ప్రమాణాల కింద, మానవ జీవితం పవిత్రతను గౌరవిస్తూ జరగాలి.

# 9. కృత్రిమ మేధస్సు విగ్రహారాధనతో సమానమా?

– బ్రదర్ బాసాని ధీరజ్

## పరిచయం



సాంకేతిక విజ్ఞానం (టెక్నాలజీ) ప్రపంచంలోని వనరులను చూసుకోవడానికి, అభివృద్ధి చేయడానికి మనకు చాలా మంచి సాధనాలు ఇస్తుంది. కానీ కొన్ని సందర్భాల్లో మనుషులు ఆ వనరులపై ఉన్న నియంత్రణను యంత్రాలకు అప్పగిస్తున్నారు. కొంతమంది శాస్త్రవేత్తలు మరియు భవిష్యత్తు గురించి ఆలోచించే వారు, మనిషి మేధస్సుతో సమానంగా లేదా అంతకంటే ఎక్కువగా ఆలోచించే **AGI (Artificial General Intelligence)** అనే కృత్రిమ మేధస్సు (AI) గురించి ఆశావహంగా మాట్లాడుతున్నారు. అది వస్తే అద్భుతమైన అభివృద్ధి జరుగుతుందని కొందరు నమ్ముతున్నారు. అదే సమయంలో, సమాజం దేవుడితో ఉన్న బంధం నుండి దూరమవుతున్న కొద్దీ, కొంతమంది జీవితం యొక్క అర్థం, సంతోషం కోసం కృత్రిమ మేధస్సు (AI) వైపు మొగ్గు చూపుతున్నారు. కానీ నిజానికి ఈ లోతైన తపనలను పూర్తిగా తీర్చగలిగేది దేవుడితో ఉన్న సన్నిహిత సంబంధమే అని గుర్తించలేకపోతున్నారు.

## విగ్రహారాధన

మన చేతులతో తయారు చేసిన వస్తువును దేవుడి స్థానంలో పెట్టడం విగ్రహారాధన అవుతుంది. బైబిల్ స్పష్టంగా దీనిని హెచ్చరిస్తుంది. సాధారణ విగ్రహాలకు మాట్లాడే నోరు, చూసే కళ్ళు, వినే చెవులు లేవు. కానీ కృత్రిమ మేధస్సు (AI) మాత్రం మాట్లాడినట్టు అనిపిస్తుంది. అందుకే అది మరింత ఆకర్షణీయంగా, ప్రమాదకరంగా మారుతుంది. కానీ మనం గుర్తుంచుకోవాల్సిన

విషయం ఏమిటంటే–కృత్రిమ మేధస్సు (AI) మనిషి ప్రతిబింబం మాత్రమే. దానిని మనుషులే తయారు చేశారు, మనుషుల సమాచారంతోనే నేర్చుకుంది, మనుషుల సూచనలకే స్పందిస్తుంది, మనుషుల శ్రమ వల్లే పనిచేస్తుంది. కృత్రిమ మేధస్సు (AI)కి మనుషుల్లాంటి జీవితం, ఆత్మ, లోతైన అవగాహన ఉండదు; అది తప్పులు కూడా చేస్తుంది. మనుషులు కృత్రిమ మేధస్సు (AI)ని తమకంటే గొప్పదిగా భావించి, దానితో జీవితం పంచుకోవాలని ప్రయత్నిస్తే, అది దేవుడికి బదులుగా ఒక తప్పుడు స్థానం ఇచ్చినట్టే. చివరికి ఆరాధించబడేది కృత్రిమ మేధస్సు (AI) కాదు–మనుషులే తమ సృష్టికి బానిసలవుతారు.

కృత్రిమ మేధస్సు (AI) మనుషులుకు ఉపయోగపడవచ్చు, సమాజానికి మేలు చేయవచ్చు. కానీ అది మన చేతులతో చేసిన సృష్టి మాత్రమే. అందులో మనుషుల ప్రతిభ, తెలివి ముద్ర ఉంది. కాబట్టి దానికి అవసరానికి మించిన విలువ ఇవ్వకూడదు. బైబిల్ ఇలా చెబుతుంది: “విగ్రహాలను మనిషే తయారు చేస్తాడు. కానీ మనిషి దేవుడిలా ఒక దేవుణ్ణి సృష్టించలేడు. మనిషికి జీవం ఉంది, కానీ అతను చేసిన వస్తువులకు జీవం లేదు. అందుకే మనిషి తాను ఆరాధించే వస్తువులకంటే గొప్పవాడు.”

దీనికి భిన్నంగా, మనిషి లోపల ఉన్న ఆధ్యాత్మిక జీవితం మొత్తం భౌతిక ప్రపంచాన్ని మించిపోతుంది. మన హృదయంలోకి మనం వెళ్లినప్పుడు, అక్కడ దేవుడు మన కోసం ఎదురుచూస్తుంటాడు. అక్కడే మన జీవితం ఏ దారిలో వెళ్లాలన్న నిర్ణయం దేవుని సన్నిధిలో తీసుకుంటాము.

ఫ్రాన్సిస్ పాపుగారు చెప్పినట్లుగా, హృదయంలోనే మనల్ని మనం తెలుసుకుంటాం, అలాగే ఇతరులకు మనల్ని అర్పించుకోవడం నేర్చుకుంటాం. మన ప్రత్యేకతను గుర్తించడమూ, ఇతరుల కోసం జీవించడమూ రెండూ అక్కడే కలుస్తాయి.

మన హృదయమే దేవుని ముందు వినయంగా, ప్రేమతో నిలబడగలదు. దేవుడు ప్రతి వ్యక్తిని ఒక “నీవు (Thou)”గా చూస్తాడు–ఎప్పటికీ, ఎల్లప్పుడూ ప్రేమతో.

సాంకేతిక పరిజ్ఞానం వల్ల ఎదురయ్యే వివిధ సవాళ్లను పరిగణనలోకి తీసుకుంటూ, ఈ సాంకేతికత తీసుకువచ్చే అభివృద్ధికి అనుగుణంగా “మానవ

బాధ్యత, విలువలు మరియు ప్రత్యేకంగా ప్రతి మానవుడు తన మనస్సాక్షిని పరీక్షించుకుంటూ బ్రతికే అవసరం ఉందని ఫ్రాన్సిస్ పాపుగారు నొక్కి చెప్పారు. అదే సమయంలో, "ఈ అభివృద్ధికి అనుగుణంగా మనిషి, మనిషిగా, తన మానవత్వాన్ని కాపాడుతూ మరింత అవగాహన కలిగి ఉన్నాడా, మరింత బాధ్యతాయుతంగా, ఇతరులకు, ముఖ్యంగా అవసరమైన వారికి మరియు బలహీనులకు మరింత తోడుగా ఉన్నాడా, అందరికీ సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నాడా" అనేది ముఖ్యమైన మరియు ప్రాథమిక ప్రశ్నగా మిగిలిపోయింది. ఫలితంగా, సాంకేతిక పరిజ్ఞానం దాని ఉపయోగం మానవ గౌరవాన్ని, మానవ వృత్తిని మరియు మంచిని ప్రోత్సహిస్తూ ప్రత్యేక సందర్భాలలో కృత్రిమ మేధస్సు (AI) యొక్క వ్యక్తిగత ప్రయోజనాలను ఎలా పరిశీలన చేయాలో తెలుసుకోవడం చాలా ముఖ్యం. అనేక సాంకేతిక పరిజ్ఞానాల మాదిరిగానే, కృత్రిమ మేధస్సు (AI) యొక్క వివిధ ఉపయోగాల ప్రభావాలను వాటి ప్రారంభం నుండే ఊహించలేము. ఈ పరిమాణలను మరియు వాటి ప్రభావాలు స్పష్టంగా మారుతున్నందున, సమాజంలోని అన్ని స్థాయిలలో ప్రత్యేకంగా వ్యక్తిగత వినియోగదారులు, కుటుంబాలు, పౌర సమాజాలు, సంస్థలు, ప్రభుత్వాలు మరియు అంతర్జాతీయ సంస్థలు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకోవడంలో కేంద్రకృతమై జీవించాలి. ఇరవైవ శతాబ్దపు తత్వవేత్త నికోలస్ బెర్ద్యావ్, ప్రజలు తరచుగా వ్యక్తిగత మరియు సామాజిక సమస్యలకు యంత్రాలను నిందిస్తారని గమనించాడు; అయితే, "ఇది మనిషిని అవమానపరుస్తుంది మరియు అతని గౌరవానికి అనుగుణంగా ఉండదు," ఎందుకంటే "మనిషి నుండి యంత్రానికి బాధ్యతను బదిలీ చేయడం అనర్హమైనది." మానవుడు మాత్రమే నైతికంగా బాధ్యత వహించగలడు మరియు సాంకేతిక సమాజం యొక్క సవాళ్లు చివరికి ఆధ్యాత్మిక స్వభావం కలిగి ఉంటాయి. అందువల్ల, ఆ సవాళ్లను ఎదుర్కోవడానికి "ఆధ్యాత్మికతను తీవ్రతరం చేయడం అవసరం." అని హితబోధచేసాడు.

ఫ్రెంచ్ కతోలిక రచయిత జార్జెస్ బెర్నానోస్ "బాల్యం నుండి సాంకేతిక పరిజ్ఞానికి అలవాటు పడిన పురుషుల సంఖ్య పెరుగుతోంది" అని హెచ్చరించారు.

జీవితంలోని లెక్కించలేని అంశాలను పక్కన పెట్టి, ఆపై మానవ మనుగడను మరిచిపోతున్నారు. కృత్రిమ మేధస్సు (AI)ని దాని గొప్పతనాన్ని భర్తీ చేయడానికి బదులుగా మానవ మేధస్సును పూర్తి చేయడానికి ఒక సాధనంగా మాత్రమే ఉపయోగించాలి. కానీ అది మానవ మేధస్సుకు, మానవ మనుగడకు అంతు చిక్కని ప్రశ్నగా మారితే అది మానవ జీవితానికే ప్రమాదం అని గుర్తుంచాలి, మూసివేసిన తలుపు కింద మెల్లగా కురుస్తున్న పొగమంచులాగా నివసించే "నిజమైన మానవత్వాన్ని" కాపాడుకోవడానికి చాలా ముఖ్యమైనది.

## నిజమైన జ్ఞానం

ప్రాపంచిక జ్ఞానం మరియు ఆధునిక వ్యామోహాలు విస్తారమైనందున నైతిక విలువలు ఇంద్రియ జ్ఞానం ప్రశ్నార్థకంగా మారి ప్రతిమానవుడిలో కనుమరుగైపోతున్నాయి. కావున ప్రతిమానవుడు నిజమైన జ్ఞానాన్ని సాధించడానికి అనునిత్యం కృషి చేయాలి.

కృత్రిమ మేధస్సు (AI) ద్వారా ఎదురయ్యే లోతైన ప్రశ్నలు మరియు నైతిక సవాళ్లను పరిష్కరించడానికి మానవజాతికి దేవుడు అనుగ్రహించిన అత్యంత అవసరమైన బహుమతి ఇంద్రియజ్ఞానం: "వాస్తవికతను చూసే ఆధ్యాత్మిక మార్గాన్ని అలవరచుకోవడం ద్వారా మనం ఈ కాలపు నూతనత్వాన్ని అర్థం చేసుకోగలము. దేవుడు మానవునికి అనుగ్రహించిన ఇంద్రియజ్ఞానం" "యంత్రాల నుండి పొందలేము," ఇంద్రియజ్ఞానం మరియు వివేకం మనలను యంత్రాల నుండి వేరుచేసి మనలను ఈ సృష్టిలో ప్రత్యేకులుగా నిలబెడుతున్నాయి. "దానిని వెదికేవారికి లభించేలా చేస్తుంది మరియు దానిని ప్రేమించేవారికి కనిపించేలా చేస్తుంది; అది దానిని కోరుకునే వారిని ముందుగానే గ్రహిస్తుంది, మరియు దానికి అర్హులైన వారిని వెతుక్కుంటూ వెళుతుంది" (జ్ఞానగ్రంథం 6:12-16).

కృత్రిమ మేధస్సుతో నిండిన ఈ ప్రపంచంలో, మనకు పవిత్రాత్మ అనుగ్రహం అవసరం, ఎందుకంటే ఆయన "దేవుని కళ్ళతో విషయాలను చూడటానికి, సంబంధాలను, పరిస్థితులను, సంఘటనలను గ్రహించడానికి మరియు వాటి నిజమైన అర్థాన్ని వెలికితీయడానికి మనకు అనునిత్యం శక్తినిస్తాడు.

## ముగింపు

"ఒక వ్యక్తి యొక్క సంపూర్ణత వారికీ ఉన్న సమాచారం లేదా జ్ఞానం ద్వారా కాకుండా, వారికి ఉన్న మానవత్వం లోతు ద్వారా కొలవబడుతుంది" కాబట్టి, మన తోటి సోదరులతో, నిస్సహాయులతో బలహీనులతో మరియు అత్యంత అవసరంలో ఉన్నవారితో సన్నిహితంగా ఉంటూ" మనం కృత్రిమ మేధస్సును ఎలా ఉపయోగించుకుంటామో, అదే "మన మానవత్వానికి నిజమైన కొలమానం అవుతుంది. విశ్వాసులు మానవత్వాన్ని కోల్పోకుండా మరియు సమాజం యొక్క అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుంటూ ప్రతి మానవుడు ఈ సాంకేతికతను సరైన మార్గంలో ఉపయోగించగల నైతిక విశ్వాసులుగా వ్యవహరించగలరు. నిరంతర అన్వేషణలో, యేసుక్రీస్తు యొక్క అడుగుజాడలలో ఆధునిక ప్రపంచంలో నైతిక విలువలను కోల్పోకుండా నిజమైన మానవులుగా జీవించాలి.

❋ ❋ ❋ ❋

# తెలుగు కతోలిక దైవశాస్త్ర సమాఖ్య 11వ సదస్సు
























**భక్త యోహాను ప్రచురణలు**

భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం

రామంతపురం, హైదరాబాదు-500 013. ఫోన్ : 91-040-29561761, 29561762

e-mail: stjohnshyd2@gmail.com | www.stjohnseminaryhyd.org

Printed at : Jeevan Institute of Printing